





ESTD: 1999

www.voodayam.com

# వుదయం








కరీంనగర్ | 11-06-2026 గురువారం | సంపుటి : 14 | సంచిక :175 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal   Follow us on




## బహుళ అంచెల భద్రత : ఎన్‌టీఏ

**న్యూఢిల్లీ, జూన్ 10 (వుదయం) :** నీట్ (యూజీ) రీఎగ్జామ్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులను తీవ్ర గందరగోళానికి గురిచేసేలా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న ఒక సర్క్యులర్‌పై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) తీవ్రంగా స్పందించింది. నీట్ పరీక్షా విధానాన్ని (ఎగ్జామ్ ప్యాటర్న్) సవరించినట్లుగా జరుగుతోన్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ సర్క్యులర్ పూర్తిగా నకిలీదని, ఎన్‌టీఏ అలాంటి అధికారిక నోటీసు ఏదీ జారీ చేయలేదని పీఐబీ (PIB) ఫ్యాక్ట్‌చెక్ విభాగం కూడా స్పష్టం చేస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్టు పెట్టింది. పరీక్షలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా అభ్యర్థులు కేవలం అధికారిక వెబ్‌సైట్లు, వేదికల్లో మాత్రమే చూసి ధృవీకరించుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. నీట్ పరీక్షకు సంబంధించిన అధికారిక సమాచారం, తాజా అప్‌డేట్స్ కోసం విద్యార్థులు నిరంతరం neet.nta.nic.in వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని కోరింది.

## భారీగా దిగివచ్చిన బంగారం, వెండి ధరలు



**ముంబయి, జూన్ 10 (వుదయం) :** గత కొంతకాలంగా సరికొత్త రికార్డులతో దూసుకుపోతున్న పసిడి, వెండి ధరలు దేశీయ మార్కెట్లో ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో చోటుచేసుకున్న వేగవంతమైన పరిణామాల నేపథ్యంలో బులియన్ మార్కెట్ భారీ క్షీణతను నమోదు చేసింది. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర ఏకంగా రూ.4,300 మేర తగ్గి, అన్ని పన్నులతో కలుపుకొని రూ.1.56 లక్షల మార్కుకు చేరింది. పసిడి బాటలోనే వెండి సైతం భారీగా పతనమైంది. కిలో వెండి ధర దాదాపు రూ.10,000 మేర క్షీణించి రూ.2.45 లక్షల (అన్ని పన్నులూ కలిపి) వద్ద పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఇదే పరిస్థితి నెలకుంది. గ్లోబల్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే 90 డాలర్లు క్షీణించి 4,168 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అలాగే వెండి ధర కూడా 2.24 శాతం మేర తగ్గి, ఔన్సు 63.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



### ఫ్యూచర్ సిటీ
# మన కోసం కాదు.. ప్రపంచం కోసం

**హైదరాబాద్ జూన్ 10 (వుదయం) :** ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచం కోసమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన, అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రికార్డు స్థాయిలో కేవలం 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని అద్భుతంగా తీర్చిదిద్దుతామని, 2034 నాటికి రాష్ట్రం ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగడంలో ఈ సిటీ కీలక పాత్ర పోషిస్తుందని ఆకాంక్షించారు. విస్తరణతోనే ప్రపంచపటంలో హైదరాబాద్‌కు గుర్తింపు నగరాన్ని నిరంతరం విస్తరించడం వల్లే అంతర్జాతీయంగా హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం లభించిందని సీఎం గుర్తుచేశారు. "ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా కాలం నుంచే హైదరాబాద్ విస్తరణ సాగింది. ప్రస్తుతం రాష్ట్ర ఆదాయంలో 60 శాతం ఈ నగరం నుంచే వస్తోంది.

ఒకప్పుడు హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీ ప్రాజెక్టులను అడ్డుకోవాలని ఎందరో కుట్రలు చేశారు. ఒకవేళ నగరాన్ని విస్తరించకపోతే.. ఇవాళ 10 లక్షల మంది ఐటీ నిపుణులు ఇక్కడ రాణించేవారా?" అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు బంగారం ధర కంటే ఎక్కువగా ఉన్నాయని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**బీఆర్ఎస్ రద్దయిన నోటు.. కుట్రలు సాగవు!**

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారని సీఎం మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అనేది 'రద్దయిన నోటు' లాంటిదని, ఆ పార్టీని ప్రజలు ఎప్పుడో తిరస్కరించారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వారు తమ వైఖరి మార్చుకోకపోతే.. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హెచ్చరించారు.

**కబ్జాల వల్లే రోడ్లపైకి వరద నీరు.. 'హైడ్రా' చర్యలు అందుకే!**

ఇటీవల కురిసిన వర్షాలకు నగర రోడ్లు జలమయం కావడంపై సీఎం స్పందిస్తూ.. చెరువుల్లోకి వెళ్లాల్సిన నీరు కబ్జాల కారణంగా రోడ్లపైకి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను గతంలో కేసీఆర్ ఒక వ్యక్తికి రాసిచ్చారు. నాటి నాయకులు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించారు. అందుకే మేము 'హైడ్రా' ద్వారా అక్రమ కట్టడాలను కూల్చివేస్తూ, చెరువులను పునరుద్ధరిస్తున్నాం" అని స్పష్టం చేశారు. నగరంలో లేక్ ఎకానమీని సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోందని, ఇందులో భాగంగానే గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచ దేశాలను ఇక్కడికి రప్పించామని, రాబోయే డిసెంబర్‌లోనూ మరో గ్లోబల్ సమ్మిట్‌ను ఘనంగా నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### పారిశ్రామికాభివృద్ధికి
# 'తెలంగాణ' మార్గనిర్దేశం



**బెల్లంపల్లి జూన్ 10 (వుదయం) :** రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ - ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

# మోదీ విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభం




**హైదరాబాద్ జూన్ 10 (వుదయం) :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, అనాలోచిత ఆర్థిక విధానాల వల్ల దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతోందని, తక్షణమే ఈ విధానాలను మార్చుకోకపోతే దేశ భవిష్యత్తు అంధకారంలో పడటం ఖాయమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహా హెచ్చరించారు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు నిరసనగా సీపీఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ నుండి కేంద్ర ప్రభుత్వ జిఎస్‌టిభవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కళ్లకు కట్టేలా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జిఎస్‌టి భవన్ ముందు సిపిఐ శ్రేణులు భారీ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహా మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ పేదవాడు బతకలేని పరిస్థితిని కేంద్రం సృష్టించిందని మండిపడ్డారు. దేశంలో పేదరికం అంతకంతకూ పెరుగుతుంటే.. మోదీ అండతో అదానీ, అంబానీల ఆస్తులు మాత్రం ప్రపంచంలోనే 15వ స్థానానికి చేరుకున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పబ్లిక్ సెక్టార్ (ప్రభుత్వ రంగ) సంస్థలన్నింటినీ మోదీ కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని, మోదీ విదేశీ పర్యటనలన్నీ అదానీకి వ్యాపార ప్రయోజనాలు చేకూర్చడానికేనని ఆరోపించారు. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదో ప్రజలు ఆలోచించాలన్నారు. ఒకవేళ పెట్రో ఉత్పత్తులను జిఎస్‌టి కిందికి తెస్తే లీటర్ పెట్రోల్ కేవలం రూ. 60 నుండి రూ. 70 రూపాయల లోపు వచ్చే అవకాశం ఉందని, తద్వారా పేద, మధ్యతరగతి ప్రజలపై భారీగా ఆర్థిక భారం తగ్గుతుందని స్పష్టం చేశారు. నాడు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర 100 డాలర్లు ఉన్నప్పుడు లీటర్ పెట్రోల్ రూ. 58 రూపాయలు ఉంటే.. నేడు కూడా క్రూడ్ ఆయిల్ ధర 102 డాలర్లే ఉన్నప్పటికీ రూ.115.69లు ఎందుకు వసూలు చేస్తున్నారని నిలదీశారు. 70 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో దేశ అప్పు కేవలం రూ.54 లక్షల కోట్ల రూపాయలు ఉంటే, మోదీ అధికారంలోకి వచ్చాక అది ఏకంగా రూ. 250 లక్షల కోట్ల పైచిలుకు పెరిగిందన్నారు. ప్రపంచ దేశాల నుండి తెస్తున్న అప్పుల సంపద అంతా అదానీ లాంటి వాళ్లకే పోతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అసమర్థ ఆర్థిక విధానాల వల్లే నేడు డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 96 లకు పతనమైందని, ఈ తప్పుడు విధానాల వల్ల దేశ ఆర్థిక పరిస్థితి మరో శ్రీలంక, నేపాల్, పాకిస్తాన్ లాగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే దేశ ప్రజలను హిందూముస్లింల పేరిట, మత విద్వేషాల వైపు మోదీ ప్రజల దృష్టి మళ్లిస్తూ 'మళ్లీ మాకే ఓట్లేస్తారనే' అహంకారం మోదీకి వచ్చిందని ధ్వజమెత్తారు.

### రగిలిన అఫ్గాన్–పాక్ సరిహద్దులు
## క్షిపణి దాడుల్లో చిన్నారులు బలి



**ఇస్లామాబాద్ :** అఫ్గానిస్థాన్ పాకిస్థాన్ దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరోసారి పీక్ స్టేజీకి చేరాయి. అఫ్గాన్ పౌర నివాసాలే లక్ష్యంగా పాక్ సైన్యం అర్ధరాత్రి వేళ వైమానిక దాడులతో విరుచుకుపడింది. బాంబుల వర్షం కురిపించడంతో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఈ దాడిలో 11 మంది చిన్నారులతో సహా మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోయారు. నిద్రమత్తులో ఉండగానే బాంబులు పడటంతో బాధితులు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అఫ్గాన్ సరిహద్దుల్లోని ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌లలో పౌరులు నివసించే ప్రాంతాలపై పాక్ యుద్ధ విమానాలు బాంబుల దాడికి తెగబడ్డాయని అఫ్గాన్ ప్రభుత్వ అధికారిక ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ వెల్లడించారు.

**ప్రతీకార దాడిగానే భావన?**

ఈ దాడులపై పాకిస్తాన్ ప్రభుత్వం లేదా సైన్యం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, ఇటీవల పాక్ సరిహద్దుల్లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో గల ఒక సెక్యూరిటీ పోస్టుపై తాలిబన్ మిలిటెంట్లు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు పాక్ భద్రతా సిబ్బంది మరణించగా, పలువురు గాయపడ్డారని పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ గతంలో ప్రకటించింది. ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగానే పాక్ సైన్యం ఇప్పుడు అఫ్గాన్ భూభాగంపై వైమానిక దాడులకు పాల్పడినట్లు రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తాజా దాడులతో ఇరు దేశాల సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొంది.


# ఒప్పందంలో జాప్యం చేస్తే ఇరాన్‌కు భారీ మూల్యం



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌ను తాము సైనిక పరంగా పూర్తిగా దెబ్బతీశామని, ఆ దేశం ప్రస్తుతం సర్వనాశనమైందని పేర్కొన్నారు. టెహ్రాన్ వద్ద క్షిపణి సామర్థ్యం ఇప్పుడు కేవలం 21 శాతానికి మాత్రమే పరిమితమైందని ఆయన వెల్లడించారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడానికి సమయం మించిపోతున్నా.. ఇరాన్ నేతలు ఇంకా జాప్యం చేస్తుండటంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యానికి గానూ ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇరాన్ పాలకులవి కేవలం మాటలే తప్ప చేతలు శూన్యమని డొనాల్డ్ ట్రంప్ ఎద్దేవా చేశారు. "వారికి మేలు చేయాలనే ఉద్దేశంతోనే తాము త్వరగా యుద్ధాన్ని ముగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కానీ ఇరాన్ నేతలు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు" అని మండిపడ్డారు. ఒప్పందం విషయంలో ఇలాగే ఆలస్యం ప్రదర్శిస్తే.. టెహ్రాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, ప్రధాన వంతెనలపై తమ సైన్యం కొత్త వ్యూహాత్మక దాడులు చేపట్టే అవకాశం ఉందని ట్రంప్ స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఆ దేశం మరిన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. ఇదిలావుండగా, వాషింగ్టన్‌టెహ్రాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించి, ఇరు దేశాల మధ్య ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు రాయబార ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

# పర్యావరణ రక్షణలో 'సింగరేణి' భేష్

- డోర్లీ-2 గని మూసివేత ప్రక్రియ విజయవంతం
- త్వరలోనే డోర్లీ-1 కి సంబంధించి మరో రూ.60 కోట్లు వచ్చే అవకాశం
- వడ్డీతో సహా రూ.40 కోట్ల ఎస్క్రో డిపాజిట్ తిరిగి చెల్లించిన సిసిఓ



**బెల్లంపల్లి జూన్ 10 (వుదయం) :** బొగ్గు గనుల తవ్వకాల్లోనే కాకుండా, మైనింగ్ పూర్తయిన తర్వాత పర్యావరణాన్ని కాపాడటంలోనూ తాము దేశంలోనే సాటిలేని అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నామని సింగరేణి సంస్థ మరోసారి నిరూపించుకుంది. బెల్లంపల్లి ఏరియాలోని 'డోర్లీ2' ఓపెన్‌కాస్ట్ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం విజయవంతంగా మూసివేసినందుకు (మైన్ క్లోజర్ ప్లాన్) గుర్తింపుగా, గని ప్రారంభంలో డిపాజిట్ చేసిన సుమారు రూ.40 కోట్ల నిధులను వడ్డీతో సహా 'కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్' సింగరేణికి తిరిగి చెల్లించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు దిశానిర్దేశంలో సింగరేణి సంస్థ క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న పర్యావరణహిత చర్యలకు దక్కిన గొప్ప గుర్తింపుగా దీనిని భావించవచ్చు.

**నిబంధనల అమలులో పారదర్శకత**

గనుల ప్రారంభం నుండి మూసివేత వరకు చేపట్టాల్సిన భూసంరక్షణ, పునరుద్ధరణ, మొక్కల పెంపకం వంటి మైన్ క్లోజర్ ప్లాన్ కార్యక్రమాలను సింగరేణి సంస్థ కచ్చితంగా అమలు చేసింది. సింగరేణి చూపిన ఈ బాధ్యతాయుత వైఖరి, పారదర్శకతను పరిశీలించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని సిసిఓ, గతంలో కంపెనీ జమ చేసిన నిధులను వడ్డీతో కలిపి ఇటీవల విడుదల చేసింది. సుస్థిర మైనింగ్ విధానాలను పాటిస్తూ, పర్యావరణ సమతుల్యతకు పెద్దపీట వేస్తున్న సింగరేణికి ఇది మరో విశిష్ట మైలురాయి.

**అసలు ఏమిటీ 'ఎస్క్రో డిపాజిట్'?**

కొత్తగా ఏదైనా బొగ్గు గనిని ప్రారంభించే సమయంలో..



ఆ గని జీవితకాలంలో మరియు మూసివేత సమయంలో చేపట్టాల్సిన పర్యావరణ పరిరక్షణ చర్యలపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ (CCO) కొన్ని కఠిన నిబంధనలను విధిస్తుంది. ఈ పనుల నిర్వహణకు అయ్యే అంచనా వ్యయాన్ని ముందస్తు జాగ్రత్తగా గని యాజమాన్యం నుండి డిపాజిట్ రూపంలో సేకరిస్తారు. దీనికోసం కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్, గని యాజమాన్యం మరియు బ్యాంకర్లు కలిసి త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకొని ఈ 'ఎస్క్రో డిపాజిట్'ను బ్యాంకులో భద్రపరుస్తారు. గని కాలపరిమితి ముగిసిన తర్వాత, హామీ ఇచ్చినట్లుగా పర్యావరణ పునరుద్ధరణ పనులను పూర్తి చేస్తే ఈ సొమ్మును వడ్డీతో సహా సదరు కంపెనీకి తిరిగి చెల్లిస్తారు.

**రూ.40 కోట్ల రీఫండ్ ప్రయాణం ఇలా..**

బెల్లంపల్లి ఏరియాలోని డోర్లీ ఓపెన్ కాస్ట్2 గనికి సంబంధించి సింగరేణి సంస్థ 201314లో అనుమతులు పొందింది. అప్పట్లో నిబంధనల ప్రకారం రూ.26.79 కోట్ల అంచనా వ్యయాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎస్క్రో డిపాజిట్ చేసింది. ఈ గనిలో ఏడేళ్ల పాటు బొగ్గు ఉత్పత్తి జరిగిన తర్వాత 2023 24లో గనిని మూసివేశారు. ఒప్పందం ప్రకారం సింగరేణి సంస్థ దశలవారీగా పర్యావరణ పనులను పూర్తి చేసింది. ఈ పనుల నాణ్యతను పరిశీలించేందుకు పశ్చిమ బెంగాల్‌కు చెందిన థర్డ్ పార్టీ ఏజెన్సీ 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (శిబ్‌పూర్)' ద్వారా జులై, 2024లో ప్రత్యేక ఆడిట్ నిర్వహించారు. సింగరేణి నిబంధనలను వంద శాతం అద్భుతంగా అమలు చేసిందని ఆడిట్ నివేదిక స్పష్టం చేసింది. దీంతో, మొత్తం రూ.40 కోట్ల క్లెయిమ్‌లో.. తొలి విడతగా 90 శాతం నిధులు అంటే రూ.36.63 కోట్ల రూపాయలను తిరిగి సింగరేణికి చెల్లిస్తున్నట్లు డిప్యూటీ అసిస్టెంట్ కోల్ కంట్రోలర్ ఆకాష్ శివ హరే అధికారిక లేఖలో తెలిపారు. మిగిలిన 10 శాతం నిధులను 'జస్ట్ ట్రాన్సిషన్ ప్రొవిజన్స్' (నిర్దేశిత నిబంధనల) తుది పరిశీలన అనంతరం విడుదల చేయనున్నారు. దాదాపు రూ.40 కోట్లు తిరిగి సంస్థ ఖాతాలో జమ కావడం పట్ల సింగరేణి యాజమాన్యం తీవ్ర సంతృప్తిని వ్యక్తం చేసింది. ఇదే పద్ధతిలో త్వరలోనే డోర్లీ 1 గనికి సంబంధించిన మరో రూ.60 కోట్లకు పైగా నిధులు కూడా సింగరేణికి వచ్చే అవకాశం ఉంది.





# గ్రేటర్ హైదరాబాద్



## ఈవీఎంల భద్రతపై అడిషనల్ సీఈఓ వెంకటేశ్వర్లు తనిఖీలు



**రంగారెడ్డి జిల్లా**

రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోడౌన్‌ను రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి గోడౌన్ లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు (BUలు), కంట్రోల్ యూనిట్లు (CUలు), వీవీప్యాట్ యంత్రాలు (VVPATలు) మరియు ఎన్నికల సామగ్రి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎం ల నిర్వహణ, భద్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, సంరక్షణ, నిర్వహణలో నిర్దేశిత విధానాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.తదనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించి, వారి సమక్షంలోనే గోడౌన్‌కు సీల్ వేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహసీల్దార్, ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి శ్రీ బొమ్మ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో డిసెంబర్ 15-16న తొలి అంతర్జాతీయ సదస్సు

**- సెమీకండక్టర్, రంగాలపై ప్రపంచ నిపుణుల సమాగమం**
**- పరిశోధన, ఆవిష్కరణలకు అంతర్జాతీయ వేదికగా ఐసీఎఫై టెక్**
**- భారత్‌ను సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగు**

**శంకర్ పల్లి, జూన్ 10 (వుదయం)**

స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ టెక్నాలజీలు, వీఎల్ఎస్ఐ, కృత్రిమ మేధస్సు (AI), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (IoT), ఎంబెడెడ్ సిస్టమ్స్ మరియు ఆధునిక కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లలో జరుగుతున్న అత్యాధునిక పరిశోధనలను ప్రపంచ వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లోని ఐసీఎఫై టెక్ (ICFAI Tech), ఐఎఫ్హెచ్‌ఈ (IFHE) ఆధ్వర్యంలో "స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, వీఎల్ఎస్ఐ, కృత్రిమ మేధస్సు మరియు కమ్యూనికేషన్ సిస్టమ్స్‌పై తొలి అంతర్జాతీయ సదస్సు - IC SEVACS 2026"ను డిసెంబర్ 15, 16 తేదీలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఐసీఎఫై టెక్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో జరగనున్న ఈ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు మరియు పరిశ్రమల ప్రతినిధులకు ఒక విశిష్ట వేదికగా నిలవనుంది.ఈ సందర్భంగా సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించిన ఐఎఫ్హెచ్‌ఈ హైదరాబాద్ వైస్‌చాన్సలర్ (ఇన్‌చార్జ్) ప్రొఫెసర్ టి.కోటి రెడ్డి మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ రంగాలలో పరిశోధన, ఆవిష్కరణలు మరియు అంతర్జాతీయ విద్యా సహకారాన్ని ప్రోత్సహించడంలో ఐసీఎఫై టెక్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటోందన్నారు.ICSEVACS 2026 సదస్సు ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు ఒకే వేదికపైకి వచ్చి తమ పరిశోధనలను పంచుకోవడంతో పాటు నూతన సాంకేతిక ధోరణులపై చర్చించేందుకు అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు.ఈ సదస్సు జ్ఞాన మార్పిడికి మాత్రమే కాకుండా భవిష్యత్ సాంకేతిక అభివృద్ధికి కూడా దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు.ఐసీఎఫై టెక్ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎల్.నారాయణ మాట్లాడుతూ, ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు ముందడుగు వేసిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ECE) విభాగాన్ని అభినందించారు. స్మార్ట్ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ టెక్నాలజీలు, AI, IoT, వీఎల్ఎస్ఐ మరియు కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఒక ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదికగా నిలుస్తుందని చెప్పారు.ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, పరిశ్రమల నుంచి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకోనున్నారని వెల్లడించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (MeitY) ఆధ్వర్యంలోని C2S పథకం కింద ఐసీఎఫై టెక్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ సౌకర్యం (CANFaC Lab), వీఎల్ఎస్ఐ డిజైన్ సెంటర్ వంటి పరిశోధనా మౌలిక వసతులు దేశంలోనే ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సదస్సు ద్వారా విద్యాసంస్థలు, పరిశ్రమలు మరియు పరిశోధనా సంస్థల మధ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం అవుతాయని, నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం అవుతుందని అభిప్రాయపడ్డారు.ICSEVACS 2026 కన్వీనర్, ఆర్గనైజింగ్ చైర్ మరియు ఈసీఈ విభాగాధిపతి డా.అసిసా కుమార్ పనిగ్రాహి మాట్లాడుతూ, సెమీకండక్టర్ టెక్నాలజీలు, వీఎల్ఎస్ఐ డిజైన్, సిగ్నల్ ప్రాసెసింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, IoT, AI మరియు తదుపరి తరం కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లలో జరుగుతున్న పరిశోధనలను ప్రోత్సహించడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు. భారత ప్రభుత్వ 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' లక్ష్యాలకు అనుగుణంగా సదస్సు అంశాలను రూపొందించినట్లు తెలిపారు.పరిశోధకులు, విధాన నిర్ణేతలు, పరిశ్రమల ప్రతినిధులు, యువ ఆవిష్కర్తలు ఒకే వేదికపైకి వచ్చి భవిష్యత్ సాంకేతికతలపై చర్చించి సహకారాలను పెంపొందించుకునేందుకు ఇది గొప్ప అవకాశమని పేర్కొన్నారు.ICSEVACS 2026 జనరల్ చైర్ డా. కౌశిక్ మిద్యా మాట్లాడుతూ, సదస్సులో సమర్పించే ఉత్తమ పరిశోధనా పత్రాలకు స్కోపస్ సూచికలో నమోదైన AIP Conference Proceedings ద్వారా ప్రచురణ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. SCI సూచికలో ఉన్న అంతర్జాతీయ జర్నల్‌లతో కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.ఎసోసియేట్ డీన్ (రిసెర్చ్) డా. వి. శ్రీలలిత మాట్లాడుతూ, ఐసీఎఫై టెక్‌లో బలమైన పరిశోధనా వాతావరణం, జాతీయ స్థాయిలో నిధులు పొందిన ప్రాజెక్టులు, డాక్టరల్ కార్యక్రమాలు మరియు ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇచ్చే సంస్కృతి ఉన్నాయని తెలిపారు.ICSEVACS 2026 వంటి అంతర్జాతీయ సదస్సులు ప్రపంచ స్థాయి సహకారాలకు, జ్ఞాన మార్పిడికి మరియు అత్యాధునిక పరిశోధనల ప్రదర్శనకు విలువైన వేదికలుగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.



## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో లబ్ధిదారులు చేరాల్సిందే: హౌసింగ్ ఎం.డి వి.పి.గౌతమ్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.**

5 కిలోమీటర్ల పరిధిలోని వారికే 2 బిహెచ్ కె ఇండ్ల కేటాయింపు 2 బిహెచ్ కె ఇండ్లలో లేని వారికి నోటీసులునిర్మాణపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలిహౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి శ్రీ వి.పి.గౌతంజిల్లా కలెక్టర్ తో కలిసి 2 బిహెచ్ కె కాలనీల్లో విస్తృతంగా పర్యటనమంచి లే అవుట్లు, అన్నిరకాల మౌలిక వసతులతో నిర్మించి మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో లబ్ధిదారులు అందరూ నివసించేలా చూడాలని, ఇండ్లు కేటాయించినా ఈ కాలనీల్లోకి షిఫ్టు కాని వారందరికీ మరోసారి నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి మరియు హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి వి.పి.గౌతం అధికారులను ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న 2 బిహెచ్ కె కాలనీల్లోని పనులన్నిటినీ త్వరతగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి పలు 2 బిహెచ్ కె కాలనీల్లో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించారు. బౌరంపేట, గండిమైసమ్మ, దుండిగల్ లోని 2 బిహెచ్ కె కాలనీల్లో పర్యటిస్తూ ఆయా కాలనీల్లో నివసిస్తున్న వారితో మాట్లాడారు.దుండిగల్ ఫేజ్ 1 , డబుల్ బెడ్ రూం కాలనీలో పర్యటించి అక్కడి మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. ఇండ్లను కేటాయించిన లబ్ధిదారుల్లో ఇంకా చాలా మంది ఇక్కడ నివాసం ఉండని విషయాన్ని తెలుసుకుని, వారందరూ ఇక్కడికి తరలివచ్చేలా చొరవ చూపాలని, ఇక్కడ నివసించకపోతే ఇంటి రద్దు చేస్తామని మరోసారి నోటీసులు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగు పడాలని, వారికి సమాజంలో గౌరవం పెరిగేలా సొంత ఇంటి వసతిని కల్పించే లక్ష్యంతో చేపడుతున్న గృహ నిర్మాణ పథకాలని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన స్థానికులకు వివరించారు. తమకు ఇండ్లు కావాలని వేల మంది ప్రజలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినా ఉండటానికి ముందుకు రానివారికి కేటాయింపులను రద్దు చేసి అర్హులైన ఇతరులకు ప్రయోజనం కలిగిస్తామని స్పష్టం చేశారు. అట్లాగే దుండిగల్ ఫేజ్ 2 కాలనీల్లోని పనుల పురోగతిని పరిశీలించి, త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మౌలిక వసతుల పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 2 బిహెచ్ కె కాలనీల్లోని ఇండ్లను, సమీపంలోని 5 కిలోమీటర్ల పరిధిలో నివసించే వారికే కేటాయించాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నదని ఈ మేరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నదని ఎండి గౌతం తెలిపారు. స్థానికంగా గండిమైసమ్మ ప్రాంతంలో ఇందుకు సంబంధించి జరుగుతున్న సర్వే ప్రక్రియను అధికారులు పరిశీలించారు. ప్రజా పాలన సందర్భంగా తమకు ఇల్లు కావాలంటూ దరఖాస్తు చేసుకున్న వారిలో ఇంటి స్థలం సొంత ఇల్లు లేని (ఎల్ 2) జాబితాలో ఉన్న వారికి 2 బిహెచ్ కె ఇండ్లను కేటాయించేందుకు వీలుగా, ప్రభుత్వ తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని గుర్తించేందుకు తహశీల్దార్లు ఇతర అధికారుల ద్వారా కొద్దిరోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. గండిమైసమ్మ ప్రాంతంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను అధికార బృందం పర్యవేక్షించింది. సర్వే వివరాలను సమగ్రంగా, యాప్ లో అప్ లోడ్ చేస్తున్నారా లేదా, అర్హతల నిర్ధారణ ప్రక్రియ తదితర అంశాలను గమనించి, సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే అనంతరం, యుద్ధప్రాతిపదికన ముందుగా 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్ధిదారుల ఎంపికను చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ మను చౌదరికి, ప్రత్యేక కార్యదర్శి సూచించారు.
ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్యకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ శ్రీ జి.వి.రమణారెడ్డి, జిల్లా హౌసింగ్ పిడి శ్రీ రమణమూర్తి, ఇంజనీర్లు పి.వి.రవీందర్ తోపాటు, స్థానిక రెవెన్యూ, వాటర్ వర్క్, విద్యుత్ శాఖ లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## వాగు కబ్జా అక్రమ నిర్మాణాల కూల్చివేత!

**- వాగులను కబలించే కబ్జాకోరులను వదిలిపెట్టం తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరిక**
**- కాల్వలు, వాగులు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం**

**చేవెళ్ల, జూన్10(వుదయం)**

కాంగ్రెస్ నియోజకవర్గం లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ చేసిన ఫిర్యాదుతో తొల్కట్ట గ్రామ శివారులోని గుండ్లవాగు ఆక్రమణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆయనతో పాటు ఉపసర్పంచ్ ఎండీ ఇనాయత్, వార్డు సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ యంత్రాంగం బుధవారం పరిధిలో రంగంలోకి దిగి భారీ చర్యలు చేపట్టింది.తొల్కట్ట గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 159, 162, 163, 175, 177 ప్రాంతాల గుండా ప్రవహించే గుండ్లవాగులో కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి పూడ్చి భారీ కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి.దీనిపై స్పందించిన మొయినాబాద్ తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ మండల సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి సర్వే నిర్వహించారు.సర్వేలో వాగు పరిధిలో అక్రమ నిర్మాణాలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో రెవెన్యూ అధికారులు రెండు జేసీబీల సహాయంతో సుమారు 300 మీటర్ల మేర నిర్మించిన అక్రమ రాతి కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, వాగులు, కాల్వలు, చెరువులను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా 111 జీవో పరిధిలో రియల్ ఎస్టేట్ పేరుతో ప్రకృతి వనరులను ఆక్రమించే భూకబ్జాదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. వాగులు, కాల్వలను కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.గ్రామ ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములు, వాగులను పరిరక్షించాలనే లక్ష్యంతో నిరంతరం పోరాడుతున్న భానూరి శివశంకర్ గౌడ్ చొరవతో ఈ ఆక్రమణ వెలుగులోకి రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఆయన ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ జలజ, ఇరిగేషన్ ఏఈలు శివకుమార్, వరప్రసాద్, జీపీఓ గణేష్, రెవెన్యూ సిబ్బంది జానకిరామ్, రవి, నర్సింహా, అజీజ్, రామకృష్ణ, రాజు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్తూర్ వెంకటరమణ రైస్ మిల్లులో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.**

బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి కొల్తూర్‌లోని వెంకటరమణ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసారు.
ఈ సందర్భంగా మిల్లులో కొనసాగుతున్న ధాన్యం దిగుమతి, అన్‌లోడింగ్ మరియు నిల్వ ప్రక్రియలను క్షుణ్ణంగా అదనపు కలెక్టర్ పరిశీలించారు. పరిశీలనలో భాగంగా మిల్లర్లతో సమావేశమై, కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన వాహనాలను ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వాహనాలు మిల్లుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి అవసరమైన మేరకు హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అదేవిధంగా, మిల్లర్ అక్‌నాలెడ్జ్‌మెంట్‌లను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే జారీ చేయాల, ధాన్యం దిగుమతి ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వాహనాల నిల్వ, అన్‌లోడింగ్ మరియు రసీదు జారీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు.మిల్లులో ధాన్యం నిల్వ పరిస్థితులు, హమాలీల అందుబాటు మరియు వాహనాల కదలికలను అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని మిల్లర్లకు స్పష్టం చేసారు.
అనంతరం అదనపు కలెక్టర్ బొమ్మరాశిపేట లోని గోడౌన్‌ను పరిశీలించారు. గోడౌన్‌కు ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, కొనుగోలు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన అదనపు గోడౌన్‌లను వెంటనే గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని కలిసిన జర్నలిస్టులు

**-జర్నలిస్టుల ఇళ్ల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినందుకు కృతజ్ఞత**

**శేరిలింగంపల్లి :**

తెలంగాణ పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని బుధవారం శేరిలింగంపల్లి జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు వివేకానందనగర్ లోని ఎమ్మెల్యే నివాసంలో అరెకపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినందుకు ఎమ్మెల్యే గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. మియాపూర్ లో జరిగిన బహిరంగ సభలో శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల సమస్యలను తన ప్రసంగం ద్వారా వినిపించడంతోపాటు భూ కేటాయింపు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నందనీయమన్నారు. ఈ విషయమై మరో ఎకరా కేటాయింపు కోసం ప్రభుత్వంతో మరోసారి చర్చించాలని ఎమ్మెల్యే గాంధీని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ జర్నలిస్టుల సొంతింటి కలను సహకారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. చందానగర్ లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన ఒక ఎకరం స్థలానికి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ కు ఫోన్ చేసి సూచించారు. ఈ భూమి పక్కనే ఉన్న మరో ఎకరా స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గతంలో సబ్ స్టేషన్ కోసం కేటాయించిన సదరు స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల స్థలాన్ని దృష్టిలో ఉంచుకొని సబ్ స్టేషన్ ను మరో ప్రాంతానికి బదిలీ చేయించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గాంధీని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పైళ్ల విట్టల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డి, జర్నలిస్టు నాయకులు శ్రీనివాస్ గౌడ్, అశోక్ యాదవ్,అమృత్ గౌడ్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్, టెంజు అధ్యక్షుడు పి.సాగర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.కిషోర్ కుమార్, జర్నలిస్టులు దేవేందర్ తదితరులు ఉన్నారు

## పీర్జాదిగూడలో పారిశుద్ధ్యం, సీసీ రోడ్ల మెరుగుదలకు జక్క వెంకట్ రెడ్డి వినతి




**మేడిపల్లి వుదయం ప్రతినిధి**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బుధవారం మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు కలిసి ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త IAS, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ఏ.శైలజ లకు వినతి పత్రం అందజేశారు.
బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజా పర్యటనలో భాగంగా పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతాపురం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని తెలిపారు.
ప్రధానంగా లేవనెత్తిన అంశాలు:* పారిశుద్ధ్య లోపాలు – దోమల బెడద:అంతర్గత కాలనీల్లో క్రమం తప్పకుండా రోడ్లు ఊడ్చకపోవడం, వీధుల మూలల్లో చెత్త పేరుకుపోవడం వల్ల వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.* రోడ్డు స్వీపింగ్ యంత్రాల ఏర్పాటు:ప్రధాన రహదారుల శుభ్రత కోసం ఆధునిక రోడ్ స్వీపింగ్ మెషిన్లను వినియోగిస్తే పారిశుద్ధ్య సిబ్బంది అంతర్గత కాలనీల పరిశుభ్రతపై మరింత సమయం కేటాయించే అవకాశం ఉంటుందని సూచించారు.
* పాత పారిశుద్ధ్య విధానం అమలు:గతంలో ప్రతి పారిశుద్ధ్య కార్మికుడికి నిర్దిష్ట ప్రాంత బాధ్యతలు అప్పగించిన విధానాన్ని తిరిగి అమలు చేసి జవాబుదారీతనాన్ని పెంచాలని కోరారు.* పీర్జాదిగూడ గుట్టలో సీసీ రోడ్ల నిర్మాణం:పీర్జాదిగూడ గుట్ట పరిధిలోని ఇరుకైన గల్లీలలో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాల కారణంగా మట్టి కొట్టుకుపోవడం, గుంతలు ఏర్పడటం, ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున తక్షణమే సర్వే నిర్వహించి సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..... తమ హయాంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, స్ట్రీట్ లైట్లు, మంచినీటి పైప్‌లైన్లు, నల్లా కనెక్షన్లు వంటి అనేక మౌలిక సదుపాయాలను ప్రజలకు అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు, పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి ప్రజారోగ్యం, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి,బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా,ఆకుల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఊట్ల పెద్ద చెరువును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్

**జిన్నారం జూన్ 10 (వుదయం ప్రతినిధి)**

జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని ఊట్ల గ్రామ పెద్ద చెరువును మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, కమిషనర్ నరేందర్ రెడ్డి కలిసి బుధవారం పరిశీలించారు. చెరువు అలుగు వద్ద కోతకు గురికావడంతో రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు వారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిశీలించిన అధికారులు తక్షణ మరమ్మతుల కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు కార్యక్రమంలో కౌన్సిలర్ మహేష్, స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.




**IN THE COURT OF III JUNIOR CIVIL JUDGE:CITY CIVIL COURT: AT HYDERABAD**
**O.S. No. 1385 OF 2026**
**BETWEEN :**
Smt Pabbathi Annapurna & Others
**...Plaintiffs**
**AND**
The Tahsildar, Nampally Mandal & Another
...Defendants
To,
1. All Concerned,
...Defendant No.2
Whereas the above named Plaintiffs have filed above suit to grant the legal heir certificate in favour of the plaintiffs of their deceased wife,
Daughter and sons Late PABBATHI NIRANJAN RAO. Whereas, the Hon'ble Court has ordered notice through paper publication. Therefore please take notice that the above suit is posted for you appearance to 23.06.2026, and you are directed to appear before the said court on 23.06.2026 at 10.30 A.M., either personally or through an Advocate, failing which the suit will be decided according to law.
**(BY ORDER OF THE HONOURABLE COURT)**
Sd/-
**K.SOM RAJ**
**Advocate**
**Office at Flat No.104, Ashoka Chamber, Opp Old MLA quarters, Adarsha Nagar, Hyderabad**

**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD**
**O.S. No.1274 OF 2026**
**BETWEEN :**
Pathakoti Mahender & others
**...Plaintiffs**
**AND**
1. The Tahsildar, Saidabad Mandal
2. All Concerned
**...Defendants**
To,
All Concerned.
**...Defendant No.2**
Please take notice that the above named Plaintiffs filed a suit for Declaration to declare the Plaintiffs as the legal heirs of deceased Late PATHAKOTI KRISHNA and PATHAKOTI ARUNA and the same is stand posted to 18-06-2026, if anybody having any objection in the above suit, appear at 10:30 a.m. before this Hon'ble Court in person or by an Advocate, failing which the Hon'ble Court will proceed with the matter as per the law.
**(BY ORDER OF THE HONOURABLE COURT)**
Sd/-
**P. SURYA PRAKASH**
**Advocate**
**Office at H.No. 10-2-299/E Karthik Law Chambers 2nd Floor, Vijay Nagar Colony, Hyderabad-57 Cell No. 9110591902**

**IN THE COURT OF THE HON.BLE XIX ADDL. JUNIOR JUDGE :: AT HYDERABAD**
**O.S. No. 5487 of 2024**
**BETWEEN :**
Aechan Ramu ----Petitioner/Plaintiff
And
Jilla Venkatesham & Others
**-----Defendants**
**AND**
To, 1. Jilla Venkatesham, S/o Narsaiah, Aged about : 47 years, Occu : Business, R/o # 11-9-286, Phase-2, Sunshine Estates, Road No.4, Beside Reliance Petrol Pump, Vijayapuri Colony, Kothapet, Saroornagar, Ranga Reddy District, Telangana State.
2. Sirvi Nemi Chand, S/o Ramlal, Aged about : 32 years, Occu : Business, R/o # 1-5-149/1, Prasanth Nagar Old Alwal, Bolarum, Hyderabad, Telangana State.
3. Shis Mohammad, S/o Azfar Shaik, Aged about : 42 years, Occu : Business, R/o # 22-5-505, Fathe Ullah, Baig Galli, Panjesha, Charminar, Hyderabad, Telangana State.
Please take notice that the Plaintiff filed the above Suit against you all, the above suit (O.S. No. 5487 of 2024) is posted on 29-06-2026 for your appearance. Therefore, you all are hereby informed/noticed to appear either in person or through your Advocate/Pleader with your Written Statement, if any at 10:30 A.M. on the above said date (i.e., 29-06-2026) before the Hon'ble Court, failing which the above Suit will be heard and set-ex-parte and the above Suit will be proceeded according with the Law.
**(BY ORDER OF THE HONOURABLE COURT)**
Sd/-
**VALUPADASU RAJU**
**Advocate # 16 - 11 - 501/2/A, Bhavani Nagar, Dilsuk Nagar, HYDERABAD**
**Cell. No. 8247484904 9848295050**

**IN THE COURT OF THE HON.BLE XIX ADDL. JUNIOR JUDGE :: AT HYDERABAD**
**I.A. No. 903 of2024**
**In**
**O.S. No.5487 of2024**
**BETWEEN :**
Aechan Ramu ----Petitioner/Plaintiff
And
Jilla Venkatesham & Others
**-----Respondent/Defendants**
**AND**
To,
1. Jilla Venkatesham, S/o Narsaiah, Aged about : 47 years, Occu : Business, R/o # 11-9-286, Phase-2, Sunshine Estates, Road No.4, Beside Reliance Petrol Pump, Vijayapuri Colony, Kothapet, Saroornagar, Ranga Reddy District, Telangana State.
2. Sirvi Nemi Chand, S/o Ramlal, Aged about : 32 years, Occu : Business, R/o # 1-5-149/1, Prasanth Nagar Old Alwal, Bolarum, Hyderabad, Telangana State.
3. Shis Mohammad, S/o Azfar Shaik, Aged about : 42 years, Occu : Business, R/o # 22-5-505, Fathe Ullah, Baig Galli, Panjesha, Charminar, Hyderabad, Telangana State.
Please take notice that the Plaintiff filed the above Suit and also filed Interlocutory Petition/Application (I.A. No. 903 of 2024 in O.S. No. 5487 of 2024) against you all, the above suit and Petition (O.S. No. 5487 of 2024) is posted on 29-06-2026 for your appearance. Therefore, you all are hereby informed/noticed to appear either in person or through your Advocate/Pleader with your Written Statement and Counter, if any at 10:30 A.M. on the above said date (i.e., 29-06-2026) before the Hon'ble Court, failing which the above Suit and Petition will be heard and set-ex-parte and the above Suit and Petition will be proceeded according with the Law.
**(BY ORDER OF THE HONOURABLE COURT)**
Sd/-
**VALUPADASU RAJU**
**Advocate # 16 - 11 - 501/2/A, Bhavani Nagar, Dilsuk Nagar, HYDERABAD**
**Cell. No. 8247484904 9848295050**




"ఇప్పుడిలా ప్లేటు ఫిరాయించడం సంచలనంగా మారింది. బీజేపీ దగ్గర వేల కోట్ల డబ్బు, ఈడీ, సీబీఐ, అధికారం ఉంటే.. తమకు అండగా హవాయి చెప్పులు, తెల్లచీర ధరించిన మమతా బెనర్జీ ఉన్నారని.. ఆ సమయంలో సయోనీ చేసిన వ్యాఖ్యలను జనం గుర్తు చేసుకుంటూ ఆశ్చర్యపోతున్నారు. అప్పుడు అలా మాట్లాడిన ఆమె.. ఇంతలోనే ఎలా ఎన్డీఏకు ఎలా జై కొడుతుందని చర్చించుకుంటున్నారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితురాలిగా మెలిగిన సయోనీ ఘోష్.. తిరుగుబాటు ఎంపీలతో చేతులు కలుపుతారని అస్సలు ఊహించలేదని జనం అంటున్నారు."

- మమతా బెనర్జీ

## వేమన పద్యం

**ఎంగిలెనిలనుచు నీతోతోడ వేదము**
**చదివి వేరలారా?**
**ఎంచి చూచినదన్ ఎంగిలి కాదహో!**
**విశ్వదాభిరామ వినుర వేమా.**



# ప్రజాదరణకు ఆయుధమా?

రాజకీయ నాయకుల మాటలు కేవలం వ్యక్తిగత అభిప్రాయాలుగా మిగిలిపోవు. ముఖ్యంగా ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నాయకుల వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరికి ప్రతిబింబంగా, రాజకీయ సంస్కృతికి దిశానిర్దేశంగా, ప్రజలకు సందేశంగా మారతాయి. అందుకే అధికారంలో ఉన్నవారి మాటలకు అదనపు బాధ్యత, అదనపు సంయమనం అవసరమవుతాయి. తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనుముల రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో చేసిన కొన్ని వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లోనే కాకుండా ప్రజా వేదికలపైనా విస్తృత చర్చకు దారితీశాయి. ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో సహజమే అయినప్పటికీ, ఆ విమర్శల భాష, తీవ్రత, పదజాలం ముఖ్యమంత్రి హోదాకు తగినవేనా అనే ప్రశ్నలు మేధావుల నుంచి, సామాన్య ప్రజల నుంచి వినపిస్తున్నాయి.

తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి ఎప్పటినుంచో దూకుడైన నాయకుడిగా, తిరుగులేని ప్రసంగీకుడిగా గుర్తింపు పొందారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, ముఖ్యంగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడిగా ఉన్న కాలంలో ఆయన శైలి ప్రధానంగా అప్పటి అధికార భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వంపై ప్రత్యక్ష దాడులు, ఘాటు విమర్శలు, పదునైన రాజకీయ వ్యంగ్యాస్త్రాలతో నిండిపోయి ఉండేది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనను గద్దె దించడంలో ఆయన వాడిన ఈ దూకుడు వ్యూహం, ప్రజల్లోకి తీసుకెళ్లిన నినాదాలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రధాన కారణమయ్యాయి. అయితే, ఎన్నికల ప్రచార రంగానికి, పరిపాలనా పీఠానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే ప్రతిపక్ష శైలిని, కఠిన పదజాలాన్ని కొనసాగించడం ఎంతవరకు సముచితం అనే చర్చ ఇప్పుడు తెలంగాణ సమాజంలో బలంగా సాగుతోంది. ముఖ్యమంత్రి పదవి అనేది కేవలం ఒక నిర్దిష్ట రాజకీయ ముఠాకు లేదా పార్టీకి ప్రాతినిధ్యం వహించేది కాదు. అది మొత్తం రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అత్యున్నత రాజ్యాంగ బద్ధమైన బాధ్యత. అందువల్ల అధికారంలో ఉన్న వ్యక్తి మాట్లాడే ప్రతి మాట మరింత సమతుల్యంగా, హుందాగా ఉండాలని ప్రజాస్వామ్య వ్యవస్థ ఆశిస్తుంది. ఇటీవలి కాలంలో తెలంగాణ రాజకీయాల్లో అత్యంత వివాదాస్పదంగా మారిన అంశాలలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా HYDRA) వ్యవహారం అత్యంత ప్రధానమైనది. హైదరాబాద్ మహానగర పరిధిలో దశాబ్దాలుగా పేరుకుపోయిన చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ భూములపై ఉన్న అక్రమ ఆక్రమణలను నిర్దాక్షిణ్యంగా తొలగించేందుకు ప్రభుత్వం ఈ ప్రత్యేక విభాగాన్ని జీవో నంబర్ 99 ద్వారా ఏర్పాటు చేసింది. ఈ చర్యకు ఒకవైపు పర్యావరణ ప్రేమికులు, వరదల భయంతో ఉన్న సామాన్య ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించినప్పటికీ, మరోవైపు ముందస్తు నోటీసులు లేకుండా ఇళ్లను కూల్చివేస్తున్నారంటూ బాధితుల నుంచి, నిరుపేదల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రత్యర్థులను లేదా పదేపదే ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఉద్దేశించి "హిట్లర్"కు ఇష్టమైన పదం హైడ్రా అంటూ... ప్రస్తావించడం కూడా రాజకీయ దుమారాన్ని రేపింది. ప్రపంచ ఆధునిక చరిత్రలో హిట్లర్ పేరు నియంతృత్వానికి, అణచివేతకు, క్రూరత్వానికి, మానవ హక్కుల ఉల్లంఘనలకు ప్రతీకగా నిలిచింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ వివాదానికి దారితీశాయి. ఆయన వాడిన భాషలో ప్రజాస్వామ్య సంయమనం లోపించిందని ప్రతిపక్ష వర్గాలు ధ్వజమెత్తాయి. అక్రమార్కులను శిక్షించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించడంలో భాగంగా అత్యంత కఠినమైన, హెచ్చరింపు ధోరణితో కూడిన పదజాలాన్ని ఉపయోగించడం వల్ల, అసలు పర్యావరణ పరిరక్షణ అనే ప్రధానాంశం పక్కకు పోయి, ముఖ్యమంత్రి వ్యాఖ్యలే మీడియాలో, సోషల్ మీడియాలో ఎక్కువ చర్చకు కారణమయ్యాయి. చట్టబద్ధమైన పద్ధతుల్లో చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలిగిన రాజ్యాంగ అధినేత, బహిరంగ సభల్లో భావోద్వేగపూరితమైన హెచ్చరికలు చేయడం పరిపాలనా హుందాతనాన్ని తగ్గించిందనే విమర్శలు వచ్చాయి.



# అస్తమించిన మట్టి వాసనల అద్భుత సృష్టికర్త భారతీ రాజా



భారతీయ చలనచిత్ర యవనికపై గ్రామీణ జీవన సౌందర్యాన్ని, పల్లెటూరి మనుషుల నిఖార్సైన భావోద్వేగాలను వెండితెరపై కవిత్వంలా ఆవిష్కరించిన అరుదైన సృజనకారుడు, దర్శకుల హిమాలయంగా కీర్తించబడిన భారతీరాజా. కళాత్మకతకు, సామాజిక వాస్తవికతకు మధ్య సమతూకాన్ని పాటిస్తూ దశాబ్దాల పాటు సినిమా రంగాన్ని శాసించిన ఈ మహోన్నత చిత్రకారుడు తన 84వ ఏట భౌతిక కాయాన్ని విడిచిపెట్టడం భారతీయ సినీ ప్రపంచంలో ఒక అద్భుత శకానికి ముగింపు పలికింది. ఆయన మరణం కేవలం ఒక దర్శకుడి అస్తమయం మాత్రమే కాదు; నగరాల కృత్రిమత్వంలో, స్టూడియోల నాలుగు గోడల మధ్య బంధీ అయి ఉన్న సినిమాను మట్టి వాసనల వైపు, పచ్చని పొలాల వైపు నడిపించిన ఒక విప్లవాత్మక యుగప్రవర్తకుడి నిష్క్రమణ. ఇటీవల కాలంలో వృద్ధాప్య సమస్యలతో పాటు వ్యక్తిగత జీవితంలో ఎదురైన తీవ్ర విషాదాలు ఆయనను శారీరకంగా, మానసికంగా కుంగదీశాయి. ముఖ్యంగా ఆయన వారసుడు, నటుడు అయిన మనోజ్ భారతీరాజా ఆకస్మిక మరణం భారతీరాజా హృదయాన్ని తీవ్రంగా గాయపరిచింది. ఈ పుత్రశోకం కలిగించిన మనోవేదన ఆయన ఆరోగ్య క్షీణతకు ప్రధాన కారణమైంది. శ్వాసకోశ ఇబ్బందులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూయడం చలనచిత్ర రంగానికి ఎన్నటికీ పూడ్చలేని లోటును మిగిల్చింది.


1941 జూలై 17న తమిళనాడులోని థేని జిల్లా అల్లినగరం అనే ఒక సాధారణ పల్లెటూరిలో చిన్నసామి పేరియమాయ దేవర్‌గా ఆయన జన్మించారు. ఒక సామాన్య గ్రామీణ వాతావరణంలో పెరగడం వల్ల పల్లెటూరి ఆచారాలు, కులాల మధ్య ఉండే అంతరాలు, మనుషుల మధ్య ఉండే ఆప్యాయతలు ఆయన మనసుపై బలమైన ముద్ర వేశాయి. సినిమా రంగంలోకి ప్రవేశించడానికి ముందు ఆయన జీవిత గమనాన్ని గమనిస్తే, ఆయన ఎన్నో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కష్టాల కడలిని ఈదారు. ప్రజల దైనందిన జీవిత పోరాటాలను, వారి ఆశలను, ఆక్రోశాలను అత్యంత సమీపం నుంచి పరిశీలించే అవకాశం ఈ కాలంలోనే ఆయనకు దక్కింది. ఈ అనుభవాలే తదనంతర కాలంలో ఆయన తీసిన సినిమాలకు గట్టి పునాదిగా, అసాధారణమైన వాస్తవికతకు మూలాలుగా మారాయి. అప్పటివరకు తమిళ చిత్ర పరిశ్రమ కేవలం చెన్నైలోని స్టూడియో సెట్టింగులకే పరిమితమై, నాటకీయ సంభాషణలు, అసహజమైన నటనతో సాగుతున్న తరుణంలో, సినిమాను నిజమైన ప్రకృతి ఒడిలోకి తీసుకువెళ్లాలని భారతీరాజా నిశ్చయించుకున్నారు.

ఆయన సృజనాత్మక ప్రయాణంలో 1977 ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఆ ఏడాది విడుదలైన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు') చిత్రం ద్వారా ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ చిత్రం అప్పటివరకు ఉన్న సినిమా ఫార్ములాను పూర్తిగా బద్దలు కొట్టింది. కమల్ హాసన్ చేత ఒక అంగవైకల్యం ఉన్న అమాయక పల్లెటూరి యువకుడి పాత్రను, రజనీకాంత్ చేత గ్రామీణ విలనిజాన్ని, శ్రీదేవి చేత పల్లెటూరి పడుచుదనాన్ని అత్యంత సహజంగా పండించిన విధానం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సినిమా షూటింగ్‌ను స్టూడియోల నుంచి తరలించి, నిజమైన పల్లెటూరి వీధుల్లో, మట్టి రోడ్లపై, ఎండలో చిత్రీకరించడం ద్వారా తమిళ చిత్రసీమలో సరికొత్త 'నటూరిజం' ధోరణికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ చిత్రం సాధించిన ఘనవిజయం భారతీరాజా అనే పేరును ప్రతి ఇంటా మారుమోగేలా చేసింది. ఆ తర్వాత ఆయన వెనక్కి తిరిగి చూసుకోలేదు. వాణిజ్య విలువలను కోల్పోకుండానే సామాజిక చైతన్యాన్ని రగిలించే అద్భుతమైన చిత్రాలను ఒకదాని తర్వాత ఒకటిగా అందిస్తూ వెళ్లారు.

భారతీరాజా సినీ ప్రస్థానాన్ని విశ్లేషిస్తే ఆయన కేవలం ప్రేమకథలకే పరిమితం కాలేదని స్పష్టమవుతుంది. 'కిళక్కే పోగుం రైల్', 'సిగప్పు రోజాక్కల్', 'పుతియ వార్పుగల్', 'అలైగల్ ఓయ్వతిల్లై', 'మన్ వాసనై', 'ముతల్ మరియాదై', 'దం పుదితు', 'కరుత్తమ్మా' వంటి చిత్రాలు ఆయన దర్శకత్వ ప్రతిభకు శిఖరాయమాన నిదర్శనాలుగా నిలుస్తాయి. ప్రతి సినిమాలోనూ ఆయన ఎంచుకున్న ఇతివృత్తం వైవిధ్యమైనది. 'సిగప్పు రోజాక్కల్' చిత్రంలో ఒక సైకో కిల్లర్ మనస్తత్వాన్ని ఆవిష్కరిస్తూ థ్రిల్లర్ జోనర్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పగా, 'అలైగల్ ఓయ్వతిల్లై' (తెలుగులో 'సీతాకోకచిలుక') ద్వారా మతాంతర ప్రేమలోని సున్నితత్వాన్ని, సమాజం విధించే ఆంక్షలను ఎండగట్టారు. ముఖ్యంగా 'ముతల్ మరియాదై' చిత్రం శివాజీ గణేశన్ నట జీవితంలోనే ఒక మేలిమి ముత్యంగా నిలిచిపోతుంది. ఒక మధ్యవయస్కుడైన జమీందారుకు, ఒక పేద వర్గానికి చెందిన యువతికి మధ్య ఉన్న పవిత్రమైన, మాటలకు అందని ఆత్మీయ బంధాన్ని ఆయన చిత్రించిన తీరు అనన్యసామాన్యం. అలాగే 'వేదం పుదితు' చిత్రంలో అగ్రకులాల అహంకారాన్ని, కుల వ్యవస్థలోని నిరర్థకతను ప్రశ్నిస్తూ ఆయన చేసిన సాహసోపేతమైన ప్రయత్నం సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. 'కరుత్తమ్మా' చిత్రం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేళ్లూనుకున్న ఆడశిశు హత్యలనే క్రూరమైన సామాజిక దురాచారాన్ని వెండితెరపై ప్రదర్శించి, ప్రజల మనస్సాక్షిని కదిలించారు.

భారతీరాజా చిత్రాల యొక్క అతిపెద్ద ప్రత్యేకత ఏమిటంటే, ఆయన ప్రకృతిని లేదా గ్రామీణ వాతావరణాన్ని కేవలం ఒక అందమైన నేపథ్యంగానో, పాటల కోసమో ఉపయోగించలేదు. ఆయన సినిమాల్లో పల్లెటూరు అనేది కథలో ఒక సజీవ పాత్రగా ప్రవహిస్తుంది. పచ్చని వరిపొలాలు, కాలువ గట్లు, చెరువులు, మట్టి వాసనలు, పల్లెటూరి జాతరలు, గాలికొట్టుకునే తాటిచెట్లు.. ఇవన్నీ కేవలం దృశ్యాలు కావు, కథానాయకుడి ఆవేదనను, కథానాయిక ఆనందాన్ని ప్రతిబింబించే సాక్ష్యాలు. పల్లె మనుషుల అమాయకత్వాన్ని, వారి క్రోధాన్ని, పగను, పాశవికత్వాన్ని కూడా ఆయన అంతే వాస్తవికంగా చూపించారు. అందుకే ఆయన చిత్రాలు కాల పరీక్షకు నిలిచి, ఇప్పటికీ చలనచిత్ర విద్యార్థులకు పాఠ్యపుస్తకాలుగా ఉపయోగపడుతున్నాయి.

భారతీరాజా కేవలం గొప్ప చిత్రాలను నిర్మించడమే కాకుండా, సినిమా పరిశ్రమకు ఎందరో మేధావులను, నటీనటులను పరిచయం చేసిన అద్భుతమైన మార్గదర్శి. రాధా, రేవతి, రాధిక, కార్తీక్, భాగ్యరాజ్ వంటి హేమాహేమీలను వెండితెరకు పరిచయం చేసిన ఘనత ఆయనదే. నటనలో ఏమాత్రం అనుభవం లేని కొత్తవారిని సైతం తన సృజనాత్మక శైలితో అద్భుతమైన నటులుగా తీర్చిదిద్దే విద్య ఆయనకు సుసాధ్యమైంది. ఇప్పటికే స్టార్ హోదాలో ఉన్న కమల్ హాసన్, రజనీకాంత్ వంటి నటుల నుంచి వారి అంతర్గత నటనను నూతన కోణంలో ఆవిష్కరించి, వారి కెరీర్‌కు తిరుగులేని మలుపులు ఇచ్చారు. ఒక దర్శకుడు కేవలం యాక్షన్ చెప్పేవాడు మాత్రమే కాదని, నటుడిలోని సుప్తచేతనావస్థను మేల్కొలిపే గురువు అని ఆయన నిరూపించారు.తెలుగు చలనచిత్ర పరిశ్రమతో కూడా భారతీరాజాకు విడదీయరాని గాఢమైన అనుబంధం ఉంది. ఆయన నేరుగా తెలుగులో 'సీతాకోకచిలుక' వంటి క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించడమే కాకుండా, ఆయన తమిళ చిత్రాలైన 'పదహారేళ్ల వయసు', 'ఎర్ర గులాబీలు', 'శీతాకాలపు గడువు', 'ఆరాధన' వంటి అనువాద, పునర్నిర్మాణ చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. దక్షిణ భారత సినీ రంగంలో భాషా సరిహద్దులను చెరిపివేసి, ఒక సృజనాత్మక శక్తిగా ఎదిగిన అరుదైన దర్శకుడు ఆయన. వయసు పైబడిన తదనంతర కాలంలో ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా, నటుడిగా కూడా తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. 'పాండ్యనాడు', 'నమ్మ వీట్టు పిళ్లై', 'తిరుచిత్రంబలం' వంటి చిత్రాలలో ఆయన పోషించిన గంభీరమైన తాత, తండ్రి పాత్రలు ఆయనలోని అద్భుత నటుడిని మరోసారి పరిచయం చేశాయి. ఆయన ముఖంలో కనిపించే జీవితానుభవాల తాలూకు రేఖలు, ఆయన సంభాషణలు పలికే సహజ శైలి నటనకు కొత్త నిర్వచనాన్ని ఇచ్చాయి.ఆయన అసాధారణమైన సినీ సేవకు గుర్తింపుగా దేశ అత్యున్నత పురస్కారాలు ఆయనను వరించాయి. భారత ప్రభుత్వం 2004లో ఆయనను 'పద్మశ్రీ' అవార్డుతో సత్కరించింది. చలనచిత్ర రంగంలో అత్యున్నత ప్రతిభకు నిదర్శనమైన జాతీయ చలనచిత్ర పురస్కారాలను (నేషనల్ అవార్డ్స్) ఆయన ఆరు సార్లు అందుకోవడం విశేషం. వీటితో పాటు అనేక తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు, ప్రతిష్టాత్మక ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు ఆయన సృజనకు దక్కిన గౌరవాలు. అయితే, ఈ అధికారిక పురస్కారాలన్నింటికంటే మిన్నగా, కోట్ల మంది సినీ ప్రేమికుల గుండెల్లో ఆయన సంపాదించుకున్న స్థానమే అత్యున్నతమైనది. 2025వ సంవత్సరంలో ఆయన కుమారుడు మనోజ్ భారతీరాజా అకాల మరణం చెందడం ఆ వృద్ధుడి జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేసింది. తన కళ్ల ముందే కొడుకు నూరేళ్లు నిండకుండానే వెళ్ళిపోవడాన్ని ఆయన తట్టుకోలేకపోయారు. ఆ మానసిక వేదనే ఆయన శరీరంలో దాగి ఉన్న అనారోగ్య సమస్యలను మరింత తీవ్రం చేసింది. 2026 ప్రారంభం నుండి శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఆసుపత్రి పాలైన ఆయన, మృత్యువుతో పోరాడి చివరకు జూన్ 10న అనంత వాయువుల్లో కలిసిపోయారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# పిల్లల ఆటలు ఆడే హక్కులను హరిస్తున్నామా !



ఆటలు పిల్లల జన్మ హక్కు. బాల్యం ఆటలకు నెలవు. ఆటల్లో ఆనందాన్ని పొందడం చిన్నారులకు ఇష్టమైన ఏకైక దినచర్య. పిల్లలు, పాఠశాల విద్యార్థినీవిద్యార్థులు, యువత తప్పక ఆటలకు కొంత సమయాన్ని కేటాయించాలి. ఆటలతో అనేక ప్రత్యక్ష ప్రయోజనాలు ఉన్నాయి. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి ఆటలు దోహదపడతాయి. చిన్నారుల్లో సృజనశీలత పెంచడం, సామాజిక నైపుణ్యాలను వృద్ధి చేయడం, ప్రపంచ పోకడల గూర్చి అవగాహన పరుచుకోవడం ఆటలతో సుసాధ్యం అవుతుంది. ఆటల ద్వారా పిల్లలు తమ బావోద్వేగాలను వ్యక్తం చేయడం, నిలకడను అలవర్చుకోవడం, కొత్త విషయాలను నేర్చుకోవడం, అమిత సంతోషాలను పొందడం జరుగుతుంది. ఆటలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పిల్లల్ని ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దడంతో పాటు వారి ఉజ్వల భవితకు గట్టి పునాదులు వేయడం, ఆత్మవిశ్వాసంతో కూడిన బాధ్యత గల పౌరులుగా తయారు చేయడానికి తల్లిదండ్రులు, సంరక్షకులు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యాలు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి.

అంతర్జాతీయ ఆటల దినోత్సవం:

ఆటలు ఒక వినోదాన్ని అందించే వేదికలు మాత్రమే కాదని, అన్ని వర్గాల, వయస్సుల వారికి ఆటలు ఒక సార్వత్రిక భాషగా జాతీయతాభావం, సాంస్కృతిక వికాసం, సామాజికఆర్థిక ప్రగతి ముడిపడి ఉంటాయి. పిల్లలకు ఆటల ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస చొరవతో ఆటల ప్రయోజనాలను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సంరక్షకులు, విద్యాలయ యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, పౌర సమాజానికి వివరించడానికి ప్రతి ఏట 11 జూన్ రోజున "అంతర్జాతీయ ఆటల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ప్లే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ ఆటల దినం ఇతివృత్తంగా "ఆటను రక్షించండి, బాల్యాన్ని రక్షించండి (ప్రొటెక్ట్ ప్లే, ప్రొటెక్ట్ చైల్డ్‌హుడ్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. పిల్లలకు చేరువగా ఆటలు తీసుకురావడానికి ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, పౌర సమాజం కూడా ప్రాధాన్యతాక్రమంలో చొరవ చూపాలి. ఆటల సంస్కృతిని కాపాడడం, ప్రోత్సహించడం, అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పిల్లల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని తెలుసుకోవాలి.

ఆటలతో బహుళ ప్రయోజనాలు:

నేర్చుకోవడానికి ఓ శక్తివంతమైన వేదిక ఆట స్థలం మాత్రమే. ఆటలతో పిల్లల్లో మేధో, సామాజిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక, మానసిక, శారీరక అభివృద్ధి జరుగుతుంది. ఆటల ద్వారా జట్టుతో కలిసి పని చేయడం (టీమ్ స్పిరిట్), క్రీడా స్ఫూర్తి పెంపొందించబడడం, నాయకత్వ లక్షణాలు పెరగడం, నిలకడను నేర్చుకోవడం, సామాజిక సవాళ్లను ఎదుర్కోవడం, ఓటమిని ఆకళింపు చేసుకోవడం, భయాన్ని జయించడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ఊహాశక్తి, సృజనశీలత, ఆవిష్కరణ ద్వారాలు తెరుచుకుంటాయి. ఆటల ద్వారా పాఠాలు సులభంగా అర్థం కావడం, సమగ్ర శ్రేయస్సు ఒనగూడడం, ఆశావహ దృక్పథం పెరగడం జరుగుతుంది. ఆటలు పిల్లల్లో మానసిక ఉత్సాహాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, సంక్షోభాలు, విపత్తుల సమయంలో పిల్లల పరిస్థితులు దుర్భరంగా ఉంటాయి. ఇలాంటి సమయాల్లో పిల్లల్ని సంతోష పెట్టడానికి ఆటలు మాత్రమే సరైన సాధనాలుగా పని చేస్తాయి.

ఆటల ప్రాధాన్యం తెలియని పెద్దలు :

నేటి విద్యావిధానంలో ర్యాంకులు, మార్కులు, గ్రేడ్ల వరదల్లో తల్లిదండ్రులు కూడా కొట్టుకుపోతున్నారు. పిల్లలు ఆడు కావడానికి తల్లిదండ్రులు సరైన సమయం కూడా ఇవ్వడం లేదు. ప్రపంచవ్యాప్తంగా 78 శాతం మంది పేరెంట్స్ ఆటలు అవసరమని భావించడంతో లేదని, 73 శాతం మంది పిల్లలు తమ తల్లి తండ్రులు అనుమతించడం లేదని తెలపడం విచారకరం. పేదరికం, అవిద్య, సంక్షోభాలు, విపత్తులు, వివక్ష లాంటి అంశాలు పిల్లలను ఆటలకు దూరం చేస్తున్నాయి. ఆటల రూపంలో పాఠాలు నేర్పడం ఓ మహోన్నత బోధన పద్ధతి అని నేడు ప్లే స్కూల్స్ పేరుతో పాఠశాలలు వెలుస్తున్నాయి. ఆటల ఆధార బోధనలు పిల్లలకు సంతోషాలతో కూడిన చక్కటి, సులభమైన అవగాహనను కల్పిస్తున్నాయి. ఆటల ద్వారా పిల్లలకు ఓపిక, సహనం, సామాజిక సమ్మిళిత భావనలు, సంక్షోభాల నివారణ, శాంతి స్థాపన లాంటివి ఒనగూడుతాయి.

పిల్లలు ఆడుకోకవం వారి కనీస మానవ హక్కు. అలాంటి ఆడుకునే హక్కును హననం చేస్తే పిల్లల ఉజ్వల భవితకు తీవ్ర విఘాతం కలుగుతుంది. పిల్లల జీవితంలో ఆటలు ఓ చక్కటి ప్రవర్తనకు మార్గం చూపుతాయి. ప్రపంచ పోకడలను ఆకళింపు చేసుకోవడం, విశ్వ రహస్యాలను ఆవిష్కరించుకోవడం, తమ లక్ష్యాలు ధైర్యంగా చేరుకోవడం, చక్కటి సంభాషణాచాతుర్యాన్ని అలవర్చుకోవడం, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగడం లాంటి ప్రయోజనాలు కలిగిన ఆటలను ఆడడానికి పిల్లలను ప్రోత్సహిద్దాం, వయస్సును మరిచి పిల్లలుగా మారుతూ వారితో కలిసి ఆటలు ఆడదాం. ఆటలు ఆనందాన్ని పంచే దివ్య సాధనాలని, అమూల్యమైన సంతోషాలను బహుకరించే వేదికలు ఆటలు మాత్రమే అని తెలుసుకుందాం, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఆటలతో పునాదులు వేద్దాం.



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కవిత్వం - విప్లవం: రామ్ ప్రసాద్ బిస్మిల్ సాయుధ పోరాట ప్రస్థానం

భారత స్వాతంత్ర్యోద్యమ మహాసంగ్రామ చరిత్రను అవలోకిస్తే, అందులో కేవలం అహింసా మార్గమే కాకుండా, రక్తంతో లిఖించబడిన విప్లవ పంథా కూడా సమాంతరంగా సాగిందని స్పష్టమవుతుంది. పరాయి పాలన నుంచి మాతృభూమిని విముక్తం చేసేందుకు తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి, ఉరికొయ్యలను చిరునవ్వుతో ముద్దాడిన అమరవీరుల గాథలు దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడ్డాయి. అటువంటి మహోన్నత విప్లవకారులలో రామ్ ప్రసాద్ బిస్మిల్ పేరు అగ్రగణ్యంగా నిలుస్తుంది. ఆయన కేవలం ఆయుధం పట్టిన యోధుడు మాత్రమే కాదు; ఒక గొప్ప కవి, బహుభాషా కోవిదుడు, రచయిత, సంఘసంస్కర్త మరియు మతసామరస్యానికి ప్రతీక. భారతదేశానికి కేవలం రాజకీయ స్వేచ్ఛ మాత్రమే సరిపోదని, సామాజిక, ఆర్థిక సమానత్వంతో కూడిన సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కాంక్షించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన.రామ్ ప్రసాద్ బిస్మిల్ 1897 జూన్ 11న ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ పట్టణంలో ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు మూల్మతి, మురళీధర్. బాల్యం నుంచే తీవ్రమైన తెలివితేటలు, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించిన బిస్మిల్, భాషా పరంగా అసాధారణ ప్రతిభను కనబరిచారు. ఆయన హిందీ, ఉర్దూ, సంస్కృత భాషలపై పట్టు సాధించారు. ఆ కాలంలో సామాజిక చైతన్యానికి నిలయంగా ఉన్న ఆర్యసమాజ్ సిద్ధాంతాల పట్ల ఆయన ఆకర్షితులయ్యారు. ముఖ్యంగా, స్వామి దయానంద సరస్వతి రచించిన "సత్యార్థ ప్రకాశ్" అనే గ్రంథం బిస్మిల్ జీవితాన్ని ఒక గొప్ప మలుపు తిప్పింది. ఈ గ్రంథ పఠనం ఆయనలో జాతీయవాద భావాలను, సామాజిక సంస్కరణల పట్ల తపనను రగిల్చింది. ఆర్యసమాజ్ ప్రముఖ నాయకుడైన స్వామి సోమ్‌దేవ్ మార్గదర్శకత్వంలో ఆయన జాతీయోద్యమ దిశగా అడుగులు వేశారు. అదే సమయంలో, అమెరికా మరియు యూరప్ దేశాలలో ఉంటూ భారత విప్లవోద్యమాన్ని నడిపిస్తున్న లాలా హర్‌దయాల్ వంటి గదర్ పార్టీ నాయకుల ఆలోచనలు కూడా బిస్మిల్‌ను తీవ్రంగా ప్రభావితం చేశాయి.ఆయన రాజకీయ ప్రస్థానంలో 1916 నాటి లక్నో కాంగ్రెస్ సమావేశం ఒక కీలకమైన మైలురాయిగా నిలిచింది. ఈ సమావేశంలో మితవాద, అతివాద ధోరణుల మధ్య ఉన్న వ్యత్యాసాలను గమనించిన బిస్మిల్, కేవలం వినతులు, నమస్కారాల ద్వారా బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గద్దె దించలేమని గ్రహించారు. సాయుధ పోరాటం ద్వారానే తెల్లదొరల గుండెల్లో వణుకు పుట్టించగలమని నమ్మిన ఆయన, మైన్‌పురి ప్రాంతానికి చెందిన శివకృష్ణ వంటి విప్లవకారులతో చేతులు కలిపారు. ఈ క్రమంలోనే 1918లో 'మైన్‌పురి కుట్ర కేసు' వెలుగులోకి వచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవకారులను సమీకరించడం, నిషేధిత సాహిత్యాలను ముద్రించి పంచడం, నిధుల కోసం ప్రభుత్వ ఆస్తులను లక్ష్యం చేసుకోవడం వంటి ఆరోపణలపై బ్రిటిష్ పోలీసులు ఆయనను అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. అయితే, బిస్మిల్ పోలీసుల కళ్లు గప్పి సుమారు రెండేళ్ల పాటు యమునా నది పరివాహక ప్రాంతాలలో, రాంపూర్ గ్రామాలలో అజ్ఞాతంలో గడిపారు. ఈ అజ్ఞాతవాస సమయంలో ఆయన కేవలం కాలక్షేపం చేయకుండా, గ్రంథ రచనలు, అనువాదాలు చేస్తూ విప్లవ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.రామ్ ప్రసాద్ బిస్మిల్ కేవలం పోరాట యోధుడే కాదు, ఒక అద్భుతమైన భావజాలం గల కవి. ఆయన 'బిస్మిల్', 'రామ్', 'అజ్ఞాత్' అనే కలంపేర్లతో ఉర్దూ, హిందీ భాషలలో రాసిన దేశభక్తి కవితలు అప్పట్లో లక్షలాది మంది యువకులను విప్లవ పథం వైపు నడిపించాయి. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం పరాయి పాలనపై ధిక్కార స్వరమై గర్జించింది. విప్లవకారుల పెదవులపై నిరంతరం ధ్వనించిన "సర్ఫరోషీ కీ తమన్నా అబ్ హమారే దిల్ మే హై, దేఖ్నా హై జోర్ కిత్నా బాజూయేకాతిల్ మే హై" (మాతృభూమి కోసం ప్రాణాలర్పించాలనే కోరిక మా గుండెల్లో బలంగా ఉంది, హంతకుడి చేతుల్లో ఎంత బలం ఉందో చూస్తాం) అనే అమర గీతం వాస్తవానికి పాట్నాకు చెందిన బిస్మిల్ అజీమాబాదీ రాసినప్పటికీ, దీనిని తన కంఠస్వరంతో, విప్లవ పోరాట పటిమతో భారత జనావళి గుండెల్లోకి చేర్చి, దానికి శాశ్వతత్వాన్ని తెచ్చిన ఘనత రామ్ ప్రసాద్ బిస్మిల్‌కే దక్కుతుంది. జైలు గోడల మధ్య ఆయన రాసిన దేశభక్తి గేయాలు స్వాతంత్ర్య సమరంలో శక్తివంతమైన ఆయుధాలుగా మారాయి.1920వ దశకం ఆరంభంలో మహాత్మా గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమం చౌరీచౌరా ఘటన తర్వాత అకస్మాత్తుగా నిలిపివేయ బడటంతో దేశవ్యాప్తంగా యువత తీవ్ర నిరాశకు గురైంది. అహింసా మార్గం ద్వారా తక్షణ స్వాతంత్ర్యం సాధ్యం కాదని భావించిన బిస్మిల్, సచీంద్రనాథ్ సన్యాల్, యోగేశ్ చంద్ర చటర్జీ వంటి ప్రముఖులతో కలిసి 1924 అక్టోబర్‌లో కాన్పూర్‌లో "హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్" (HRA) అనే బలమైన విప్లవ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ యొక్క ప్రధాన ఆశయం సాయుధ విప్లవం ద్వారా బ్రిటిష్ వలస పాలనను అంతమొందించి, 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఒక సమాఖ్య ప్రజాస్వామ్య గణతంత్రాన్ని ఏర్పాటు చేయడం. ఈ సంస్థ కార్యకలాపాలను విస్తరించడానికి, ఆయుధాలను కొనుగోలు చేయడానికి మరియు విప్లవ పత్రికలను నడపడానికి పెద్ద ఎత్తున నిధులు అవసరమయ్యాయి.



దేశ ప్రజల నుంచి, ముఖ్యంగా పేద రైతుల నుంచి చందాలు వసూలు చేయడం బిస్మిల్‌కు ఇష్టం లేదు. స్వదేశీయులను దోచుకోవడం విప్లవ ధర్మం కాదని నమ్మిన ఆయన, భారత సంపదను దోచుకెళ్తున్న బ్రిటిష్ ప్రభుత్వ ఖజానాపైనే దెబ్బకొట్టాలని ఒక సాహసోపేతమైన వ్యూహాన్ని రచించారు.ఈ వ్యూహంలో భాగమే భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచిన 'కాకోరీ రైలు దోపిడీ' ఘటన. 1925 ఆగస్టు 9న లక్నో సమీపంలోని కాకోరీ రైల్వే స్టేషన్ దాటిన తర్వాత, విప్లవకారులు '8డౌన్ సహారన్‌పూర్‌లక్నో ప్యాసింజర్' రైలును గొలుసు లాగి నిలిపివేశారు. రామ్ ప్రసాద్ బిస్మిల్ నాయకత్వంలో అష్ఫాఖుల్లా ఖాన్, రాజేంద్రనాథ్ లహిరి, రోషన్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సచీంద్ర బక్షి, మన్మథ్‌నాథ్ గుప్తా తదితర పది మంది వీరయోధులు రైలులో ఉన్న గార్డు గదిలోకి ప్రవేశించి, బ్రిటిష్ ప్రభుత్వానికి చెందిన అధికారిక ఖజానా పెట్టెను పగులగొట్టి, అందులోని నిధులను స్వాధీనం చేసుకున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల

# జాతీయం-అంతర్జాతీయం

# మోదీ సరికొత్త రికార్డు

## కేంద్ర క్యాబినెట్ చారిత్రాత్మక తీర్మానం

### ప్రధాని నాయకత్వంపై క్యాబినెట్ ప్రశంసల జల్లు

**న్యూఢిల్లీ ,జూన్ ,10 (ఎ.ఎం.ఎస్):** అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా మోదీ కొత్త రికార్డు క్రియేట్ చేశారు. గతంలో నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన బ్రేక్ చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్ ఇవాళ ప్రత్యేకంగా సమావేశమైంది. అత్యధిక రోజులు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన మోదీని ప్రశంసిస్తూ కేంద్ర క్యాబినెట్ ఇవాళ తీర్మానం పాస్ చేసింది. క్యాబినెట్‌లో ఉన్న మంత్రులు అందరూ ఆ మీటింగ్‌లో పాల్గొన్నారు. మోదీపై ప్రశంసలు కురిపిస్తూ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ ప్రకటన చేశారు. ఆ తర్వాత మంత్రులందరూ లేచి నిలబడి చప్పట్లు కొట్టారు.

2014 మే 26వ తేదీన దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రధానిగా పోటీ చేసిన ఆయన ఘన విజయం సాధించారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లోనూ భారీ మెజారిటీతో ప్రధాని



పీఠాన్ని చేజిక్కించుకున్నారు. ఆ ఏడాది మే 30వ తేదీన ఆయన మళ్లీ ప్రధాని బాధ్యతలు చేపట్టారు

. ఇక మూడోసారి కూడా ప్రధానిగా 2024 జూన్ 9వ తేదీన మోదీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 4398 రోజుల పాటు బ్రేక్ లేకుండా ప్రధానిగా చేశారు. ఇప్పుడు ఆ రికార్డును మోదీ అధిగమించారు. నేటితో 4399 రోజుల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా మోదీ ఘనత సాధించారు.

### అభినందనలు కురిపించిన రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ ,జూన్ ,10 (ఎ.ఎం.ఎస్):** భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ కొత్త రికార్డు క్రియేట్ చేశారు. అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా చేసిన వ్యక్తిగా ఆయన నిలిచారు. గతంలో నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. ప్రధాని ఆఫీసులో 4399 రోజుల పాటు మోదీ వరుసగా ఆ బాధ్యతలను నిర్వర్తించారు. కేంద్రంలో 12 ఏళ్ల పాటు ప్రధానిగా ఉన్న మోదీకి ఇవాళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. అతిసుదీర్ఘ కాలం ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన విశిష్ట గౌరవాన్ని పొందారని ముర్ము తన స్టేట్మెంట్‌లో తెలిపారు. భారత ప్రజలు మీ నాయకత్వంపై ఉంచిన నమ్మకానికి ఈ అసాధారణ మైలురాయి ఓ పరీక్షగా నిలుస్తుందని, నమ్మకానికి.. విశ్వాసాన్ని చాటుతుందన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రాష్ట్రపతి ముర్ము ఓ పోస్టు చేశారు. పరిపాలనలో ఆధునీకరణ, ఆర్థిక స్థిరత్వం సాధించడానికి నిదర్శనంగా మీ పాలన నిలుస్తుందన్నారు. మీరు చేరుకున్న మైలురాయి.. బలమైన భారత ప్రజాస్వామ్య సంప్రదాయంలో కొత్త ఉత్సాహాన్ని, విశ్వాసాన్ని ఇస్తుందని ముర్ము అన్నారు.

## హర్మూజ్ జలసంధి వేదికగా తీవ్ర ఉద్రిక్తత

### యూఎస్ సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణుల మోత!

పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. హర్మూజ్ సమీపంలో అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. దీనికి టెహ్రాన్ కూడా గట్టిగా ప్రతిస్పందిస్తోంది. గల్ఫ్ ప్రాంతాల్లో అగ్రరాజ్య స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తోంది.అమెరికా దాడులను దురాక్రమణ చర్యగా ఐఆర్‌జీసీ అభివర్ణించింది. బహ్రెయిన్‌లోని అమెరికా నావికా ఫ్లీట్‌తో పాటు, జోర్డాన్‌లోని ఆ దేశానికి చెందిన అల్ అజ్రాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కువైట్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా ఉత్తర ఇరాక్‌లలో పలు పేలుడు శబ్దాలు వినిపించాయి. తమ భూభాగంపై దాడులు ఇలానే కొనసాగితే.. తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. దీనికి ముందు దక్షిణ ఇరాన్‌లోని జాస్క్, సిరిక్, ఖేష్మ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా యూఎస్ దళాలు దాడులు చేశాయి. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు ప్రారంభించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడులను



ట్రంప్ సమర్థించుకున్నారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్)కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రతిస్పందనలు చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. వారు మా హెలికాప్టర్‌ను కూల్చివేశారు. వారు చేసిన దానికి ఇది మా ప్రతిస్పందన. ఇది చాలా బలంగా.. అత్యంత శక్తిమంతంగా ఉండాలని అనుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై ప్రతీకార దాడులు మొదలుపెట్టిన అమెరికాఅమెరికా రీపర్ డ్రోన్ కూల్చేశాం.. వైమానిక ఘర్షణ నేపథ్యంలో.. బుషెహర్ ప్రావిన్స్‌పై ఒక అమెరికా రీపర్ డ్రోన్ కూల్చివేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనను అమెరికా ఇంకా ధ్రువీకరించలేదు. దాడుల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీఅమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. యూఎస్ తమ సహనాన్ని పరీక్షిస్తోందన్నారు. దాడులు, బెదిరింపులకు తమ సాయుధ దళాలు కచ్చితంగా స్పందిస్తాయన్నారు.

క్షేమంగా ఉండాలనుకుంటే.. వెంటనే ఈ ప్రాంతాన్ని వీడాలని యూఎస్ బలగాలను హెచ్చరించారు.

## యూఎస్ సిటిజన్‌షిప్ రద్దు

**న్యూఢిల్లీ ,జూన్ ,10 (ఎ.ఎం.ఎస్):** ట్రంప్ ప్రభుత్వం అమెరికా చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో పౌరసత్వాల రద్దు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మోసపూరిత పద్ధతుల్లో, తప్పుడు సమాచారంతో అమెరికా పౌరసత్వం పొందిన 17 మంది పౌరులను లక్ష్యంగా చేసుకుని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ న్యాయపరమైన చర్యలు ప్రారంభించింది. ఈ జాబితాలో న్యూజెర్సీకి చెందిన భారతీయ సంతతి వ్యాపారవేత్త, మాజీ సీఈఓ నీరజ్ శర్మ (50) పేరు ఉండటం అంతర్జాతీయంగా వార్తల్లో నిలిచింది.భారత్‌లో జన్మించిన నీరజ్ శర్మ, 'మాగ్నానివిజన్ ఎల్ఎల్‌సీ' అనే ఐటీ స్టాఫింగ్ కంపెనీని నిర్వహిస్తూ విదేశీ ఉద్యోగుల తరపున హెచ్1బీ వీసా పిటిషన్లను దాఖలు చేసేవారు. ఒక ప్రముఖ గ్లోబల్ ఫైనాన్షియల్ సంస్థలో ఈ ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నట్లు చూపుతూ.. ఆయన 11 నకిలీ హెచ్1బీ పిటిషన్లను సమర్పించారని ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ దరఖాస్తుల కోసం సదరు సంస్థ ఎగ్జిక్యూటివ్‌ల సంతకాలను ఫోర్జరీ చేయడమే కాకుండా, నకిలీ పత్రాలను కూడా సృష్టించినట్లు తేలింది. ఈ మోసం 2015 నుండి 2017 మధ్య కాలంలో జరిగినట్లు అధికారులు గుర్తించారు.

పౌరసత్వం రద్దుకు దారితీసిన అబద్ధం నీరజ్ శర్మ డిసెంబర్ 2017లో అమెరికా పౌరసత్వం పొందారు. అయితే పౌరసత్వ దరఖాస్తు ప్రక్రియలో భాగంగా ఆయన .. తాను ఎలాంటి నేరాలకు పాల్పడలేదని, ప్రభుత్వ అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. కానీ ఆ తర్వాత ఆయన వీసా మోసం కేసులో దోషిగా తేలారు. తాజా కోర్టు ఫైలింగ్స్ ప్రకారం.. పౌరసత్వ అర్హతను దెబ్బతీసే తన నేరపూరిత ప్రవర్తనను శర్మ ఉద్దేశపూర్వకంగా దాచారని న్యాయ శాఖ వాదిస్తోంది. మోసపూరిత సమాచారంతో పొందిన పౌరసత్వాన్ని చట్టప్రకారం రద్దు చేయాలని అమెరికా ప్రభుత్వం పట్టుబడుతోంది.

అమెరికా ప్రభుత్వం కేవలం వలసల మోసాలకే పరిమితం కాకుండా.. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని కూడా ఏరివేస్తోంది. ఈ 17 మంది జాబితాలో చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు, మనీ లాండరింగ్, వైర్ ఫ్రాడ్, డ్రగ్స్ వంటి ఘోరమైన నేరాలకు పాల్పడి పౌరసత్వం పొందిన వారు ఉన్నారు. వీరిలో ఒక హైతీ వలసదారుడు, కొలంబియాకు చెందిన మాజీ క్యాథలిక్ ప్రీస్ట్, మెక్సికోకు చెందిన వ్యక్తితో పాటు మాజీ యుగోస్లావ్ పౌరుడు కూడా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## దీదీ పార్టీలో మారుతున్న రాజకీయ

# ఎంపీ పదవికి మరో కీలక నేత గుడ్‌బై!

**న్యూఢిల్లీ ,జూన్ ,10 (ఎ.ఎం.ఎస్):** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి మరో రాజ్యసభ ఎంపీ రాజీనామా చేశారు. ఎంపీ సుస్మితా దేవ్ తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ వారంలోనే టీఎంసీ నుంచి వైదొలగిన రెండో రాజ్యసభ సభ్యురాలు ఈమె కావడం గమనార్హం. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపిన తన రాజీనామా లేఖను తక్షణమే ఆమోదించాలని సుస్మితా దేవ్ కోరారు. రాజీనామా చేసిన కొద్దిసేపటికే, ఆమె ఢిల్లీలో అసోం ముఖ్యమంత్రి, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మతో ఆయన నివాసంలో నవ్వుతూ కనిపించిన ఫోటోలు బయటకు వచ్చాయి. ఇదే వారంలో సోమవారం నాడు, టీఎంసీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సుఖేందు శేఖర్ రాయ్ కూడా పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా



చేసిన విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితమే, 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు పార్టీ నాయకత్వాన్ని ధిక్కరించి, ప్రతిపక్ష నేత పదవికి అధికారిక అభ్యర్థిని కాదని వేరే వ్యక్తికి మద్దతు పలికారు. స్పీకర్ కూడా వారి నిర్ణయాన్నే మద్దతు తెలపడంతో పార్టీలోని లోతైన విభేదాలు బహిర్గతమయ్యాయి

## పాప్ సింగర్ లవ్ ప్రపోజల్‌పై సామాజిక మాధ్యమాల్లో

# మీమ్స్, భిన్నమైన కామెంట్ల వర్షం

**వుదయం డెస్క్,** అమెరికా కు చెందిన ప్రముఖ పాప్ సింగర్ కేటీ పెర్రీ తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో తో తాను పీకల్లోతు ప్రేమలో ఉన్నానని, ఆయనే తన జీవితానికి సర్వస్వం అని ఆమె ప్రకటించారు. ఇటీవల న్యూయార్క్ నగరంలో జరిగిన 'కేటీ పెర్రీ : ది లైఫ్‌టైమ్స్ టూర్' కాన్సర్ట్ ఫిల్మ్ ప్రీమియర్‌కు ఆమె జస్టిన్ ట్రూడోతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలిసారిగా ఇద్దరూ జంటగా రెడ్ కార్పెట్‌పై నడిచారు.ఈ కార్యక్రమంలో కేటీ పెర్రీ మాట్లాడుతూ.. 'నేను గాఢమైన ప్రేమలో ఉన్నా. నా జీవితానికి సర్వస్వం అయిన వ్యక్తిని కలిసిన తర్వాతే ఈ షో చేశా. ఆయన నా జీవితానికి ఒక లంగరులా నిలిచారు. నేను ఒక రంగుల గాలిపటం లాంటి దాన్ని, ఎంతో ఎత్తుకు ఎగురుతా. అలాంటి నాకు ఒక ఆధారం అవసరం. ఇప్పుడు ఆ ఆధారం దొరకడంతో నా జీవితం పరిపూర్ణంగా అనిపిస్తోంది' అని ఆనందం వ్యక్తంచేశారు. తన జీవితం ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.కేటీ పెర్రీకి గతంలో నటుడు రస్సెల్ బ్రాండ్‌తో వివాహం కాగా.

. విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత నటుడు ఓర్లాండో బ్లూమ్‌తో నిశ్చితార్థం జరిగి, కుమార్తె డైసీ జన్మించింది. అయితే 2025లో బ్లూమ్‌తో నిశ్చితార్థం రద్దు కావడం తన జీవితంలో అత్యంత కష్టమైన సమయాల్లో ఒకటని ఆమె గుర్తుచేసుకున్నారు. 'ఆ కష్టాల నుంచి బయటపడ్డా. అభిమానులకు, నా కుమార్తెకు, నాకు నేను ఇచ్చిన మాట కోసం నిలబడ్డాను. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అగ్నిపరీక్షను ఎదుర్కోవాల్సిందే' అని కేటీ పెర్రీ అన్నారు.



ప్రస్తుతం తన 40 ఏళ్ల వయసులో జీవితాన్ని కొత్త కోణంలో చూస్తున్నానని, మరింత పరిణతి చెందిన వ్యక్తిగా మారానని ఆమె పేర్కొన్నారు. కాగా గత కొన్నాళ్లుగా ట్రూడో, పెర్రీల ప్రేమాయణం వార్తలు వస్తూనే ఉన్నాయి. వీళ్లిద్దరూ జంటగా అనేక ఈవెంట్లలో కనిపించడంతో ఊహాగానాలకు బలం చేకూరింది. తాజాగా పెర్రీ చేసిన ప్రకటనతో వీరి ప్రేమ నిజమేనని నిర్ధారణ అయ్యింది.

## రాజ్యాంగబద్ధమైన సంస్థలపై మాకు పూర్తి నమ్మకం ఉంది



హైదరాబాద్: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షినటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. ఎన్నికల అఫిడవిట్‌లో ఓ కేసుకు సంబంధించిన వివరాలను నమోదు చేయలేదనే కారణంతో ఆ రాష్ట్ర ఎన్నికల రిటర్న్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. తాజాగా ఈ అంశంపై కాంగ్రెస్ ప్రతినిధుల బృంద సభ్యులు కేసీ వేణుగోపాల్, అభిషేక్ మను సింఘ్వీ, జైరాం రమేష్, రణదీప్ సింగ్ సూర్జేవాలా, వివేక్ తంఖా, దిగ్విజయ్ సింగ్, భూపేష్ బఘేల్ వంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం మీనాక్షినటరాజన్ మీడియాతో మాట్లాడారు.'తాము తమ వాదనలను ఎన్నికల సంఘం ముందు ఉంచామని, ఇప్పుడు వారి స్పందన కోసం ఎదురుచూస్తున్నామని నటరాజన్ చెప్పారు.

"రాజ్యాంగబద్ధమైన సంస్థలపై మాకు ఇంకా పూర్తి నమ్మకం ఉంది, అందుకే మేము ఈ పోరాటం చేస్తున్నాము. ఎన్నికల సంఘం ఈ రోజు మా వాదనను విన్నది, ఇప్పుడు మేము వేచి చూస్తున్నాము. మా పోరాటం కొనసాగుతూనే ఉంది.

ప్రజాస్వామ్యంలో ఏదో ఒక రూపంలో ప్రజాస్వామ్య విలువలు ఇంకా మిగిలే ఉంటాయని మేము ఇప్పటికీ నమ్ముతున్నాము," అని నటరాజన్ పేర్కొన్నారు. పార్టీకి చెందిన న్యాయ నిపుణుల బృందం కమిషన్ ముందు తమ వాదనలను వినిపించిందని ఆమె తెలిపారు. "మా తరపున సీనియర్ న్యాయవాదులు తమ వాదనలను సమర్పించారు, మేము మా పోరాటాన్ని కొనసాగిస్తున్నాం' అని చెప్పారు.

## ఆఫ్ఘనిస్తాన్‌పై పాక్ వైమానిక దాడులు



**కాబూల్:** పాకిస్థాన్ బుధవారం చేపట్టిన దాడుల్లో సుమారు 13 మంది మృతిచెందినట్లు ఆఫ్ఘనిస్తాన్ ప్రకటించింది. ఆ దాడిలో మరో 14 మంది గాయపడినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఆఫ్ఘనిస్తాన్‌లోని ఖోస్త్, కునార్, పక్తికా ప్రావిన్సులను టార్గెట్ చేసినట్లు తాలిబన్ చీఫ్ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. ఈ దాడుల్లో 11 మంది చిన్నారులు, ఓ మహిళ, ఓ వృద్ధుడు చనిపోయినట్లు చెప్పారు. ఈ దాడుల గురించి పాకిస్థాన్ ఎటువంటి ప్రకటన చేయలేదు. గత ఫిబ్రవరి నుంచి పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య తీవ్ర ఫైటింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ పోరులో వందల సంఖ్యలో జనం మృతిచెందారు. పాక్ జరిపిన వైమానిక దాడులకు కౌంటర్‌గా ఆఫ్ఘనిస్తాన్ సీమాంతర అటాక్ చేసింది. పాకిస్థాన్‌లో జరుగుతున్న ఉగ్రదాడులకు కారణమైన ఉగ్రవాదులను ఆఫ్ఘనిస్తాన్ పెంచి పోషిస్తున్నట్లు పాక్ ఆరోపిస్తున్నది. పాకిస్థానీ తాలిబన్ అలియాస్ తెహ్రీక్ ఈ తాలిబన్ పాకిస్తాన్ వ్యవస్థ దాడులు చేస్తున్నట్లు పాక్ పేర్కొన్నది. ఆఫ్ఘన్ తాలిబన్‌తో ఆ సంస్థకు లింకు ఉన్నట్లు పాక్ ఆరోపిస్తున్నది. కానీ కాబూల్ మాత్రం ఆ ఆరోపణలను కొట్టిపారేసింది.

## అమెరికా సైనిక ఎయిర్‌బేస్‌పై ఇరాన్ దాడి



**వుదయం డెస్క్,** అమెరికా దళాలపై ఇరాన్ విరుచకుపడింది. జోర్డాన్‌లో ఉన్న అమెరికా దళాలకు చెందిన ఎయిర్‌బేస్‌పై క్షిపణి దాడి చేసింది ఇరాన్. అయితే ఈ దాడి గురించి జోర్డాన్ కానీ, అమెరికా కానీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. మువాఫక్ సాల్టీ ఎయిర్ బేస్‌పైకి క్షిపణులతో దాడి చేసినట్లు ఇరానీ పారామిలిటరీ రెవల్యూషనర్ గార్డులు పేర్కొన్నారు. ఈ ఎయిర్‌బేస్‌లో అమెరికాకు చెందిన ఎఫ్35 యుద్ధ విమానాలతో పాటు ఇతర విమానాలు ఉన్నాయి. హోర్ముజ్ వద్ద మంగళవారం అమెరికాకు చెందిన ఆర్మీ అపాచీ హెలికాప్టర్ కూలిన విషయం తెలిసందే. ఆ ఘటన నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగింది. దీంతో ఆ దాడుల్ని తిప్పికొట్టేందుకు ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. బుధవారం అమెరికా మిలిటరీ వైమానిక దాడులకు పాల్పడింది. అయితే ఇరాన్ కౌంటర్ దాడికి దిగింది. దీంతో బహ్రెయిన్ ద్వీపంపై కూడా దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఆ ద్వీపంలో అమెరికా నౌకాదళానికి చెందిన ఫిఫ్త్ ఫ్లీట్ బస చేస్తోంది. అయితే ఆ నౌకాదళంపై ప్రతీకార దాడులకు పాల్పడినట్లు ఇరాన్ పేర్కొన్నది.

## దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో కాల్పులు



దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఈ ఘటనలో 12 మంది మరణించారు. ఈ ఘటన తూర్పు జోహన్నెస్‌బర్గ్‌లోని, క్లీవ్‌ల్యాండ్‌లో ఉన్న జంపర్స్ ఇన్‌ఫార్మల్ సెటిల్‌మెంట్‌లో ఈ సెటిల్‌మెంట్ ఏరియాలోకి పది మంది వరకు దుండగులు టొయోటా వాహనంలో వచ్చారు. ఆయుధాలు కలిగిన ఈ దుండగులు అక్కడ ఉన్న వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ సెటిల్‌మెంట్ పరిధిలోని రెండు యాక్సెస్ పాయింట్లను ఎంచుకుని, అక్కడి నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 9 మంది గాయపడ్డారు. కాల్పుల అనంతరం దుండగులు అక్కడినుంచి పారిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల్ని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ కాల్పులపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.10 మంది నిందితుల కోసం వెతుకుతున్నారు. ఇంకా నిందితుల్ని పట్టుకోలేదు.

ఇదే సమయంలో ఈ కాల్పులకు గల కారణాలు కూడా తెలియలేదు. నిందితులు ఇంత భారీ స్థాయిలో ఎందుకు కాల్పులు జరిపారు అనే కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఇటీవలి కాలంలో దక్షిణాఫ్రికాలో హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రాజ్యసభ పదవికి సుస్మితా దేవ్ గుడ్‌బై!

**కోల్‌కతా జూన్ ,10 (ఎ.ఎం.ఎస్):** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా చేసిన కొద్ది రోజుల వ్యవధిలోనే, మరో కీలక మహిళా నేత, రాజ్యసభ ఎంపీ సుస్మితా దేవ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత టీఎంసీలో తిరుగుబాటు తీవ్రరూపం దాల్చింది. ఈ పరిణామాల మధ్యే సుస్మితా దేవ్ ఢిల్లీలో అస్సాం బీజేపీ ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.పతనం దిశగా మమత సామ్రాజ్యం?ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చేతిలో ఘోర పరాజయం పాలైన తర్వాత టీఎంసీని కాపాడుకోవడం మమతా బెనర్జీకి కత్తిమీద సాములా మారింది. మూడు పర్యాయాలు అధికారంలో ఉన్న పార్టీ ఇప్పుడు అంతర్గత కుమ్ములాటలతో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికే ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ 58 మంది శాసనసభ్యుల మద్దతుతో అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పదవిని



కోరుతుండగా, మరో ఎంపీ కాకోలి ఘోష్ 19 మంది అసమ్మతి ఎంపీలతో కలిసి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమవడం పార్టీ పతనానికి సంకేతంగా మారింది.అవినీతిపై తిరుగుబాటు బావుటాపతనం దిశగా మమత సామ్రాజ్యం? మూడు పర్యాయాలు అధికారంలో ఉన్న పార్టీ ఇప్పుడు అంతర్గత కుమ్ములాటలతో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికే ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ 58 మంది శాసనస , ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చేతిలో ఘోర పరాజయం పాలైన తర్వాత టీఎంసీని కాపాడుకోవడం మమతా బెనర్జీకి కత్తిమీద సాములా మారింది ఈ వారంలోనే మరో ప్రముఖ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ పార్టీకి రాజీనామా చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీఎంసీలో అడ్డూఅదుపూ లేని అవినీతి, అరాచకం కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి సమావేశానికి కొన్ని గంటల ముందే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పార్టీ సంస్థాగత నిర్మాణంలో అవినీతి వేళ్లునుకుపోయిందని, ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని రాయ్ మండిపడ్డారు. గతంలో అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పని చేసిన సుస్మితా దేవ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రాజ్‌దీప్ రాయ్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత 2021లో కాంగ్రెస్‌ను వీడి టీఎంసీలో చేరారు. పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా కూడా బాధ్యతలు నిర్వహించిన ఆమె, ఇప్పుడు రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయడంతో మమతా బెనర్జీ రాజకీయ వ్యూహాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది

. ప్రస్తుతం ఆమె బీజేపీ సీఎం హిమంత బిస్వా శర్మతో భేటీ కావడంతో, ఆమె త్వరలోనే కాషాయ తీర్థం పుచ్చుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్. ఒక మొక్క నాటితే ప్రకృతికి ప్రాణం పోసినట్లే. మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా.**

**వరంగల్ జిల్లా నర్సంపేట జూన్ 10 (వుదయం ప్రతినిధి) :** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో పరిశుభ్రమైన వాతావరణ కోసం పచ్చదనాన్ని పెంపొందించడానికై మున్సిపల్ చైర్మన్ శ్రీ లక్ష్మీ, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, నర్సంపేట ఏసిపి పున్నం రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి వృక్షాలుగా మారే వరకు ప్రతి ఒక్కరూ దత్తత తీసుకుని నీరు పోస్తూ సంరక్షించాలని పరిశుభ్రమైన వాతావరణం కోసం పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం తమ అందరిపై ఉందని అన్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం, ఉష్ణోగ్రతల నుంచి భూమిని కాపాడుకోవడానికి వృక్ష సంపద ఎంతో అవసరమని భావితరాలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి పచ్చని పర్యావరణమేనని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నామని, ప్రజలు తమ ఇంటి ఆవరణలో స్థలం ఉన్నచోట తప్పకుండా మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణానికి ముప్పుగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని, పట్టణాన్ని స్వచ్ఛంగాఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ యంత్రాంగం పట్టణాన్ని సుందరంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఆసుపత్రి అభివృద్ధికి, రోగులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్స్ కాంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, పొన్నాల మనిషా ప్రకాష్, దొంగల రజిత, మాజీ ఎంపిటిసి కాట ప్రభాకర్, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకుంటున్నాం

# ప్రతి హామీని నెరవేరుస్తున్నాం



**ఖమ్మం, వుదయం బ్యూరో జూన్ 10:** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరంలోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ.600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నా యని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌళిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రగతి పథంలో నల్లగొండ

### ఘనంగా ప్రారంభమైన అభివృద్ధి జాతర

- రూ.13 వేల కోట్ల రోడ్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన
- మైనార్టీల సంక్షేమానికి భారీ వరాలు ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ, జూన్ 10 (వుదయం ప్రతినిధి)** నల్లగొండ జిల్లాలో రహదారులు, తాగునీరు, విద్య, మైనార్టీల సంక్షేమ రంగాల్లో భారీ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శ్రీకారం చుట్టారు. కనగల్ వేదికగా రూ.13,000 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి అభివృద్ధి జాతరకు నాంది పలికారు.తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రోడ్ల అభివృద్ధి కార్యక్రమంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 6,300 కిలోమీటర్ల రహదారులు డబుల్ రోడ్లుగా అభివృద్ధి కానున్నాయి. ఇందులో భాగంగా దర్వేశిపురం-గుర్రంపోడు-కొండమల్లేపల్లి-డిండి రహదారి అభివృద్ధికి రూ.300 కోట్లు, చిట్యాల-రామన్నపేట-వలిగొండ-భువనగిరి-జగదేవ్‌పూర్ రహదారికి మరో రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. నల్లగొండ పట్టణ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.125 కోట్లతో ఆధునిక వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు ఆమోదం లభించినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.మైనార్టీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, మాన్యంచెల్కలో రూ.44 లక్షలతో ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అవసరమైతే రూ.1 కోటి వరకు వ్యయం చేసి ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శిక్షణ అందించే ప్రణాళికను కూడా ప్రకటించారు.ముస్లిం మైనార్టీల కోసం రూ.10 కోట్లతో ఆధునిక షాదీఖానా నిర్మాణం చేపడతామని వెల్లడించారు. అలాగే పేద ముస్లిం కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, అవసరమైతే ఇళ్ల స్థలాలు కూడా అందజేస్తామని తెలిపారు.నల్లగొండలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన మంత్రి, జూలై నెలలో లబ్ధిదారులు గృహప్రవేశం చేసుకునేలా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, "నల్లగొండను తెలంగాణలోనే నంబర్ 1 జిల్లాగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు.

## గ్రామసభలతోనే ప్రజా సమస్యల పరిష్కారం



**జనగాం, జూన్ 10 (వుదయం ప్రతినిధి) :** ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా బచ్చన్నపేట మండలం రామచంద్రపురం రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలుపై అధికారులకు, ప్రజలకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణ కోసం గ్రామాల్లో తడి, పొడి చెత్త విభజన పక్కాగా జరగాలి. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, తగలబెట్టడం చేయకూడదు. దీనిపై అధికారులే ప్రజల్లో అవగాహన కల్పించాలి.

వర్షాకాలం దృష్ట్యా పైపులైన్ల మరమ్మత్తులు, నీటి ట్యాంకుల శుభ్రత చేపట్టాలి. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు స్ప్రేయింగ్ చేయాలి. వైద్యారోగ్య శాఖ అధికారులు 'ఫీవర్ సర్వే' నిర్వహించి బాధితులకు తగిన వైద్యం అందించాలి.సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ, గ్రామాల్లో ఇసుక, నీరు వంటి ఇతర సమస్యలు ఉంటే ప్రజలు 18004256605 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి అధికారుల దృష్టికి తీసుకురావచ్చు.వారంలోగా NFBS సాయం: సభలో బాలమణి అనే మహిళ తన భర్త మరణించాడని, పెన్షన్ కావాలని కోరగా.. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆమెకు వారం రోజుల్లోగా NFBS (నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్) ద్వారా ఆర్థిక సాయం అందేలా చూడాలని ఎంపీడీఓను ఆదేశించారు. మండలంలో అర్హులైన వారందరికీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ చేసి, ఈ పథకం వర్తింపజేయాలన్నారు.నిరంతర గ్రామసభలు: ప్రతి 15 రోజులకోసారి గ్రామసభలు నిర్వహించి స్థానిక సమస్యలను పరిష్కరించాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు బాధ్యతగా పని చేయాలి.అనంతరం రామచంద్రపురం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌లో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి, రాబోయే 34 నెలల్లో నిర్మాణం పూర్తయ్యేలా పర్యవేక్షించాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని, కావలసిన మౌలిక వసతులను తప్పకుండా సమకూరుస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రంగారావు, ఎంపీడీఓ, సర్పంచ్ వినోద్,
ఉప సర్పంచ్, అలాగే వ్యవసాయ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి వాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్**

**మహబూబాబాద్ జిల్లా /గూడూర్ జూన్ 10 (వుదయం ప్రతినిధి):** గూడూర్ గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పాల్గొని హెల్మెట్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వలన అనేక ప్రమాదాలలో యువత ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసినారు. ప్రతి వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ నో ఎంట్రీ పేరుతో తీర్మానాలు చేసిన సర్పంచులను అభినందించారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని గంజాయి అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం ఇస్తే వారికి ఐదు వేల రూపాయల నజరానా అందిస్తామని సమాచారము ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపినారు . అనంతరము పంచాయితీ సిబ్బందికి హెల్మెట్స్ పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మార్వో నాగ భవాని ఎంపీడీవో సత్యనారాయణ ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు సిడిపిఓ నీలిమ వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ కార్యదర్శి తిరుమల గూడూరు సిఐ వినయ్ కుమార్ ఎస్సై గిరిధర్ రెడ్డి ఉప సర్పంచ్ చంటి స్వామి గ్రామపంచాయతీ సిబ్బంది గూడూరు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇండ్ల పనుల్లో వేగం పెంచాలి



**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, జూన్ 10 (వుదయం ప్రతినిధి) :** ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచాలని, వీవో భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం రోజున కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో ఉపాధి హామీ, వీవో భవనాలు, ఇందిరమ్మ ఇండ్లు, ప్లాంటేషన్, సామాజిక భద్రతా పెన్షన్లు, ఇందిరా మహిళా శక్తి కేంద్రం తదితర అంశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యాంశాలను వెల్లడించారు. వీవో భవనాల పనులను వెంటనే ప్రారంభించి,

నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలి.ఇందిరమ్మ ఇండ్లు, ప్లాంటేషన్, లబ్ధిదారులకు సహకారం అందిస్తూ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటే లక్ష్యాలను చేరుకోవడంతో పాటు, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పెన్షన్లు, మహిళా శక్తి కేంద్రం వద్ద ప్రజా దర్బార్‌లో అందిన పెన్షన్ దరఖాస్తులను పరిశీలించి అర్హుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. జిల్లా ఇందిరా మహిళా శక్తి కేంద్రం భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి. జిల్లా సమాఖ్య పెట్రోల్ బంక్‌కు అవసరమైన అనుమతులు త్వరితగతిన పొందాలి.గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్, తాడ్వాయి మండలం కొండపర్తిలో మహిళా సంఘాలు తయారు చేస్తున్న మిర్చిపసుపు, ఇప్పపూల లడ్డు ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాలి. స్థానిక ఉత్పత్తులకు బ్రాండింగ్,

ప్యాకేజింగ్ సదుపాయాలు కల్పించి మహిళల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలి. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, డీఆర్డీఏ పిడి చంద్రశేఖర్, అదనపు పీడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మేడిగడ్డ పిల్లర్లు కుంగుడం జరిగింది

- మేడిగడ్డ ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందించేందుకు చర్యలు
- ప్రాజెక్టు పునరుద్ధరణకై జరుగుతున్న పరీక్షల పనుల పరిశీలన
- రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి జూన్ 10(వుదయం జిల్లా ప్రతినిధి)** గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మేడిగడ్డ పిల్లర్లు కుంగుడం జరిగిందని 2027 వరకు ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.బుధవారం మేడిగడ్డ ప్రాజెక్టు పునరుద్ధరణకై జరుగుతున్న పరీక్షల పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2014 కంటే ముందే కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును 38వేల కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే దాదాపు 11 వేల కోట్ల రూపాయల పనులు పూర్తి కాగా దాదాపు 30 శాతం పని జరిగిందని తెలిపారు. 2014 తరువాత ఏర్పడిన ప్రభుత్వం కావాలనే ప్రాజెక్టు డిజైన్ మార్పు చేసి మేడిగడ్డ ప్రాజెక్ట్ రూపకల్పన చేసినట్లు తెలిపారు.16.50 లక్షలు ఎకరాలకు సాగునీరు అందించేచేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనులు కావాలనే గత ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడం వల్ల ఇబ్బంది కలిగిందని, తప్పుడు నిర్ణయాలతో ప్రాజెక్టుకు కాలయాపన చేశారని తెలిపారు. దాదాపు 1,45,000 కోట్లతో మేడిగడ్డ బ్యారేజీ పనులు చేపట్టారని బ్యారేజీ లోపభూయిష్టమైన నిర్మాణం వల్ల కుంగుడం జరిగిందని తెలిపారు. ప్రాజెక్టు కుంగడానికి గల కారణాలను లోతుగా విశేషణ చేసేందుకు అత్యంత నైపుణ్యం అత్యంత అనుభవం కలిగిన కల్నల్ పరిషిత్ మెహ్రా చైర్మన్ ఆధ్వర్యంలో ముందుకు పోతున్నట్లు తెలిపారు. కమిటీలో చాలామంది దేశ విదేశాల నుంచి నిపుణులు పెట్టి ఈ పరీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. పరీక్షలు ఎక్కడ వరకు వచ్చాయో పురోగతిని తనిఖీ చేసేందుకు నేడు తనిఖీకి వచ్చినట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులు ప్రారంభించడానికి ముందే ప్రతి బ్యారేజ్



సీడబ్ల్యూసీ, ఎన్డిఎస్ఏ వంటి ప్రతిష్టాత్మకమైన అనుభవం కలిగిన సంస్థలచే పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. లోప భూయిష్టంగా నిర్మాణం ఉందని అంచనాలు తయారు చేశారని సాంకేతికంగా అత్యంత పకడ్బందీ పరీక్షలు నిర్వహించి ప్రాజెక్టు వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎలాంటి రాజకీయ దురుద్దేశ్యం లేదని తెలిపారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీ మరమ్మతులు పనులు చేపట్టినట్లు తెలిపారు. డిజైన్ అంత సిద్ధంగా ఉన్న తదుపరి సిడబ్ల్యుసి మరియు ఎన్ డి ఎస్ ఏ అనుమతి తీసుకొని ఈ వర్షాకాలం కాగానే సుమారు నవంబర్ డిసెంబర్ మాసాలలో పనులు మొదలుపెట్టి ఒక వర్కింగ్ సీజన్లో పనులు పూర్తి చేసే ప్రయత్నం చేసి 2027 ఎండాకాలం వరకు పనులు పూర్తి చేయడానికి ఒక లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత సైన్యంలో యొక్క ఫిజికల్ కండిషన్ తనకి చేస్తూ సమస్యలు ఉంటే మరమ్మతులు చేసేందుకు కార్యచరణ చేపట్టనున్నట్లు తెలిపారు.తనిఖీలు కేంద్రాలకు వెళ్ళిన తర్వాత ఎనర్జీ డిస్సెస్మెంట్ కూడా పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, ఇరిగేషన్ సెక్రెటరీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, సీఈ శ్రీనివాస్ గుప్తా, ఆర్డిఓ రవీందర్, ఇరిగేషన్ ఎస్ఈ దస్తగిరి, ఈఈ రమేష్, కన్సల్టెంట్ ఈఈ యాదగిరి, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, డిపిఆర్ఓ శ్రీనివాసరావు,తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ రవీంద్రనాథ్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రవెల్లి విలాస్రావు, అస్రార్ అహ్మద్ ఖురేషి, తుంగల సంతోష్,తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మరోవైపు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు, నేతృత్వంలో ఎస్సై పవన్ కుమార్ పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## దేశానికే ఆదర్శంగా రాష్ట్ర మహిళా సాధికారత విధానాలు

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**హనుమకొండ, జూన్ 10 (వుదయం జిల్లా ప్రతినిధి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు కేవలం ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.మహిళా శక్తి పథకం, మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులు రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 TGSRTC బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇచ్చాయి.స్థిరమైన ఆదాయం కోసం ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా మారారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 అద్దె చొప్పున, అన్ని బస్సుల ద్వారా ప్రతి నెల రూ.3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోంది. ఇప్పటివరకు రూ.20.34 కోట్ల అద్దె ఆదాయం చేకూరింది.మహాలక్ష్మి పథకం విజయం, రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటి వరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారు. దీనివల్ల మహిళలు సుమారు రూ.10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారు. ఈ ఆదా మొత్తం కుటుంబ అభివృద్ధికి, పిల్లల చదువులకు ఉపయోగపడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 86 బస్సులు: ఉమ్మడి వరంగల్ పరిధిలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 86 బస్సులు కేటాయించారు. (మహబూబాబాద్16, హనుమకొండ12, జనగాం12, వరంగల్11, భూపాలపల్లి11, ములుగు9).మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా.. ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా, ఆదాయ సృష్టికర్తలుగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 10 (వుదయం ప్రతినిధి)** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు మండలంలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు,..గత సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలిగించిన పీఆర్126 వరి రకాన్ని సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, పంటల వైవిధ్యీకరణ ద్వారా అధిక దిగుబడులు, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని, అర్హత కలిగిన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలానికి మూడు ప్రీప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యాయని తెలిపారు.పారదర్శకమైన ఓటరు జాబితా తయారీ కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంటింటికి వచ్చే బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) సరైన వివరాలు అందించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామ సభకు వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వర్ణ, ఎంపిడిఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష ఇతర మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ శిక్షణ

- **సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట జూన్:10 వుదయం ప్రతినిధి** కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల పిల్లలకు కూడా అత్యాధునిక సాంకేతిక అవకాశాలు దక్కాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు . టీఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫార్మ్స్ సంస్థల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నెల రోజుల ఏఐ శిక్షణా కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ శిక్షణా కార్యక్రమం 2026 జూన్ 15 నుండి జూలై 11 వరకు నెల రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో రాణించడానికి ఏఐ అక్షరాస్యత ఎంతో కీలకమని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భారతదేశ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో వారిని భాగస్వాములను చేస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,

**పైలెట్ ప్రాజెక్టు గా సూర్యాపేట**

ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని వందలాది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయితే, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను విస్తరించడానికి ఇదొక రోల్ మోడల్‌గా నిలుస్తుందని విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గఫ్ఫార్, మరియు టీఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫార్మ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ధర్మపురిలో డాగ్ స్క్వాడ్‌తో గంజాయి తనిఖీలు

**పట్టణంలో కాలేజీలు, బస్టాండ్ పరిసరాల్లో ముమ్మర చెకింగ్**

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి ఎస్సై మహేష్**



**ధర్మపురి,జూన్ 10(ఉదయం ప్రతినిధి):**

మండల కేంద్రంలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి,ఇతర నిషేధిత మాదక ద్రవ్యా ల నిర్మూలనకై విస్తృత తనిఖీలు చేపట్టారు.సీఐ రాం నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు ఎస్సై మహేష్ తమ సిబ్బందితో కలిసి ట్రె యిన్డ్ డాగ్ స్క్వాడ్ సహాయంతో సోదా లు నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటైన యాంటీ డ్రగ్,నార్కో టిక్ టీమ్ ప్రతి మండలంలో నిఘా పెంచిన నేపథ్యంలో ధర్మపురి పట్టణంలోని ప్రముఖ కాలేజీల పరిసరాలు, కిరాణా దుకాణాలు, టీ స్టాళ్లు, పాన్ షాపులు, బస్టాండ్ మరియు అనుమానాస్పద ప్రాం తాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు పట్టారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లా డుతూ యువతకు మాద కద్రవ్యాల మహమ్మారిపై ప్రత్యేక అవగాహన కల్పించారు.గంజాయి వంటి వ్యస నాలు యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు.ఇవి ఆరోగ్యం తో పాటు కుటుంబ,సామాజిక జీవి తాలపై తీవ్ర ప్రభావం చూపుతా యని ఆవేదన వ్యక్తం చేశారు.యువత ఇలాం టి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉం డాలని పిలు పునిచ్చారు.మండలంలో ఎక్కడై నా గంజాయి విక్రయాలు సాగి నా, ఎవరైనా వినియోగిస్తున్నట్లు తెలి సినా వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివ రాలు రహస్యంగా ఉంచుతామ న్నారు.మండలంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఉందని,గంజాయి రవాణా, విక్ర యాలకు పాల్పడే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుం టామని పోలీసులు హెచ్చరించారు.

## ఎస్ఐఆర్ ఓటర్ల మ్యాపింగ్‌ను విజయవంతం చేయాలి– జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఉదయం :**



ఎస్ఐఆర్–2002 ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో జిల్లా ప్రజలందరూ భాగస్వా ములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. తాను కూడా తన ఓటును ఎస్ఐఆర్–2002 ఎలక్టోరల్ రోల్‌కు విజయవం తంగా మ్యాపింగ్ చేసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2002లో నిర్వహించిన ప్రత్యేక సర్వే (ఎస్ఐఆర్) సమయంలో తనకు ఓటు హక్కు లేకపోవడంతో, అప్పట్లో బీహార్‌లో నమోదైన తన తండ్రి ఓటరు వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోని 'సెర్చ్ బై ఎలెక్టర్ నేమ్' సదుపాయం ద్వారా కేవలం ఐదు ప్రాథమిక వివరాలు నమోదు చేసి సులభంగా గుర్తించానన్నారు. అనంతరం బీఎల్ఓ యాప్ ద్వారా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు.ఈ ప్రక్రియ చాలా సులభ మని, తెలంగాణలో పాత ఓటరు నమోదు ఉన్నవారు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా కూడా ఎస్ఐఆర్–2002 వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణం, మావల ప్రాంతాల ఓటర్లు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఓటర్ల మ్యాపింగ్‌కు ఈ నెల 24 వరకు గడువు ఉందని, అనంతరం జూన్ 25 నుంచి బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసే ప్రక్రియ చేపడతారని తెలిపారు. గడువు లోపు అర్హులైన ప్రతి ఓటరు తన వివరా లను మ్యాపింగ్ చేసుకొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : జిల్లా ఎస్పీ నితికా పంత్




**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**

'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐ.పి.ఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మె ట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహ నాల్లో సీటు బెల్టులు వినియోగించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం దేశవ్యా ప్తంగా లక్షలాది రోడ్డు ప్రమాదాలు జరు గుతున్నాయని, వీటిలో యువత అధి కంగా ప్రాణాలు కోల్పోవడం బాధాకర మని అన్నారు.ట్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ సైడ్‌లో వాహనం నడపడం వంటి నిర్లక్ష్య చర్యల వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొ న్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయు తంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నియమా లను పాటిస్తే ప్రమాదాలను గణనీయం గా తగ్గించవచ్చని అన్నారు.అనంతరం జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదా లకు సంబంధించిన దృశ్యాలను విద్యా ర్థులకు స్క్రీన్‌పై ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో అధికారులు, విద్యార్థులందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రియదర్శిని, ఆసిఫాబాద్ ఇన్‌స్పె క్టర్ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, మెడికల్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రహిత సమాజం కోసమే ఈగల్ బృందం....-ఆర్కేపి ఎస్సై జె శ్రీధర్

**మంచిర్యాల/రామకృష్ణాపూర్జూన్10(ఉదయం ప్రతినిధి)**



గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట నిఘా, కఠిన ,చట్టపర మైన చర్యలను వేగవంతం చేసిందని, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేకంగా 'ఈగల్' వంటి వింగ్స్‌ను ఏర్పాటు చేశాయని అందు లో భాగంగానే రామకృష్ణాపూర్ పట్ట ణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు రామకృష్ణా పూర్ పట్టణ ఎస్సై జె శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై జె శ్రీధర్ మాట్లాడుతూ..రామగుండం సిపి, మంచిర్యాల డిసిపి, బెల్లంపల్లి ఏసిపి ల ఆదేశాల మేరకు రామకృష్ణాపూర్ పట్టణంలో ముందస్తు సమాచారం ఆధారంగా అనుమానితుల ఇళ్లలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

## మన ఇంటి నుండే మార్పు రావాలి...

**చెత్త సేకరణతో పరిశుభ్రమైన పట్టణంగా మారుద్దాం...**

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

**వ్యాదుల నివారణకు పరిశుభ్రతే ప్రధాన ఆయుధం...జిల్లా కలెక్టర్**



**జగిత్యాల జూన్ 10 (ఉదయం ప్రతినిధి)**

జగిత్యాలలో ప్రజాపాలన వార్డు సభలలో పాల్గొని లబ్ధిదారులకు ప్రభు త్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి జగిత్యాల పట్టణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగం గా బుధవారం నిర్వహించిన వార్డు సభలు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్య క్రమాలు పట్టణంలోని పలు వార్డులలో ఏర్పాటు చేసిన వార్డు సభలో పాల్గొ న్నారు. ఈ కార్యక్రమాల్లో జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ముఖ్యఅతిథు లుగా హాజరై లబ్ధిదారులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేం దుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవ సరమని తెలిపారు ప్రతి ఇంటి నుంచి వచ్చే తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందిం చాలని దీంతో చెత్త నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందన్నారు. అలాగే మెడికల్ వ్యర్థాలు ప్రమాదకర వ్యర్థాలను సాధారణ చెత్తతో కలప కుండా ప్రత్యేకంగా నిర్వహించడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. కాలువలు డ్రైనేజీలను పరి శుభ్రంగా ఉంచడం ద్వారా వర్షాకా లంలో నీటి నిల్వలు దోమల వ్యాప్తి వంటి సమస్యలను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచడంలో బాధ్యతగా వ్యవహ రించాలని కోరారు అదే విధంగా ఓటు హక్కు ఉన్న వారందరూ సర్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచిం చారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ సము దాయాల వద్ద ప్రైమరీ స్కూల్ హెల్త్ సెంటర్ మొదలైనవి ప్రారంభించుకో వడం జరిగిందని జగి త్యాల పట్టణాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా ఆదర్శ పట్ట ణంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు పర్యావరణ వ్యవస్థను వృక్ష జంతుజాలాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ కాలుష్య వ్యర్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మన నిర్ల క్ష్యం వల్ల తాగే నీరు పీల్చే గాలి తినే తిండి కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ పరిస్థితిని మార్చడానికి ప్రతి ఇల్లూ ఒక పునాదిగా మారాలని కోరారు. ఇళ్ల నుండి వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయ కుండా తడి చెత్త పొడి చెత్త శానిటరీ వ్యర్థాలు హానికర మైన కెమికల్ వ్యర్థాలు గా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సి పల్ వాహ నాలకు అందించాలని స్పష్టం చేశారు వంటగది వ్యర్థాలైన తడి చెత్త ద్వారా మేలైన ఎరువుల తయారీ జరుగుతుం దని ప్లాస్టిక్ పేపర్ల వంటి పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపవచ్చని వివరించారు. చిన్నపిల్లల డైపర్లు ప్యాడ్ల వంటి శానిటరీ వ్యర్థాలను అలాగే బ్యాటరీలు కెమికల్ బాటిళ్ల వంటి ప్రమాదకర వ్యర్థాలను విడిగా ఇవ్వడం ద్వారా పారిశుద్ధ్య కార్మి కులకు ఎంతో మేలు జరుగుతుంద న్నారు. పట్టణంలోని వార్డులలో ఈ సరికొత్త 4 డబ్బాల చెత్త సేకరణ విధా నాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయ బోతున్నట్లు ప్రకటించారు మనం కలిపి ఇచ్చే చెత్త వలన డబుల్ బెడ్ రూమ్ సముదాయాల వాసులకు ఇబ్బందులు ఏర్పడుతాయని ప్రజలు సహకరించా లని కోరారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నా మని తెలిపారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ వర్షాకా లంలో వ్యాధుల నివారణకు పరిశుభ్రతే ప్రధాన ఆయుధమన్నారు తడి చెత్త పొడి చెత్తను విడదీసి ఇవ్వడం వల్ల చెత్త శాస్త్రీయ నిర్వహణకు అవకాశం కలుగు తుందని ప్రజలు ఈ విధానాన్ని తప్పనిస రిగా పాటించాలని సూచించారు ఇంటి పరిసరాలు ఖాళీ స్థలాలు కాలువలు పరి శుభ్రంగా ఉంచడం ద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించ వచ్చన్నారు వాడిన సూదులు మందుల సీసాలు వైద్య సంబంధిత వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా పారవేయాలని ప్రజారోగ్య పరిరక్షణలో ఇది ఎంతో ముఖ్యమని తెలిపారు పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని మున్సి పాలిటీ చేపట్టే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు అలాగే ఓటు హక్కు ఉన్న వారందరూ సర్ లో తమ పేర్లను నమోదు చేసుకోవా లని తెలిపారు 18 ఏళ్లు నిండిన అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలను అందజేస్తున్నామని వార్డు సభలలో ప్రజల నుంచి వచ్చిన వినతులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలి: కలెక్టర్

**కరీంనగర్, జూన్ 10 (ఉదయం ప్రతినిధి):**




రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రైతుల సమ స్యలను తెలుసుకోవడానికి అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించా లని సూచించారు. రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను గుర్తించి, వాటి పరి ష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మండలాల వారీగా సాగు భూముల విస్తీర్ణం, సాగ వుతున్న పంటలు, ఆయిల్ పామ్, వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, పూలు, పండ్ల తోటల వివరాలు, భూముల స్వరూపం, వర్షపాతం పరిస్థి తులు, రైతు వేదికల ద్వారా అందుతున్న సేవలు, రైతులకు అనుకూల, ప్రతికూల అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశిం చారు. ఈ ప్రక్రియలో మండల వ్యవసాయ అధికారులను నోడల్ అధి కారులుగా నియమిస్తూ సమన్వయ బాధ్యతలు అప్పగించారు.జిల్లాలో వ్యవ సాయాభివృద్ధికి సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావా లని, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అంది స్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు విధానాలపై అవగాహన పెంపొందించేందుకు త్వరలో వ్యవసాయ విస్తరణ అధికారు లకు (ఏఈఓలు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ని ఆదే శించారు.జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు పంటల మార్పిడి విధానం, ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.ఈ సమీక్ష సమావేశంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, డివిజన్ మరియు మండల వ్యవసాయ అధికారులు, ఉద్యా నవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లోనే డెలివరీ తల్లి బిడ్డ క్షేమం

**సమయస్ఫూర్తి చాటిన 108 సిబ్బంది**

**ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**

**ధర్మపురి,జూన్ 10(ఉదయం ప్రతినిధి):**



తీవ్ర ప్రసవ వేదనతో బాధపడు తున్న ఓ గర్భిణికి 108 సిబ్బంది అంబులెన్స్ లోనే సురక్షితంగా ప్రసవం చేశారు. ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన పిట్టల శ్రీలతకు బుధవారం తెల్ల వారుజా మున పురిటి నొప్పులు వచ్చా యి.దీంతో కుటుంబ సభ్యులు తక్షణమే 108అంబులెన్స్‌కు సమాచారం అందిం చారు. బాధితురాలిని ఆసుపత్రికి తరలి స్తుండగా, ధమ్మన్నపేట సమీపంలోకి రాగానే శ్రీలతకు నొప్పులు మరింత ఎక్కువయ్యాయి.పరిస్థితి తీవ్రతను గమ నించిన ఈఎంటీ అనిల్, పైలట్ సంపత్ సమయ స్ఫూర్తితో వ్యవహరించారు. వాహ నాన్ని పక్కకు నిలిపి,అంబులెన్స్ లోనే ప్రసవం జరిపారు.శ్రీలత ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అ నంతరం తల్లి, నవజాత శిశువును మెరుగైన వైద్యం కోసం ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సకాలంలో స్పందించి ఇద్దరి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా. నాగేంద్ర, జగిత్యాల జిల్లా మేనేజర్ ఐలయ్యల, శ్రీలత కుటుంబ సభ్యు లు ప్రత్యేకంగా అభినందించారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**పెద్దపల్లి, జూన్ 10 (ఉదయం కరస్పాండెంట్ ):**

రామగిరి మండలం సింగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కామ అభిరామ్ పటేల్ ఇటీవల మృతి చెందగా, బుధ వారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారి నివాసానికి వెళ్లి కుటుం బ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడు కామ అభిరామ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అభిరామ్ పటేల్ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కష్టకా లంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించిన పుట్ట మధూకర్, పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు



**మంథని, జూన్ 10: (ఉదయం ప్రతినిధి)**

మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో బుధవారం నిర్వహించిన విలే కరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శీను బాబుపై చేసిన విమర్శలు అనుచితమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యుడు శశిభూ షణ్ కాచే, సర్పంచ్ ఆర్ల నాగరాజు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అజీమ్ ఖాన్ తదితరులు మాట్లాడుతూ పుట్ట మధూకర్ రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నా రని విమర్శించారు.పూదరి సత్యనారా యణ గౌడ్‌ను పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకెళ్లిన ఘటనకు మంత్రి శ్రీధర్ బాబు, శీను బాబులకు ఎలాంటి సంబంధం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటుందని చేతిలో రాజ్యాంగం పట్టుకొని నోటితో బూతులు తిట్టడం ఏమిటని అన్నారు. పోలీసుల విధుల నిర్వహణపై అనవసర విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు రాజ్యాంగబద్ధంగా బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్రం, మంథని నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తు న్నారని తెలిపారు. శీను బాబు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు.భవిష్యత్తులో కాంగ్రెస్ నాయకులపై వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ

**కాగజ్ నగర్ ( ఉదయం ప్రతినిధి)**



జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు కాగజ్నగర్ మండ లంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నోటు బుక్స్ మరియు టెక్స్ట్ బుక్స్ ఈ రోజు నుంచి పంపిణీ ప్రారంభించినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలి పారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే లోపు అన్ని పాఠశాలలో ప్రధానోపాధ్యా యులు మండల విద్యా వనరుల కేంద్రం నుండి తీసుకెళ్లాలని సూచించారు.

## రానున్న వర్షాకాలం దృష్ట్యా పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**




**పెద్దపల్లి జూన్ 10 (ఉదయం ప్రతినిధి)**

ఈరోజు పెద్దపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు కౌన్సిలర్లు మరియు మున్సిపల్ అధికా రులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే చింతకుంట విజయ రమ ణారావు గారు సమీక్ష సమావేశం నిర్వ హించారు ఈసమావేశంలో మంచినీటి సరఫరా, ఎలక్ట్రికల్ మరియు శానిటేషన్ సిబ్బందితో వార్డులోని సమస్యలపై ముఖముఖి చర్చించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా పట్టణ ప్రజలు అప్ర మత్తంగా ఉంటూ మీ ఇంటి చుట్టూ పరి సరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు అదేవిధంగా ప్రతి వార్డులో వార్డ్ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారు లతో సమన్వయం చేసుకుంటూ వీధిదీ పాలు, త్రాగునీరు, శానిటేషన్ సక్రమంగా జరిగేలా చూడాలని ప్రతి కౌన్సిలర్ నెల రోజుల పాటు మీయొక్క వార్డులో ఉదయం జరిగే మున్సిపల్ పనులను పరిశీలించాలని చైర్మన్ నూగిల్ల మల్లన్న కూడ ప్రత్యేక శ్రద్ధ వహించాలని అవసరమైతే నేను కూడ పాల్గొంటానని అప్పుడే మన పైన ప్రజలకు విశ్వాసం కలుగుతుందని అన్నారు అదే విధంగా వార్డ్ కౌన్సిలర్ ఏదైనా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లయితే అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిం చాలని అన్నారు అలాగే వార్డులో డార్క్ స్పాట్ ఉన్న చోట వీధి దీపాలు అమర్చా లని అధికారులను కోరారు ఈసంద ర్భంగా వార్డు కౌన్సిలర్లు వార్డులో అమృత్. 2 ద్వార నూతనంగా నల్ల కనెక్షన్లు ఇవ్వడం లేదని అమృత్.2 పనులు నత్త నడకన సాగుతున్నాయని ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగా అమృత్.2 అధికారులను తీవ్రంగా మందలించి రెండు మూడు రోజుల్లో వార్డులో పనులు పూర్తి చేసి ఇంటిఇం టికి నల్ల నీరు అందించాలని అన్నారు ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వైస్ చైర్ పర్సన్ ముస్కాన్ నాజ్ అలీ,కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు,వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## వెదురు ఉత్పత్తులతో జీవనోపాధి పొందాలి

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో పాల్గొని మొక్కలు నాటిన ఎమ్మెల్యే**



**జన్నారం, జూన్ 10(ఉదయం విలేఖరి)**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి నిర్మల్ డీసీసీ అధ్యక్షులు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజర య్యారు.కార్యక్రమంలో భాగంగా వెదురు బొంగులతో తయారు చేసిన పలు వస్తువులను పరిశీలించిన ఎమ్మెల్యే, వాటిని తయారు చేసిన కళా కారులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కావ్వాల్ వెదురు ఉత్పత్తులు మరియు శిక్షణ కేంద్రాన్ని నిరుద్యోగ యువకులు ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లకు, ప్రభుత్వ భవనాలకు ఇసుక అందుబాటులో ఉండేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు.అనంతరం ఇందన్‌పెల్లి రేంజ్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు."చెట్లను కాపాడితేనే అవి మనల్ని కాపాడతాయి" అని చెప్పారు."వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదంతో ప్రతి గ్రామ సర్పంచ్ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శంకర్, మంచిర్యాల డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఎఫ్డిఓ రామ్మోహన్, ఇందనపల్లి ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ,డిఆర్ఓ, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామసభలో హెల్మెట్‌లను అందించిన జిల్లా కలెక్టర్, అడిషనల్ ఎస్పీ



**కామారెడ్డి, జూన్ 10 (ఉదయం ప్రతినిధి):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం భిక్కనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు.ఈ సందర్భం గా గ్రామస్థుల సమస్యలు, అభివృద్ధి అవ సరాలు, సంక్షేమ పథకాల అమలు తీరును గ్రామస్థులతో కలిసి సమీక్షిం చారు. గ్రామ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికా రులు వాటిపై తక్షణ చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో నాలుగు దఫాలుగా నిర్వహి స్తున్న ప్రత్యేక గ్రామసభల ద్వారా గ్రామా భివృద్ధికి సంబంధించిన పలు కార్యక్ర మాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న పూరిగుడిసెలను గుర్తిం చి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో 10 పూరి గుడి సెలను గుర్తించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, 18 సంవ త్సరాలు నిండిన అర్హులైన వారిని ఓటరు జాబితాలో నమోదు చేయడం, డబుల్ ఓటర్ల పేర్లను తొలగించడం జరుగుతోం దని పేర్కొన్నారు. జన సంరక్షణ – మన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా లో 36 వేల కందకాలను తవ్వడం జరి గిందని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరి ష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అదేవిధంగా, రైతులకు ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగా హన కల్పించి, పంట విస్తీర్ణాన్ని పెంచేం దుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షే మ కార్యక్రమాలను ప్రతి అర్హులైన లబ్ధి దారులకు చేరేలా అధికారులు సమన్వ యంతో పని చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలకు వేగ వంతమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు."అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించి, రహదారి భద్రతపై అవగా హన కల్పించారు.

ఈ సందర్భంగా ద్విచక్రవాహనదారు లకు హెల్మెట్లను పంపిణీ చేసి, ప్రతి ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ధరిం చాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణా లను కాపాడుకోవచ్చని తెలిపారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## బడిబాటలో 'ధరూర్' అక్షర శంఖారావం!




**-ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో కదంతొక్కిన పిఎంఎస్హెచ్ఆర్ఐ జడ్.పి.హెచ్.ఎస్ ఉపాధ్యాయులు**
**- ఇంటింటికీ తిరిగి విద్యా చైతన్యం..**
**- సోమవారం నుంచి బడికి పంపాలని హెచ్ఎం నరేష్ పిలుపు**

**ధరూర్ జూన్ 10 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' స్ఫూర్తితో ధరూర్ మండల కేంద్రంలో అక్షర శంఖారావం పూరించారు. స్థానిక పిఎంఎస్ హెచ్ఆర్ఐ జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం బుధవారం మండల కేంద్రంలో 'బడిబాట' కార్యక్రమాన్ని ఉధృతంగా నిర్వహించింది. విద్యా దీప్తిని ఇంటింటికీ చేర్చే లక్ష్యంతో సాగిన ఈ ప్రచార పర్వం స్థానికుల్లో భారీ విద్యా చైతన్యాన్ని రగిల్చింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్ఎం నరేష్ నాయకత్వంలో ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రతి గడపనూ తట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న కార్పొరేట్ స్థాయి వసతులు, డిజిటల్ బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవలను తల్లిదండ్రులకు వివరించారు. రాబోయే సోమవారం నుంచి నూతన విద్యా సంవత్సరం తరగతులు పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్న నేపథ్యంలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరినీ ఒక్క రోజు కూడా విరామం లేకుండా క్రమం తప్పకుండా బడికి పంపాలని ఉపాధ్యాయులు కోరారు.

అక్షరమే ఆయుధం.. హాజరే ప్రధానం: హెచ్ఎం నరేష్ ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నరేష్ మాట్లాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నిరంతర పాఠశాల హాజరే పునాది అని స్పష్టం చేశారు. "ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి పెద్దపీట వేస్తున్నాం. సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్న శుభతరుణంలో, తల్లిదండ్రులు తమ పిల్లలను ఎలాంటి అలసత్వం లేకుండా సకాలంలో పాఠశాలకు పంపి విద్యా యజ్ఞంలో భాగస్వాములు కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

మండల కేంద్రంలో విద్యా ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేస్తూ సాగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

## బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి సహకరించాలి



**- అదనపు కలెక్టర్ మధుమోహన్**

**గద్వాల జూన్ 10 (వుదయం కరస్పాండెంట్ )**

ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. బుధవారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించినందున రాజకీయ పార్టీల నేతలు తమ వంతుగా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. మృతి చెందిన ఓటర్లను, బోగస్ ఓటర్లను జాబితా నుంచి తొలగించడమే కాక అర్హులైన ఓటర్లందరూ ఎలక్ట్రోరోల్ ఓటరు జాబితాలో ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడం జరుగుతోందన్నారు. ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు తమ వంతుగా సహకారం అందించాలన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి జూలై 24 వరకు బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్ పెండింగ్ పరిహార ప్యాకేజీ చెల్లింపులను పూర్తి చేయాలి



**- కమిషనర్ శివకుమార్ నాయుడు**

**మహబూబ్ నగర్ జూన్10 (వుదయం ప్రతినిధి)**

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలన్నింటినీ పరిష్కరించి, రాబోయే 2 నెలల్లోగా పెండింగ్ పరిహార ప్యాకేజీ చెల్లింపులన్నింటినీ పూర్తి చేయాలని భూ సేకరణ పునరావాసం, పునర్నిర్మాణం కమిషనర్ కె .శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉదండాపూర్, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, రాజీవ్ భీమా ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ పనులపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఇరిగేషన్, ల్యాండ్ సర్వే, విద్యుత్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్షా సమావేశంలో ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రగతి, ప్రతిపాదిత లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ అనుసంధాన టన్నెల్ భూసేకరణపై కమిషనర్ ఆరా తీశారు. ఈ ప్రాజెక్టు వల్ల ఉదండాపూర్, వల్లూర్ గ్రామాలతో పాటు రేగడిపట్టి, చిన్నగుట్ట, తుమ్మలకుంట, శ్యామగడ్డ, ఒంటిగుడిసె, పోలేపల్లి అనే 6 తండాలు ముంపునకు గురవుతున్నట్లు రెవెన్యూ అధికారులు నివేదించారు., 1,890 మంది నిర్వాసితుల ఖాతాల్లో నిధులు జమ చేశామని, మిగిలిన అర్హులైన వారికి అవార్డ్ పాస్ చేసి త్వరలో పరిహారం అందచేస్తామని ఆర్ &ఆర్ అడ్మినిస్ట్రేటివ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తెలిపారు. ఉదండపూర్ ముంపు బాధితుల కోసం కేటాయించిన 280 ఎకరాల పునరావాస లేఅవుట్ పనులు పురోగతి లో ఉన్నాయని తెలిపారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ పనులన్నీ త్వరగా పూర్తి చేసి బాధితులకు ప్లాట్లు అప్పగించాలని సూచించారు. ఎక్కడైతే పునరావాస కేంద్రం సరిహద్దు వివాదాలు ఉన్నచో వాటి పరిష్కారానికి జడ్చర్ల తహసిల్దార్, ల్యాండ్ సర్వే ఏడీ క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని ఆదేశించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల కోసం ప్రభుత్వం వారం రోజుల్లో రూ. 3 కోట్లు విడుదల చేయనుందని, విద్యుత్ స్తంభాల ఏర్పాటును వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే మిషన్ భగీరథ పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఆర్అండ్‌బీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, పునరావాస కేంద్రంలో గుడుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు భూ సేకరణ పై సమీక్ష కోయిల్‌సాగర్ ప్రాజెక్టు సంబంధించి భూ సేకరణ సమస్యల గురించి కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని డెప్యూటీ కలెక్టర్ రాంరెడ్డిని కమిషనర్ ఆదేశించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం భూసేకరణకు సంబంధించి అవసరమైన 105 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 90.5 ఎకరాలు సేకరించగా, మిగిలిన 13.5 ఎకరాల భూమినీ ఇంకా సేకరించాల్సిన అవసరం ఉందన్నారు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. రాజీవ్ భీమా ప్రాజెక్టు సంబంధించి కేవలం ఒక ఎకరం లోపు భూమి మాత్రమే సేకరించాల్సి ఉందని, ఎలాంటి పెండింగ్ సమస్యలు లేవని అధికారులు తెలిపారు. పిఆర్ఆర్ఎల్ఐ ప్రాజెక్ట్ కింద భూసేకరణకు సంబంధించిన కోర్టు కేసులను భూసేకరణ చట్టం ప్రకారం త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా లో అన్ని సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని చూస్తున్నందున నిర్వాసితులందరికీ త్వరగా పునరావాసం కల్పించి, అన్ని ప్రాజెక్టుల భూసేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులకు కలెక్టర్ కుష్బూ గుప్తా ,జె.ఎల్.బి హరిప్రియ, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, ఆర్.డి.ఓ నవీన్, భూ సర్వే రికార్డుల శాఖ ఎ.డి అశోక్, పంచాయతీ రాజ్ ఈ.ఈ శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్, మిషన్ భగీరథ, జడ్చర్ల తహసీల్దార్, ఇతర సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శిక్షణ కేంద్రంలో ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ



**- ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి**

**వెల్దండ జూన్ 10 (వు దయం )**

మండల మరియు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం.

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో. నిర్వహిస్తున్న సుంకిరెడ్డి ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి చేతుల మీదుగా అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా సుంకిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే కేవలం కోరిక ఉంటే సరిపోదని, దానికి అనుగుణంగా కష్టపడే తత్వం, స్పష్టమైన లక్ష్యం, నిరంతర సాధన అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశాలు, శిక్షణ అందుబాటులో లేక వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి యువతకు తోడ్పాటుగా నిలవాలనే ఆలోచనతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారు ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన కోచింగ్‌తో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. జీవితంలో ఒక్క అవకాశం మీ భవిష్యత్తును మార్చగలదు, మీ ముందున్న ఈ అవకాశాన్ని వృథా చేసుకోకుండా, ప్రతిరోజూ ఒక అడుగు ముందుకు వేస్తూ లక్ష్య సాధన కోసం శ్రమించండి, కష్టానికి ప్రత్యామ్నాయం లేదు. ఈరోజు మీరు పడే శ్రమే రేపు మీ విజయానికి కారణమవుతుంది అని అభ్యర్థులకు సూచించారు.

తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చడంతో పాటు సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కోరారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయక□

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



**- నారాయణపేట డీఎస్పీ లింగయ్య**

**నారాయణపేట జూన్10 (వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈగల్ ఫోర్స్ టీం, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అటవీ శాఖ వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త అధికారులు, విద్యార్థులు కలిసి నారాయణపేట జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటే ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డ్రగ్స్,మత్తు పదార్థాల బారిన పడి అనంతరం డిఅడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స పొంది సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చిన సుమారు 20 మంది యువకులతో కలిసి అధికారులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణతో పాటు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎన్ఫోర్స్మెంట్ అవగాహనతో డ్రగ్స్ ను నియంత్రించడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని తెలిపారు. డిఅడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స పొంది తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చిన యువకులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, వారి అనుభవాలను ఇతరులతో పంచుకుని డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందించినట్లు తెలిపారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, ఉపాధి, క్రీడలు,సమాజ సేవ వంటి సానుకూల కార్యక్రమాల వైపు మళ్లించాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా, ఎవరైనా మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగంలో పాల్గొంటున్నట్లు గమనించినా వెంటనే టోల్ ఫ్రీ 1908 లేదా డయల్ 100 కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ లు రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఆర్ఐ విజయ్ భాస్కర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. సంపద కుమార్ సింగ్, డాక్టర్ కిరణ్ ప్రకాష్, ఆర్ఎంఓ రాఘవేందర్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, నరేష్, ఆంజనేయులు, శివ శంకర్, శిరీష, ఈగల్ ఫోర్స్ టీం, అటవీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, డిఅడిక్షన్ సెంటర్ ప్రతినిధులు, విద్యార్థులు ఇతరులు పాల్గొన్నారు.

## నీటి పొదుపు... ప్రత్యామ్నాయ సాగు!



**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,**

**నాగర్ కర్నూల్ జూన్ 10 (వుదయం బ్యూరో)**

జిల్లాలోని తిమ్మాజీపేట మండలం బావాజీపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, వ్యవసాయ రంగ పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ వరి సాగుపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా జొన్న, రాగి వంటి చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్ల తోటలు మరియు ఇతర లాభదాయక పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు.

ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చు అని భారత వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో నీటి వనరులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రైతులను కోరారు. చిరుధాన్యాల వినియోగం దేశవ్యాప్తంగా పెరుగుతున్నందున వాటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగు చేపడితే ఆర్థికంగా మరింత లాభపడగలరని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు, సలహాలను పాటించాలని సూచించారు.

ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యానవనం, చేపల పెంపకం వంటి రంగాలపై కూడా రైతులు దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయ వృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కొనసాగనున్న ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అర్హులైన ఓటర్లు ఉండేలా, అనర్హులైన ఓటర్లను తొలగించే కార్యక్రమం చేపడుతుందని గ్రామంలోని ప్రతి ఒక్కరు సర్ కార్యక్రమం పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. అనంతరం గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించకుండా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి, మండల అధికారులు, గ్రామపంచాయతీ సభ్యులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు డిఏపి సరఫరా చేయాలని అధికారికి బికేస్ వినతి



**నారాయణపేట టౌన్ జూన్10 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా లో డీఏపీ కొరత ఉందని ఉన్నతాధికారులు వెంటనే రైతులకు డిఏపిని సరఫరా చేయాలని నారాయణపేట భారతీయ కిసాన్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారికి వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు.

ఫర్టిలైజర్ దుకాణాల డీఏపీ కొరత వల్ల వ్యవసాయదారులకు ప్రస్తుతం విత్తనము భూమిలో పూడిచే సమయంలో తొలి కాలంలోనే ఈ విధంగా ఉంటే ముందు ముందు రైతు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడుతుంది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫర్టిలైజర్ వ్యాపారస్తులందరూ కుమ్మక్కై జిల్లాలో డీఏపీ కొరతను సృష్టిస్తున్నారని ప్రభుత్వం ఎన్నో మార్లు అన్ని దుకాణాల్లో డి ఏ పి ఎరువులు రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పిన ప్రస్తుతం నారాయణపేట పట్టణ షాపులలో ఏ ఒక్క ఎరువుల షాపులో స్టాకు లేదని దీనిని అధికారులు గమనించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. విషయాన్ని జిల్లా వ్యవసాయ అధికారికి సఖియా నాయక్ కి భారతీయ కిసాన్ సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.

వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి ,జిల్లా సహకార దర్శి ప్రభు మిస్కిన్, జిల్లా సహకార దర్శి మైపాల్ రెడ్డి , పట్టణ అధ్యక్షుడు ఆకుల వెంకటప్ప, ఉపాధ్యక్షుడు గొడుగు లక్ష్మీనారాయణ, పగిడిమారి మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి లతోపాటు రైతులు పాల్గొన్నారు.

## గద్వాలలో పట్టపగలే బరితెగించిన కేతగాళ్లు:



**- తాళం వేసిన ఇంట్లో నిలువుదోపిడీ.. 12 తులాల బంగారం అపహరణ!**

**గద్వాల జూన్ 10 (వుదయం బ్యూరో)**

జిల్లా కేంద్రంలో దొంగలు పగటిపూటే రెచ్చిపోయారు. జనం రద్దీగా ఉండే ప్రాంతంలోనే తాళం వేసిన ఇల్లే లక్ష్యంగా చేసుకుని కన్నమేశారు. భీంనగర్ కాలనీలో బుధవారం పట్టపగలు జరిగిన ఈ భారీ చోరీ స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం...భీంనగర్‌కు చెందిన రహ్మత్ అనే వ్యక్తి బుధవారం ఉదయం యథావిధిగా తన ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. ఇల్లాలు కూడా ఇంట్లో లేకపోవడాన్ని, తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగారు. చుట్టుపక్కల వారి కళ్లుగప్పి, ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బెడ్‌రూమ్‌లోని బీరువా లాకర్లను ధ్వంసం చేసి, అందులో దాచి ఉంచిన సుమారు 10 నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను గుట్టుచప్పుడు కాకుండా ఊడ్చేశారు. సాయంత్రం వచ్చి చూసేసరికి గుండె గుభేల్..సాయంత్రం ఆఫీస్ ముగించుకుని ఇంటికి వచ్చిన రహ్మత్.. గేటు తాళాలు, తలుపులు విరగ్గొట్టి తెరిచి ఉండటం చూసి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. లోపలికి వెళ్లి చూడగా అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. బీరువాలోని బట్టలన్నీ కిందపడేసి, బంగారం మొత్తం మాయమవ్వడంతో బాధితుడు వెంటనే లబోదిబోమంటూ గద్వాల టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలానికి చేరిన సీఐ, ఎస్ఐ.. దొంగతనం సమాచారం అందుకున్న వెంటనే గద్వాల సీఐ టి.శ్రీను, ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పట్టపగలు చోరీకి పాల్పడిన పాత నేరస్థుల పనేనా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. జనావాసాల మధ్యే జరిగిన ఈ పగటి దొంగతనంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు

## దేశాభివృద్ధికి జనాభా గణన దోహదపడుతుంది



**- అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**గద్వాల జూన్ 10 (వుదయం కరస్పాండెంట్)**

జనాభా గణన దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, ఇందులో భాగంగానే ప్రస్తుతం ఇండ్ల గణన చేపట్టినట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బుధవారం మల్దకల్ మండలం నేతివానిపల్లె గ్రామంలో జరిగిన ప్రత్యేక గ్రామ సభకు అదనపు కలెక్టర్ హాజరై ప్రసంగించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా నాలుగు రకాల వ్యర్థల విభజన గురించి వివరించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల పథకాల గురించి రైతులకు కూలంకషంగా తెలియజేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల సహకారం అందిస్తుందన్నారు. వర్షకాలంలో మంచినీటి నిర్వహణ గురించి వివరించి, వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంతో ఉపాధి లేని వారికి పని దినాలు కల్పించి కూలీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంతో పెద్ద ఎత్తున ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యలతోపాటు ఇతర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపిన సమస్యలను పరిష్కరించడంలో తన శాయశక్తుల కృషి చేస్తానని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసభ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, సర్పంచ్ పద్మ, ఉప సర్పంచ్ మునినాయక్, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు, వివిధ శాఖల నుంచి అధికారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక గ్రామ సభ



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండలం నగరం గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణ 2026 పై ప్రత్యేక గ్రామ సభ సమావేశం నిర్వహించి నాలుగు రకాల చెత్త పై అనగా తడి చెత్త, పొడి చెత్త , హానికర చెత్త మరియు సానిటరీ చెత్త పై గ్రామస్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించడం జరిగింది అలాగే ఎస్ ఐ ఆర్, మాన్సూన్ ప్రిపేర్డ్నెస్, ఉపాధి హామీ, తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే జల సంరక్షణ మన సంరక్షణ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల, స్పెషల్ ఆఫీసర్ ముజాహిద్, టెక్నికల్ అసిస్టెంట్ రవితేజ, ఏఈఓ రమ్య, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, ఉప సర్పంచ్ నాజం, వార్డు మెంబెర్స్, స్కూల్ హెచ్ ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు వెంకటేష్, కల్పన ,గ్రామ స్థాయి అధికారులు మరియు అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

**- ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి**
**- ఏబీవీపీ వట్టిపల్లి మండల కన్వీనర్ సాయి కృష్ణ డిమాండ్ చేశారు**

**వట్టిపల్లి ఏప్రిల్10 (వుదయం ప్రతినిధి )**



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను వెంటనే మెరుగుపరచాలని, అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల అధికారికి వినతి పత్రం అందజేశారు. ఏబీవీపీ మండల కన్వీనర్ సాయి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ జూన్ 15 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే కల్పించాలని పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రపరచడంతో పాటు అవసరమైన చోట కొత్త సౌచాలయాల నిర్మాణం చేపట్టాలని, తరగతి గదుల్లో పూర్తి స్థాయిలో బల్లలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా పుస్తకాలు విక్రయిస్తూ, అధిక ఫీజులు వసూలు చేసి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చి విద్యను వ్యాపారంగా నిర్వహించడం దురదృష్టకరమని అనేక ప్రైవేట్ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు, ఆటస్థలాలు, పార్కింగ్ సదుపాయాలు లేకపోయినా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని, ఇటువంటి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం మరియు తల్లిదండ్రుల ప్రయోజనాల దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ మండల కన్వీనర్ సాయికృష్ణ ,మరియు సతీష్ ,నిఖిల్, సత్యనారాయణ.

## ఘనంగా కంటారెడ్డి తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలు



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల కేంద్రంలో బుధవారం బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంటారెడ్డి తిరుపతిరెడ్డి జన్మదిన సందర్భంగా స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయంలో మండల బిఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సుమారు 400 మంది కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కల్వకుంట సర్పంచ్ అందే కొండల్ రెడ్డి మాట్లాడుతూ నిజాంపేట మండల వాస్తవ్యుడు కల్వకుంట గ్రామస్తుడు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉత్సాహంతో ఆయన అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని మెదక్ నియోజకవర్గానికి మరెన్నో సేవలందించాలని ఆ రేణుక ఎల్లమ్మ తల్లిని వేడుకున్నామన్నారు. రానున్న రోజుల్లో సబండ వర్గాలకు న్యాయం జరగాలంటే తిరుపతి రెడ్డి లాంటి నాయకుడు ఎంతో అవసరం అన్నారు. మండల ప్రజల ఆశీస్సులతో మరెన్నో పదవులను అవరోధించాలని మండల ప్రజల పక్షాన మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాగరాజు, యూత్ అధ్యక్షులు మౌవురం రాజు, సర్పంచ్ కనకరాజు, సంగుస్వామి, లచ్చపేట రాములు గౌడ్, గోపరి నర్సింలు,లక్ష్మీ నర్సింలు, రెడ్డి శెట్టి రవీందర్,నగేష్,వినయ్, భరణి గౌడ్, రాజు నాయక్, నారా గౌడ్, వెంకటేష్, నరేందర్ నాయక్, సుభాష్ నాయక్, దుర్గయ్య, ఎల్లం యాదవ్, తిరుమల్, కృష్ణ గౌడ్, రాకేష్,తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన బీజేపీ కౌన్సిలర్లు




కామారెడ్డి, జూన్ 10 (వుదయం ప్రతినిధి):-కామారెడ్డి మున్సిపల్ పరిధిలో రాబోయే వర్షాకాలన్నీ దృష్టిలో పెట్టుకొని శానిటైజేషన్, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతాలు కి బీజేపీ కౌన్సిలర్ల బృందం వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్ లు మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణంలోని 49 వార్డులలో సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయని వర్షాకాలం సమీపిస్తున్నప్పటికీ దూర దృష్టిలో ఆలోచించి సమస్యలు రాకుండా నివారణ చర్యలు చేపట్టే స్థితిలో మున్సిపల్ యంత్రాంగం లేకపోవడం శోచనీయం అని అన్నారు. గత వర్షాకాల వరదల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ, కాలువల్లో ఉన్న మట్టి తీసివేసే పనులు ఇంతవరకు చేపట్టడం లేదని, డ్రైనేజీ వ్యవస్థ, శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని , అంటువ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలు ఇంతవరకు ప్రారంభించలేదని అన్నారు. ఇకనైనా మొద్దు నిద్ర మాని చర్యలు చేపట్టాలని అన్నారు.

# గోల్డ్ అప్రైజర్ రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన బీజేపీ శ్రేణులు

జన్నారం, జూన్ 10(వుదయం విలేకరి) రాష్ట్ర సహకార టీడీసీసీ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా జన్నారం నుండి ఎన్నికైన శ్రీరాముల గంగాధర్‌ను బీజేపీ శ్రేణులు సన్మానించారు. అఖిల భారత విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షులు కూడా అయిన శ్రీరాముల గంగాధర్ ఎన్నిక సందర్భంగా బుధవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు మధుసూదన్ రావు,



ఉపసర్పంచ్ అప్పాల జలపతి, మాజీ అధ్యక్షులు గోలి చందు, ఎస్టీ మోర్చా అధ్యక్షులు బద్రీనాయక్, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, బీజేపీ నాయకులు రాజారావు, ప్రహ్లాద్, సంతోష్, కనకయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## దేశ చరిత్రలో మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కొత్త దిశ నిర్దేశించింది - మంత్రి పొన్నం ప్రభాకర్



పెద్దపల్లి జూన్ 10 (వుదయం ప్రతినిధి) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 ఎ+టూ=ఎజ బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ.3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ.20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు, ఆస్తుల యజమానులు, ఆదాయ సృష్టికర్తలుగా మారుతున్నారని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలులో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు సుమారు రూ.10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారని పేర్కొన్నారు. మహిళలు ఆదా చేసుకున్న ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారని మంత్రి వివరించారు. మహిళల చేతిలో మిగిలే ప్రతి రూపాయి కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి దోహదపడుతుందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 61 బస్సులు కేటాయించబడినట్లు మంత్రి తెలిపారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు 16, రాజన్న సిరిసిల్ల జిల్లాకు 12, పెద్దపల్లి జిల్లాకు 15, జగిత్యాల జిల్లాకు 18 బస్సులు కేటాయించామని చెప్పారు. దీంతో ఆయా జిల్లాల్లో బస్సుల కొరత తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు మహిళా సంఘాలు స్థిరమైన ఆదాయ వనరును పొందనున్నాయని మంత్రి పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల నుంచి యజమానులుగా, భాగస్వాములుగా తీర్చిదిద్దడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం.

మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# సత్తుపల్లిలో నేడు విద్యుత్ అంతరాయం

సత్తుపల్లి జూన్ 10 (వుదయం ప్రతినిధి) సత్తుపల్లి 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోనీ సత్తుపల్లి టౌన్ 2 ఫీడర్ లో చెట్లు నరికే నిమిత్తం ద్వారకాపురి , గాంధీ నగర్ ఏరియా లో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి ఉ.10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సత్తుపల్లి టౌన్ ఏఈ శరత్ కోరారు.

# బొల్లారం గ్రామసభలో కీలక తీర్మానాలు

### విద్య, వ్యవసాయం, జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



నాగిరెడ్డిపేట్,వుదయం మండలంలోని బొల్లారం గ్రామంలో గ్రామ సర్పంచ్ బద్దిగారి ప్రభుగౌడ్ అధ్యక్షతన ప్రజాపాలన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి, విద్య, వ్యవసాయం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై పలు కీలక తీర్మానాలు చేశారు. గ్రామసభలో బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తీర్మానించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య, పారిశుద్ధ్య జాగ్రత్తలు, ఉపాధి హామీ పథకం నూతన మార్గదర్శకాలు, ఓటరు జాబితా సవరణ, విద్యుత్ భద్రత, రైతులకు వానాకాల సాగు సూచనలపై వివరించారు. అలాగే మొక్కజొన్న పంటకు ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని గ్రామసభలో తీర్మానం చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎల్లారెడ్డి డీఎల్‌పీఓ సురేందర్ మాట్లాడుతూ జల సంరక్షణలో భాగంగా ఇంకుడు గుంతలు, పర్కొలేషన్ ట్యాంకులు, ఫార్మ్ పాండ్లు నిర్మించి భూగర్భ జలాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి కోసం నల్లా బిల్లులు చెల్లించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అమలుపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బద్దిగారి ప్రభుగౌడ్, డీఎల్‌పీఓ సురేందర్, ఎంపీఓ ప్రభాకర్ చారి, గ్రామ కార్యదర్శి సంతోష్ కుమార్, జీపీఓ లక్ష్మణ్, ఏఈఓ రజిత, ఉపసర్పంచ్ గడ్డమీది స్వరూప, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మంథనిలో వార్డు సభలు నిర్వహణ

### ప్రజా సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ
### పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మంథని, జూన్ 10 (వుదయం ప్రతినిధి):మంథని మున్సిపాలిటీ పరిధిలోని 4వ, 5వ వార్డులకు సంబంధించిన వార్డు సభను బుధవారం కూచిరాజ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త, ప్రత్యేక జాగ్రత్త చెత్తలను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని అవగాహన కల్పించారు.



ఇంకుడు గుంతల నిర్మాణం, భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణం అందించేందుకు మొక్కల పెంపకం, తాగునీటి సంరక్షణ, రహదారులు మరియు వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. అనంతరం వార్డుల ప్రజల సమస్యలను తెలుసుకుని వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు మద్దికట్ల స్రవంతి, ముస్కుల సహేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు కుర్ర లింగయ్య, నూకల కమల్, తహసీల్దార్ అరిఫోద్దిన్, ఎంఎల్‌హెచ్‌పి నీలిమ, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అధిక ధరలను నియంత్రించడంలో బిజెపి మోడీ సర్కార్ విఫలం...

### ధరలను నియంత్రించకుంటే మరింత ఆందోళన ఉధృతం చేస్తాం...
### సిపిఐ జిల్లా కార్యదర్శ తాండ్ర సదానందం...

పెద్దపల్లి జూన్ 10 (వుదయం ప్రతినిధి) దేశంలో నిత్యవసర ధరల నియంత్రణలో బిజెపి మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, రాబోయే రోజుల్లో ధరల నియంత్రణ చేయకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కార్యాలయం ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఈ ధర్నా కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బీజేపీ పాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారిందనీ, వంటగ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు పప్పులు నూనెలు కూరగాయల వంటి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయనీ, అచ్చేదిన్ వస్తాయని చెప్పి సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు జేబులకు చిల్లులు పెడుతున్నారనీ, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తూ ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆదాయాలు పెరగడం లేదు కానీ ఖర్చులు మాత్రం రెట్టింపు అవుతున్నాయనీ, దేశంలో పేదరికం నిరుద్యోగం పెరుగుతుంటే కేంద్ర ప్రభుత్వ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందనీ, ధరల పెరుగుదలతో సామాన్యుడిని లూటీ చేస్తునా బిజెపి పాలన నశించాలనీ ,అడ్డు అదుపు లేని ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలే కారణమని అన్నారు. ధరల పెరుగుదలలో అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయనీ, ఇల్లు గడవడమే భారంగా



మారి భవిష్యత్ మరింత అంధకారం అవుతుందని అన్నారు 2014లో పెట్రోల్ ధర 72 రూపాయలు ఉంటే ఇటీవల ధరలు పెరిగి ప్రస్తుతం 111, డిజిల్ ధర చాలా తక్కువగా లీటర్కు 55 ఉండేది కానీ ఇప్పుడు 103 రూపాయలకు చేరుకుందనీ, 2014లో గ్యాస్ ధర 450 ఉంటే ఇప్పుడు 1120 కి , వాణిజ్య సిలిండర్ 1600 ఉంటే ప్రస్తుతం దాని రేటు ?3,367 రూపాయలు అయిందనీ, వంటనూనె అవసరాల కోసం ఎక్కువగా ఇతర దేశాలు మలేషియా ఇండోనేషియా వంటి దేశాల దిగమతులపై ఆధారపడుతున్నాం 2014లో కేజీ ఆయిలు 90 రూపాయల లోపు ఉన్న సన్ఫవర్ ఆయిల్ కోవిడ్ సమయంలో మరింత అంతర్జాతీయ సరఫరా సమస్యల వల్ల 200 కు వెళ్ళింది ప్రస్తుతం 2026 లో మార్కెట్ కాస్త స్థిరపడి బ్రాండ్ ను బట్టి 160 రూపాయలు మధ్య కొనసాగుతా ఉన్నాయనీ, తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ వాడే కందిపప్పు ధరల్లో గత పదేళ్లలో భారీ మార్పు వచ్చింది 2014లో 75 లోపు ఉన్న కందిపప్పు ఇప్పుడు డబుల్ ధరలు 165 వరకు పలుకుతుంది ఇప్పటికైనా అధిక ధరలను నియంత్రించకపోతే రాబోయే కాలంలో కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్కు వ్యతిరేకంగా మరింత ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని కేంద్ర ప్రభుత్వాన్నీ హెచ్చరించారు. అనంతరం అధిక ధరలను నియంత్రించాలని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్ఓ రాజేశ్వరికి సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి గోశిక మోహన్, కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, కే కనకరాజు, తాళ్లపల్లి మల్లయ్య, కన్నం లక్ష్మీనారాయణ, మడికొండ ఓదెమ్మ, తాళ్లపల్లి లక్ష్మణ్, కౌన్సిల్ సభ్యులు అసల రమా, కందుకూరి రాజారత్నం, అంజి, మాటాడి శంకర్, ఆరెపల్లి మానస్ కుమార్, కల్లేపల్లి నవీన్ కుమార్, శనిగరపు చంద్రశేఖర్, తిరుమల, అజ్మీర్ కరీం, యజరాజయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులచే గేయాలు ఆలపించారు.

# వర్షాకాలంపై అప్రమత్తంగా ఉండాలి

### గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం
### సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్

పిట్లం(నిజాంసాగర్) జూన్ 10 (వుదయం ప్రతినిధి) గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన గ్రామ సభలో పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై గ్రామస్తులతో చర్చించి, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సభలో మాట్లాడుతూ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, గ్రామ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, మురుగు కాలువల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మురుగు కాలువలను పరిశు



భ్రంగా ఉంచుకోవడం, వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, ప్రమాదకర ప్రాంతాల సమీపంలో నిర్లక్ష్యంగా సంచరించకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరం.

పారిశుద్ధ్యాన్ని కాపాడటం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవచ్చు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తాం అని సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ అన్నారు. గ్రామ సభలో గ్రామస్తులు తమ సమస్యలు, అవసరాలను సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సభలో గ్రామ పంచాయతీ సభ్యులు, అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో ఎక్కడా ధాన్యం కోతలు జరగలేదు...

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు...**
**రైతుల సంక్షేమమే లక్ష్యంగా రికార్డు స్థాయిలో వరి మొక్కజొన్న కొనుగోళ్లు...**
**48 నుంచి 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ...**
**హమాలీల గన్నీ బ్యాగుల కొరత ఉన్నప్పటికీ రికార్డు స్థాయిలో కొనుగోళ్లు పూర్తి...**
**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై మీడియా సమావేశంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల జూన్ 10 (వుదయం ప్రతినిధి) జగిత్యాల జిల్లాలో ఎక్కడా ధాన్యం కోతలు జరగలేదని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రికార్డు స్థాయిలో వరి మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు బుధవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు రబీ 2025-26 సీజన్‌లో జిల్లాలో 5.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు 5.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చిందన్నారు జిల్లాలో ఏర్పాటు చేసిన 436 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 5.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ధాన్యంలో కోతలు జరుగుతున్నాయని కొనుగోళ్లు సక్రమంగా లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి విమర్శించారు ఈ ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమన్నారు మిల్లర్ల వద్ద స్థల సమస్యలు ఎదురైన నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు జిల్లాను సందర్శించారని మిల్లర్లు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు ప్రతి మూడు రోజులకు ఒకసారి క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించామని తెలిపారు మొత్తం 81,954 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే 1,075 కోట్ల రూపాయలు విడుదల చేశామని దాదాపు 90 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు రైతుల ఖాతాల్లో 48 నుంచి 72 గంటల్లోనే నగదు జమ అవుతోందని పేర్కొన్నారు హమాలీల కొరత గన్నీ బ్యాగుల కొరత వంటి అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ జిల్లాలో రికార్డు స్థాయిలో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల వరి 47 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లు నిర్వహించగలిగామని మంత్రి వెల్లడించారు మాజీ ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి



ధాన్యంలో 10 కిలోల కోత విధించారని చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మంత్రి పేర్కొన్నారు ఆయనకు సంబంధించిన ట్రక్ షీట్‌ను మీడియా ముందు ఉంచుతున్నామని మొత్తం 190 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి పూర్తి చెల్లింపులు కూడా చేసినట్లు స్పష్టం చేశారు దేశంలో ఇంత పెద్ద ఎత్తున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం మరొకటి లేదని మంత్రి తెలిపారు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోళ్లతో పాటు ఇతర పంటల కొనుగోళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సూచనలు చేయాలని కోరారు అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ యాసంగి సీజన్ లో రికార్డు స్థాయిలో వరి మొక్కజొన్న దిగుబడులు మార్కెట్‌కు వచ్చాయని తెలిపారు జిల్లాలో సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో 1,100 కోట్ల రూపాయలకు పైగా జమ చేసినట్లు తెలిపారు ఈ సీజన్‌లో సుమారు 47 వేల టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు కేంద్ర ప్రభుత్వం కేవలం కనీస మద్దతు ధర ప్రకటించగా తెలంగాణ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి అన్ని పంటలను కొనుగోలు చేస్తోందన్నారు ఆంధ్రప్రదేశ్ బీహార్ వంటి రాష్ట్రాల్లో మొక్కజొన్న కొనుగోళ్లు జరగలేదని తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి మంత్రులు జిల్లా యంత్రాంగం సమన్వయంతో భారీ స్థాయిలో కొనుగోళ్లు నిర్వహించామని పేర్కొన్నారు రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం పట్ల రైతులు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ పౌర సరఫరాల శాఖ అధికారులు మీడియా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే నాణ్యమైన విద్యకు చిరునామాలు


**ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి**



మంథని, జూన్ 10 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే నాణ్యమైన విద్యకు చిరునామాలని, ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఆడెపు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జూన్ 6 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న ప్రవేశాల నమోదు కార్యక్రమం (ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్)లో భాగంగా బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథనిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఆడెపు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తమ గ్రామాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రభుత్వ విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ కర్నాటి కృష్ణ, చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, బోధనేతర సిబ్బంది సుధాకర్, రాజు, దుర్గరాజు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## కాంతివంతమైన మెరిసే ముఖం కోసం..!



ఫేస్ మాస్క్‌లు సాధారణంగా ముఖం అంతటికీ కాంతిని అందిస్తాయి. కానీ, ఈ లూమిలిప్స్ మాస్క్ ప్రత్యేకంగా పెదవులు, వాటి చుట్టూ ఉండే చర్మంపై దృష్టి పెడుతుంది. ఇది కాంతి కిరణాల సహాయంతో పెదవులలోని కొవ్వు పొరను లక్ష్యంగా చేసుకుని, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల పెదవులు సహజంగానే మృదువుగా, నిండుగా కనిపిస్తాయి. ఈ పరికరం రెండు మోడ్లలో పనిచేస్తుంది. ఒకటి: వాల్యూమ్ యాంటీ ఏజింగ్ మోడ్. ఇది పెదవుల చుట్టూ ఉండే ముడతలు, స్మైల్ లైన్స్, వయసురీత్యా వచ్చే మార్పులను తగ్గిస్తుంది. మరొకటి: గ్లో అండ్ సూతింగ్ మోడ్. ఇది చర్మ ఛాయను మెరుగుపరచడమే కాకుండా, పెదవులకు సహజమైన మెరుపును ఇస్తుంది.

ఈ మాస్క్‌ని రోజుకు 3 నుంచి 5 నిమిషాలు ఉపయోగిస్తే చాలు. కేవలం రెండు వారాల్లోనే స్పష్టమైన మార్పును గమనించవచ్చు. దీనిని ఉపయోగించినప్పుడు ఎలాంటి నొప్పి ఉండదు.

వైన్ తాగడం పురాతన కాలం నుంచి మామూలే! కానీ పురాతన కాలంలో వైన్‌ను ఒక సౌందర్య సాధనంగా కూడా ఉయోగించేవారు. రోమన్ మహిళలు ద్రాక్ష గింజలు, తొక్కలతో చేసిన మాస్క్‌లను ముడతలు పోగొట్టుకోవడానికి వాడేవారు. అలాగే ద్రాక్ష గుజ్జును బుగ్గలకు మంచి రంగు రావడం కోసం వాడేవారట! తరువాత 17వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లోని ఉన్నత వర్గాల మహిళలు చర్మం కాంతిమంతంగా మెరవడానికి రెడ్ వైన్‌తో ముఖం కడుక్కునే వారట! ముఖ్యంగా ఈ ప్రక్రియకే ఆధునికులు 'వైనోథెరపీ'గా పేరుపెట్టారు. వైనోథెరపీ ఎక్కువగా ప్రాచుర్యంలోకి వచ్చింది మాత్రం 1990లో. ఫ్రాన్స్‌కి చెందిన మథిల్డే థామస్, ఆమె భర్త బెర్రటాండ్ థామస్ ఈ ఆధునిక వైనోథెరపీకి మూలకారకులు. ఫ్రాన్స్‌లో మొదలైన ఈ వైనోథెరపీ ఇప్పుడు జపాన్, అర్జెంటీనా, అమెరికా, భారత్ వరకు విస్తరించింది. జుట్టు ఆరోగ్యంగా ఉండాలని ఒక్కోసారి మనం అతి జాగ్రత్తలతో చేసే పనులు సమస్యను తగ్గించడానికి బదులుగా మరింత పెంచుతాయి. జుట్టు జిడ్డుగా మారుతుందని తరచు షాంపూలతో తలస్నానాలు చేస్తుంటారు. దీనివల్ల తలలో సహజంగా ఉండే నూనెలు పోతాయి. చర్మం మరింత పొడిబారి, ఇంకా ఎక్కువ నూనెను ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల మైల్డ్ షాంపూలను మాత్రమే ఉపయోగించాలి. అలాగే వేసవిలో చాలామంది జుట్టును బిగుతుగా ముడి వేస్తుంటారు. దీనివల్ల తలలో చెమట, వేడి పెరిగి జుట్టు కుదుళ్లు బలహీన పడతాయి. అలాగే డ్రై షాంపూలు, స్ప్రేలు వాడినప్పుడు అవి చెమటతో కలిసి తల మీద ఒక పొరలా పేరుకుపోతాయి. ఇవి చర్మరంధ్రాలను మూసివేసి ఇన్ఫెక్షన్లకు దారి తీస్తాయి. అందువల్ల తలపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడానికి సున్నితమైన స్క్రబ్‌ను వాడాలి. ఎండలో వెళ్లేటప్పుడు హ్యాట్, లేదా స్కార్ఫ్ ధరించాలి. సూర్యరశ్మి వల్ల తల చర్మం దెబ్బతిన కుండా ఉంటుంది. మన ముఖ చర్మం లాగే, తల చర్మం కూడా చాలా ముఖ్యం. అందువల్ల తలపై దురద పెడుతున్నా, జుట్టు పల్చబడుతున్నా, జిడ్డుగా ఉంటున్నా– అది మీ సహాయం కోరుతోందని అర్థం. అందువల్ల సమస్య చిన్నగా ఉన్నప్పుడే సరైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జుట్టు రాలడాన్ని అరికట్టవచ్చు.

## ఎండల్లో హాయినిచ్చే రంగులు...

ఎండా కాలంలో వేడి నుంచి ఉపశమనం పొందడానికి మనం తీసుకునే ఆహారం, అలవాట్లే కాదు, మనం ధరించే దుస్తుల రంగులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి స్టైలిష్‌గా కనిపించేలా చేయడమే కాకుండా, శరీరానికీ చల్లదనం అందిస్తాయి. మరి ఎలాంటి రంగుల్ని ఎంచుకోవాలో తెలుసా?

తెలుపు: వేసవి ఫ్యాషన్‌లో తెలుపు రంగుది ప్రత్యేక స్థానం. ఇది సూర్యరశ్మిని గ్రహించకుండా వెనక్కి తిప్పి పంపిస్తుంది. దీనివల్ల వేడి తక్కువగా అనిపిస్తుంది. తెల్లటి కాటన్ కుర్తాలు, ఖాదీ చీరలు, లినెన్ షర్టులు వంటివి ధరించడం వల్ల క్లాసీ లుక్ వస్తుంది.



పసుపు: ఎండాకాలం అంటేనే పసుపు పచ్చని మెరుపు. అయితే ముదురు పసుపు కాకుండా లెమన్ ఎల్లో, సాఫ్ట్ ఎల్లో ఛాయలను ఎంచుకుంటే చూడచక్కగా అనిపిస్తుంది. వైట్ ప్యాంట్స్ లేదా పలాజోలపై ఎల్లో ట్యూనిక్స్ ధరిస్తే ఆ స్టైలే వేరు.


పేస్టల్ కలర్స్: ప్రస్తుతం ఫ్యాషన్ ప్రపంచంలో పేస్టల్ రంగులదే హవా. ముదురు రంగుల కంటే లేలేత ఛాయలు కంటికి ఆహ్లాదాన్నిస్తాయి.

మింట్ గ్రీన్: ప్రకృతికి దగ్గరగా ఉండే మింట్ గ్రీన్ వేసవిలో ఫ్రెష్ లుక్‌నిస్తుంది. లావెండర్ రాయల్ లుక్ ఇవ్వడమే కాకుండా, ఎండలో తిరిగేటప్పుడు కూడా హుందాగా ఉంటుంది.

పీచ్ –కోరల్: కాషాయ వర్ణంలో లేత ఛాయలైన పీచ్ – కోరల్ రంగులు వేసవి సాయంత్రాలకు సరైన ఎంపిక. ఇవి చర్మఛాయను ప్రకాశవంతంగా చూపిస్తాయి. కాటన్ శారీలు లేదా ఫ్రాక్ స్టైల్ డ్రెస్సుల్లో ఈ కలర్స్ అద్భుతంగా ఉంటాయి. రంగు ఎంత బాగున్నా, వస్త్రం సరిగ్గా లేకపోతే ఇబ్బంది తప్పదు. వేసవిలో కాటన్, లినెన్, మల్‌మల్ వస్త్రాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వండి. ఇవి చెమటను త్వరగా పీల్చుకుని చర్మాన్ని పొడిగా ఉంచుతాయి.

## మండే ఎండల్లో.. అవి రోజూ వద్దు!

మండే ఎండల్లో ఉక్కపోత, చెమటలు పట్టడం, చర్మం జిడ్డుగా మారడం.. వంటివి సహజం. అలాగని వీటిని నిర్లక్ష్యం చేస్తే వివిధ రకాల చర్మ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. ఇలా జరగకుండా ఉండా లంటే కొన్ని చిట్కాలు మేలు చేస్తాయని చెబుతున్నారు. వేసవిలో ఉండే విపరీతమైన వేడి కారణంగా చెమట భరించలేక తరచూ మొహం కడుక్కోవడం మామూలే. కానీ ఈ కాలంలో వీలైనంత తక్కువగా ఫేస్‌వాష్ చేసుకోవాలని సౌందర్య



నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఎక్కువసార్లు ముఖం కడుక్కున్నప్పుడు చర్మం పైపొరల్లో ఉండే సహజసిద్ధమైన నూనెలు తొలగిపోతాయి.. అలాగే ఈ క్రమంలో మనం వాడే క్లెన్సర్లలోని రసాయనాల వల్ల చర్మం తేమను కోల్పోయి పొడిబారిపోతుంది. కాబట్టి ఈ కాలంలో క్లెన్సర్ల వినియోగం తగ్గించాలంటున్నారు నిపుణులు. అందు లోనూ సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన క్లెన్సర్లు, సబ్బులు వాడడం.. రోజులో రెండు మూడుసార్లు ముఖం శుభ్రం చేసుకోవాలనుకుంటే సాధారణ నీటితో క్లీన్ చేసుకోవడం.. మంచిదంటున్నారు నిపుణులు. బాగా ఉక్కపోతగా ఉన్నప్పుడు– మెడ, చంకలు, మోకాళ్లు, మోచేతులు.. వంటి శరీర భాగాల్లో చెమట ఎక్కువగా పడుతుంటుంది. అయితే ఆయా ప్రదేశా ల్లో ఎక్కువ సేపు చెమట అలా నిలిచి ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.. కాటన్ దుస్తులు ధరిస్తే అవి చెమటను సులభంగా పీల్చుకుంటాయి. అలాగే ఇంటికొచ్చాక వెంటనే యాంటీ ఫంగల్ సబ్బు ఉపయోగించి స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు. ఫలితంగా దుమ్ము, ధూళితో పాటు.. చెమట కారణంగా చర్మ సంబంధిత సమస్యలకు కారణమయ్యే బ్యాక్టీరియా సైతం సులభంగా తొలగిపోతుందని చెబుతున్నారు. వేసవిలో చెమట వల్ల చిరాగ్గా అనిపించి రోజూ తలస్నానం చేస్తుంటారు కొందరు. అయితే దీనివల్ల కుదుళ్లు పొడిబారి జుట్టు బలహీనపడే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. తద్వారా జుట్టు రాలిపోయే సమస్య కూడా ఎక్కువవుతుందని చెబుతున్నారు. కాబట్టి వారానికి రెండుసార్లు గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయడం శ్రేయస్కరం అని చెబుతున్నారు. కుదుళ్లకు చల్లదనాన్ని అందించే కలబంద–పెరుగు.. వంటిసహజసిద్ధమైన హెయిర్ మాస్కుల్ని అప్లై చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు.

## కరివేపాకుతో పానీయం

పండ్లతోనే కాదు కాయగూరలతోనూ కాన్‌సన్ట్రేట్ డ్రింక్ తయారుచేయొచ్చు. కరివేపాకుతో చిక్కటి పానీయం చేసి నిలవుంచుకుంటే.. ఎప్పుడంటే అప్పుడు తాగొచ్చు.

కావలసినవి: కరివేపాకు – రెండు కప్పులు, నిమ్మరసం – 2 స్పూన్లు, జీలకర్ర – టేబుల్ స్పూన్, మిరియాలు – స్పూన్, అల్లం తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, బెల్లంపొడి – కప్పు, నెయ్యి – స్పూన్, ఇంగువ – చిటికెడు

తయారీ: కరివేపాకును కడిగి, వస్త్రం మీద ఆరబెట్టాలి. కడాయిలో జీలకర్ర, మిరియాలను వేయించాలి. చల్లారాక.. కరివేపాకు, అల్లం, కప్పు నీళ్లు జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీన్ని మందమైన గిన్నెలోకి తీసి.. సన్న సెగ మీద వేడిచేయాలి. ఆరేడు నిమిషాల తర్వాత బెల్లంపొడి, ఉప్పు, ఇంగువ, నెయ్యి వేసి కలియబెడుతూ ఉడికించాలి. మిశ్రమం చిక్కగా అయ్యాక స్టవ్ ఆఫ్ చేయాలి. పూర్తిగా చల్లారిన తర్వాత నిమ్మరసం కలపాలి. అంతే.. ఆరోగ్యకరమైన పానీయం సిద్ధమవుతుంది. పూర్తిగా చల్లారాక.. శుభ్రమైన సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకుంటే రెండు నెలలు నిల్వ ఉంటుంది. తాగదలచినప్పుడు గ్లాసు చల్లని నీళ్లలో రెండు స్పూన్ల కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. ఫ్రిజ్‌లో కాకుండా బయట ఉంచేట్లయితే.. మిశ్రమాన్ని ఇంకొంచెం చిక్కబడేట్లు ఉడికించాలి. ఇది మూడు నుంచి నాలుగు వారాలు నిల్వ ఉంటుంది. ఈ పానీయం జీర్ణశక్తిని పెంచుతుంది, రక్తహీనతను తగ్గిస్తుంది. కురులను సంరక్షిస్తుంది. నిమ్మరసం చల్లారిన తర్వాతే కలపాలి. సీసాలో ఎంతమాత్రం తడి ఉండకూడదు. తడి స్పూన్ ఉపయోగించకూడదు.



## కుంకుడు కాయలు.. ఇలా కూడా..!

ఒకప్పుడు తలస్నానం చేయడానికి కుంకుడు కాయలనే ఉపయోగించేవారు. అయితే మార్కెట్లోకి షాంపూలు అందుబాటులోకి వచ్చాక వాటి వాడకం బాగా తగ్గిపోయింది. అయితే కేవలం జుట్టును శుభ్రపరచుకోవడానికే కాకుండా ఇంట్లో ఇతరత్రా పనులకు కూడా కుంకుడు కాయల్ని ఉపయోగించుకోవచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి.. కప్పు నీటిలో రెండు కుంకుడు కాయలు వేసి అరగంట పాటు మరగబెట్టాలి. ఆ తర్వాత పూర్తిగా చల్లారనిచ్చి వడకట్టుకోవాలి. దీనికి మీకు నచ్చిన ఫ్లేవర్ అరోమా ఆయిల్‌ని కొన్ని చుక్కలు వేసి కలుపుకోవాలి. అనంతరం శుభ్రంగా కడిగి పొడిగా ఆరబెట్టుకున్న బాటిల్‌లో ఈ మిశ్రమాన్ని పోసి ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవాలి. దీన్ని స్నానం చేసేటప్పుడు సబ్బుకి బదులుగా ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు. కిటికీల అద్దాలను తుడవడానికి సాధారణంగా మార్కెట్లో దొరికే క్లీనింగ్ లిక్విడ్‌లను ఉపయోగిస్తాం. అయితే వీటికి బదులుగా కుంకుడు కాయలను ఉపయోగించి కూడా ఇంట్లోనే గ్లాస్‌క్లీనర్‌ను తయారు చేసుకోవచ్చు. దీనికోసం కుంకుడు కాయలతో తయారు చేసుకున్న లిక్విడ్ సోప్ ఒక టేబుల్ స్పూన్, రెండు టేబుల్ స్పూన్ల వైట్ వినెగర్, అరకప్పు నీటిని తీసుకొని బాగా కలుపుకోవాలి. దీన్ని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేయాలి. అనంతరం దీన్ని కిటికీ అద్దంపై స్ప్రే చేసి మెత్తటి వస్త్రంతో తుడిచేయాలి. ఇలా చేస్తే కిటికీ అద్దాలపై పేరుకున్న దుమ్ము తొలగిపోయి అవి కొత్త వాటిలా మెరుస్తాయట. పట్టు, జరీ దుస్తుల్ని ఉతకడానికి కుంకుడు కాయలు చక్కటి ప్రత్యామ్నాయం. దీనికోసం కొన్ని కుంకుడు కాయలను చల్లటి నీటిలో నానబెట్టి వాటి రసాన్ని తీయాలి. ఈ మిశ్రమంతో పట్టు, జరీ వస్త్రాలను ఉతికితే అవి ఎక్కువ కాలం మన్నడంతో పాటు రంగు వెలిసిపోకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. అంటే పట్టు, ఇతర సున్నితమైన వస్త్రాల్ని మనం ఎలాగైతే షాంపూ వాష్ చేస్తామో.. ఆ షాంపూ బదులుగా ఈ సహజసిద్ధమైన షాంపూను ఉపయోగించచ్చన్నమాట! అరకప్పు కుంకుడుకాయ రసానికి రెండు చెంచాల వైట్ వినెగర్, కొద్దిగా నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేసుకోవాలి. దీంతో కిచెన్ ప్లాట్‌ఫాం, వాష్‌బేసిన్ లాంటివి శుభ్రం చేసుకోవచ్చు. అలాగే దీన్ని బాత్‌రూం క్లీనర్‌గా కూడా ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు.



## అలవాట్లు వదులుకోనక్కర్లేదు!



ఆరోగ్యంగా ఉండాలనీ... ఫిటెనెస్‌కి ప్రాధాన్యం ఇవ్వాలనీ... ఎంతో ఆసక్తిగా వ్యాయామాలు, నడక, పరుగు వంటివి మొదలుపెడతాం. ఇష్టంగా వాటికి కావాల్సిన ట్రాక్స్, టాంక్ టాప్స్, షూస్ అన్నీ కొనుక్కుంటాం. కానీ రెండు మూడు రోజులకే అన్నీ అటకెక్కిపోతాయి. సమయం లేదు, నిద్రలేమి, నిస్సత్తువ అంటూ రకరకాల కారణాలు చెబుతాం. మీదే కాదు, చాలామంది పరిస్థితి ఇదే. అందుకే 'హ్యాబిట్ స్టాకింగ్' అలవరుచుకోమంటున్నారు నిపుణులు. అంటే సమయం ఉన్నప్పుడూ, ఆరోగ్యం సహకరించినప్పుడూ ఎలానో వాకింగ్, జాగింగ్ వంటి వాటికి వెళుతుంటాం కదా! అలా లేనప్పుడు రోజూ చేసే పనులతో వ్యాయామాలు జత చేయడమే హ్యాబిట్ స్టాకింగ్. బ్రష్ చేస్తూ స్ట్రెంత్‌నింగ్ వ్యాయామాలు చేయడం. అటూ ఇటూ నడవడం. కాఫీ తాగడం అయిపోయాక పది నిమిషాలు కళ్లు మూసుకుని ధ్యానం చేయడం. నిద్రకు ముందు కనీసం పుస్తకంలో ఒక్క పేజీ అయినా చదవాలనే నియమం పెట్టుకోవడం... వంటివి దీని జాబితాలోకి వస్తాయి. దీనివల్ల అలవాట్లని దాటవేస్తున్నాం అన్న భావన ఉండదు. రోజువారీ పనులు పూర్తి చేస్తూనే... అలవాట్లు వదులుకోకుండా కొనసాగించిన వాళ్లు అవుతారు. నచ్చితే ప్రయత్నం చేయండి మరి!

## నోరూరించే పుచ్చకాయ పానీయం

ఎండా కాలం వచ్చేసింది. తేనీరు కంటే చల్లటి పానీయాలు తాగాలనిపిస్తుంది. మార్కెట్లో దొరికే కూల్‌డ్రింక్స్ కొనే బదులు మనమే కాన్‌సన్ట్రేట్ చేసుకోవచ్చు. మీ కోసం పుచ్చకాయలతో పానీయం.. ఈ పానీయం కోసం.. చెక్కు, గింజలు తీసిన పుచ్చకాయ ముక్కలు – నాలుగు కప్పులు, నీళ్లు – కప్పు, పంచదార – రెండు కప్పులు, ఉప్పు – చిటికెడు, నిమ్మరసం – నాలుగు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి – అర స్పూన్ తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. పుచ్చకాయ ముక్కలను గ్రైండ్ చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో పంచదార, కప్పు నీళ్లు పోసి వేడిచేయాలి. పంచదార కరిగిన తర్వాత పుచ్చకాయ రసం, యాలకుల పొడి జతచేసి ఉడికించాలి. అడుగంటకుండా మధ్యమధ్యలో కలియబెడుతుండాలి. చివర్లో నిమ్మరసం, ఉప్పు కూడా వేసి.. కొన్ని క్షణాలుంచి దించేయాలి. మరీ ఎక్కువసేపు ఉంచితే రంగు మారుతుందని గుర్తుంచుకోవాలి. చల్లారిన తర్వాత తడి లేని సీసాలోకి తీసి భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు గ్లాసు నీళ్లలో రెండు స్పూన్ల కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. నెల రోజులు నిలవుంటుంది. మరి కొంత కాలం నిల్వ ఉండాలంటే ఇంకో స్పూన్ నిమ్మరసం అదనంగా జోడించాల్సి ఉంటుంది.



### డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం..

భారత్‌లో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం కలిగింది. దిల్లీలో ఈ సంస్థకు చెందిన థర్డ్ పార్టీ డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం జరగడంతో నెట్‌వర్కింగ్ పరికరాలు షట్‌డౌన్ అయ్యాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో క్లౌడ్ సేవలకు ఆటంకం ఏర్పడింది. ఈమేరకు క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్ వెల్లడించింది. అయితే ఈ ప్రమాదం ఎప్పుడు జరిగిందో మాత్రం చెప్పలేదు. ప్రాణ, ఆస్తి నష్టం గురించిన వివరాలు తెలియాల్సి ఉంది.

# బిజినెస్

## AI డేటా సెంటర్.. చేతులు కలిపిన మెటా, రిలయన్స్



ప్రపంచవ్యాప్తంగా తయారయ్యే డేటాను నిల్వ చేయడం, వినియోగదారులకు చేర్చడంలో డేటా సెంటర్లు కీలకం. ఇప్పుడు ఇలాంటి డేటా సెంటర్ ఏర్పాటు కోసం రిలయన్స్, సోషల్ మీడియా దిగ్గజం మెటా చేతులు కలిపాయి. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో 168 మెగావాట్ల డేటా సెంటర్‌ను అభివృద్ధి చేయడానికి భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. రెండేళ్లలో ఇది అందుబాటులోకి రానుంది. ఈమేరకు బుధవారం రెండు సంస్థలు ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. మెటా (Meta) ప్రపంచవ్యాప్త మౌలిక సదుపాయాలకు ఈ డేటా సెంటర్ సేవలందిస్తూ.. దాని వ్యాపార, ఏఐ కంప్యూటింగ్ అవసరాలనూ తీర్చనుంది. 1GW పునరుత్పాదక శక్తి విషయంలో క్లీన్‌మ్యాక్స్, ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీలతో భాగస్వామ్యంపై మెటా ప్రకటన చేసింది. కాగా, మెటా, రిలయన్స్ కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్నాయి. 2020లో జియో ప్లాట్‌ఫామ్స్‌లో మార్క్ జుకర్‌బర్గ్ సంస్థ 9.99 శాతం వాటాను కొనుగోలు చేసింది. అలాగే రెండూ కలిసి 100 మిలియన్ డాలర్లతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటుచేశాయి. దేశీయ, అంతర్జాతీయ సంస్థల కోసం ఏఐ సొల్యూషన్లను అభివృద్ధి చేయనున్నాయి. మెటాతో పార్ట్‌నర్‌షిప్‌పై ప్రకటన రాగానే రిలయన్స్ షేర్లు రెండు శాతం మేర పెరిగాయి. బుధవారం ఉదయం బీఎస్‌ఈలో ఈ స్టాక్ విలువ 2.39 శాతం పెరిగి రూ.1300కు చేరింది.

## విమాన ఇంధనం మరో 10% భారం



దేశీయ విమానయాన సంస్థలకు విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర మంగళవారం మరో 10% పెరిగింది. ఇప్పటివరకు ఏటీఎఫ్ లీటరు ధర దిల్లీలో రూ.104.927 గా ఉండగా, ఇది రూ.115కు చేరింది. ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఏటీఎఫ్ ధరల స్థిరీకరణ విధానాన్ని అమల్లోకి తేవడమే ఇందుకు కారణం. దీనికింద దేశీయ విమానయాన కంపెనీలకు మూడేళ్లపాటు ఏటీఎఫ్ ధర స్థిరంగా ఉంటుంది. ఇందువల్ల అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తీవ్రంగా పెరిగినా, దేశీయ విమాన కంపెనీలకు మారదు. టికెట్ ఛార్జీల రూపేణ ప్రయాణికులకూ ఊరట కలుగుతుంది. ఈ విధానాన్ని ఎంచుకోని విమానయాన సంస్థలు మాత్రం, చమురు మార్కెట్‌కు అనుగుణంగా ధర చెల్లించాల్సి వస్తుంది. అంటే అంతర్జాతీయ విమానయాన సంస్థల తరహాలో లీటరుకు రూ.142 చొప్పున భరించాల్సి వస్తుంది. అయితే ముడిచమురు ధర బాగా తగ్గితే మాత్రం, వీరికి ఆమేర ప్రయోజనం లభిస్తుంది. ఇరాన్ యుద్ధానికి ముందు ఈ ధర లీటరుకు రూ.60.50గా ఉండేది. స్థిరీకరణ పథకాన్ని ఎంచుకున్న దేశీయ విమానయాన కంపెనీలు, లీటరుకు రూ.86.32 చొప్పున ఫ్రీఆన్‌బోర్డ్ ప్రామాణిక ధర చెల్లించాలి. దీనిపై విమానాశ్రయ ఛార్జీ, చమురు కంపెనీల మార్జిన్లు, పన్నుల వంటి జతవుతాయి. ఫలితంగా ఏటీఎఫ్ లీటరు ధర దిల్లీలో రూ.115, ముంబయిలో రూ.114.5, చెన్నైలో రూ.139కి చేరింది. దేశీయ విమానయాన కంపెనీలకు 2 నెలలుగా ఏటీఎఫ్ ధర సవరించడం లేదు. ఇందువల్ల చమురు మార్కెటింగ్ కంపెనీలు నష్టపోతున్నాయి. వీటిని గట్టెక్కించేందుకే రూ.10,000 కోట్లతో ఏటీఎఫ్ ధరల స్థిరీకరణ నిధిని కేంద్రప్రభుత్వం ప్రతిపాదించింది. ఏటీఎఫ్ లీటరు ప్రామాణిక ధర రూ.86.32 కంటే అంతర్జాతీయంగా ధర పెరిగితే, కేంద్రప్రభుత్వం వడ్డీలేకుండా చమురు కంపెనీలకు ఆ మేరకు రుణం ఇస్తుంది. దీనికంటే తగ్గినప్పుడు, కంపెనీల నుంచి వసూలు చేసుకుంటుంది. విమానయాన కంపెనీల నిర్వహణ వ్యయంలో ఏటీఎఫ్ వాటా 40-60% అవుతోంది.

## ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అండతో ఉదయం లాభాల్లో రాణించిన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో ఆ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో సెన్సెక్స్ 64 పాయింట్లు లాభంతో ముగియగా.. నిఫ్టీ 27.15 పాయింట్లు నష్టపోయింది. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు మేర క్షీణించింది. సెన్సెక్స్ ఉదయం 73,988.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,918.76) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడే లో 74,613.01 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి ఆరంభ లాభాలను కోల్పోయి 73,983.18కి పరిమితమైంది. నిఫ్టీ 23,214.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ముడి చమురు బ్యారెల్ ధర 91.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4167 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### అదరగొట్టిన సీఎంఆర్ గ్రీన్..



నాన్-ఫెర్రస్ లోహాల రీసైక్లర్ సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ స్టాక్ మార్కెట్లలోకి ఘనంగా అడుగుపెట్టింది. బుధవారం ఈ కంపెనీ షేర్లు లిస్టింగ్‌లో అదరగొట్టాయి. దాదాపు 43 శాతానికి పైగా ప్రీమియంతో లిస్ట్ అయ్యాయి. ఈ షేర్ల ఇష్యూ ధర రూ.192 కాగా.. 43.43 శాతం పెరిగి బీఎస్‌ఈలో రూ.275.40 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. ఎన్‌ఎస్‌ఈలోనూ 39.58 శాతం ప్రీమియంతో రూ.268 వద్ద లిస్ట్ అయ్యాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.5,504.86 కోట్లకు పెరిగింది. ఈ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించిన సంగతి తెలిసిందే. 127 రెట్లు సబ్ స్క్రైబ్ అయ్యింది. రూ.631 కోట్ల ఐపీఓలో ఒక్కో ఈక్విటీ షేరు ధరల శ్రేణి రూ.182-192గా కంపెనీ నిర్ణయించింది. 2,30,43,930 షేర్లకు గానూ.. 2,92,75,44,594 (292 కోట్లు) షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

## ఈక్విటీ MFలో తగ్గిన పెట్టుబడులు..


ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి నిధుల ప్రవాహం తగ్గుముఖం పట్టింది. మే నెలలో ఈ విభాగంలోకి రూ.22,908 కోట్ల నిధులు మాత్రమే వచ్చాయి. ఈ ఏడాదిలో ఇదే కనిష్ఠం కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.38,440 కోట్లు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రాగా.. ఆ నెలతో పోలిస్తే నిధుల ప్రవాహం 40 శాతం తగ్గుముఖం పట్టింది. గత కొన్ని రోజులుగా మార్కెట్ ఒడుదొడుకులకు లోనవుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (Amfi) మే నెలకు సంబంధించిన గణాంకాలను బుధవారం విడుదల చేసింది. మొత్తంగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు సంబంధించి ఏప్రిల్ నెలలో నికరంగా రూ.3.22 లక్షల కోట్లు పెట్టుబడులు రాగా.. మే నెలలో రూ.64,131 కోట్ల నిధులు తరలిపోయాయి. ముఖ్యంగా డెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ కేటగిరీ నుంచి రూ.96,948 కోట్ల నిధులు తరలిపోవడం ఇందుకు ప్రధాన కారణం.
ఈక్విటీ స్కీమ్స్ వారీగా చూసినప్పుడు.. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.5,175 కోట్లు నిధులు వచ్చాయి. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,945 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,385 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.1,593 కోట్లు చొప్పున నిధులు వచ్చాయి. డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్, ఈక్విటీ



లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ నుంచి మే నెలలో నిధులు తరలిపోయాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌కు (Gold ETFs) సంబంధించి ఏప్రిల్ నెలలో రూ.3,040 కోట్లు నిధులు రాగా.. మే నెలలో రూ.725 కోట్లు తరలిపోయాయి. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ వద్ద నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (AUM) అంతకుముందు నెలతో పోల్చినప్పుడు రూ.81.92 లక్షల కోట్ల నుంచి మే నెలలో రూ.81.6 లక్షల కోట్లకు తగ్గినట్లు యాంఫీ వెల్లడించింది.

# క్రీడలు

### ఒక్కసారిగా కుప్పకూలిన స్పైడర్ కెమెరా.. వీడియో వైరల్



ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పెనుప్రమాదం తప్పింది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో స్పైడర్ కెమెరా ఒక్కసారిగా కిందపడిన ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. హంగేరీ, కజికిస్థాన్ జట్ల మధ్య స్నేహపూర్వక మ్యాచ్ జరిగింది. ఆ సమయంలో స్పైడర్ కెమెరా తీగలు తెగిపోవడంతో ఒక్కసారిగా అది కిందకు పడిపోయింది. దాదాపు 20 మీటర్ల ఎత్తు నుంచి కిందకు పడింది. ఆ పక్కనే ఓ కెమెరామెన్ ఉన్నాడు. అతడికి కాస్త దూరంలో స్పైడర్ కెమెరా పడిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. దీంతో మ్యాచ్ నిర్వాహకుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. సరైన ఏర్పాట్లు చేయని ఫెడరేషన్‌పై చర్యలు తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేశారు.

## పంత్ విచిత్రమైన షాట్లతో కొన్నిసార్లు భారత్‌కు నష్టం: అశ్విన్

అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో టీమ్‌ఇండియా భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ సెంచరీలు సాధించారు. రిషభ్ పంత్ (81), సాయి సుదర్శన్ (81), వాషింగ్టన్ సుందర్ (52★) హాఫ్ సెంచరీలతో దుమ్ము రేపారు. శతకం చేసే అవకాశం



సుదర్శన్‌తోపాటు రిషభ్ పంత్ చేజార్చుకున్నాడు. అయితే, రిషభ్ పంత్ ఇలా 80లు, 90ల్లో ఔట్ కావడం ఇదేమీ కొత్త కాదు. భిన్నమైన షాట్లు ఆడి మరీ వికెట్‌ను సమర్పించిన రోజులున్నాయి.
దీనివల్ల టీమ్‌ఇండియాకు కొన్నిసార్లు నష్టం వాటిల్లినట్లు మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇప్పటివరకు 50 టెస్టులు ఆడిన పంత్ ఖాతాలో 8 సెంచరీలు మాత్రమే ఉన్నాయి. మరో ఎనిమిదిసార్లు శతకాలు చేసే అవకాశం కాస్తలో చేజార్చుకున్నాడు.
''రిషభ్ పంత్ చాలాసార్లు 80లు, 90ల వద్ద ఔటయ్యాడు. అయితే, ఇలాంటి దూకుడైన బ్యాటర్ టెస్టుల్లో దొరకడం కష్టమే. కానీ, 80ల్లోకి వచ్చాక భిన్నమైన షాట్లను ప్రయత్నించి పెవిలియన్‌కు చేరడం ఆశ్చర్యంగా అనిపిస్తూ ఉంటుంది. మరో 20 పరుగులు చేస్తే సెంచరీ అయిపోతుంది. అలా ఆడేందుకు ప్రయత్నించలేడా? విచిత్రమైన షాట్లతో భారత్‌కు కొన్నిసార్లు నష్టం కలిగించాడు. బ్యాటర్‌గా అతడు అదనపు బాధ్యత తీసుకోవాలి. సెంచరీలుగా మలచాలి. అప్పుడు అతడి గణాంకాలు ఇప్పటికంటే అద్భుతంగా ఉండేవి'' అని అశ్విన్ తెలిపాడు. ''ప్రతి బ్యాటరూ పొరపాట్లు చేయడం సహజమే. కానీ, రిషభ్ పంత్ పదేపదే అవే తప్పులను చేస్తుండటమే నిరాశకు గురిచేస్తోంది. అది తప్పు అని చాలామంది చెప్పినా సరే.. మళ్లీ చేస్తూనే వెళ్తున్నాడు. ఇప్పటికే 50 టెస్టులు ఆడాడు. ఇకనైనా జట్టు కోసం పరిస్థితులకు తగ్గట్టుగా ఆడాల్సిన అవసరం ఉంది'' అని అశ్విన్ సూచించాడు.

## గోల్డ్ మెడల్ కోసం.. విరాట్‌తో సూర్యవంశీని బరిలోకి దింపాలి: శ్రీశాంత్



దాదాపు వందేళ్ల అనంతరం ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చూడబోతున్నాం. లాస్ ఏంజెలెస్ వేదికగా 2028లో ఒలింపిక్స్ జరగబోతున్నాయి. టీమ్‌ఇండియా స్వర్ణ పతకం నెగ్గాలనేదే అభిమానుల ఆకాంక్ష. టీ20 ఫార్మాట్‌లో ఈ మ్యాచులు జరుగుతాయి. విరాట్ కోహ్లీతో కలిసి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఓపెనర్‌గా పంపించాలని మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సూచించాడు. అయితే, విరాట్ కోహ్లీ టీ20లకు వీడ్కోలు చెప్పిన సంగతి తెలిసిందే. కానీ, ఒలింపిక్స్‌లో ఆడాలని ఉందని గతంలో విరాట్ తన మనసులోని మాట వెల్లడించాడు. ఇప్పుడు వైభవ్ దూకుడుకు విరాట్ సీనియారిటీ కలిస్తే బాగుంటుందనేది శ్రీశాంత్ అభిప్రాయం. ''వైభవ్ సూర్యవంశీ ఆటను చూస్తుంటే ముచ్చటేస్తోంది. అద్భుతంగా ఆడేస్తున్నాడు. రాబోయే ఒలింపిక్స్‌లో మనం గోల్డ్ పతకం కొట్టాలంటే బెస్ట్ టీమ్‌నే పంపించాలి. విరాట్ కోహ్లీ జట్టులో ఆడాలని విజ్ఞప్తి చేస్తున్నా. అప్పుడు వైభవ్ సూర్యవంశీతో కలిసి విరాట్ ఓపెనింగ్ చేయొచ్చు. సీనియర్, జూనియర్‌తో జట్టు సమతూకంగా ఉంటుంది. ఈ జోడీని చూసేందుకూ బాగుంటుంది. ముందుగా విరాట్ కోహ్లీని టీ20 జట్టులో ఆడమని సెలక్టర్లు కోరాలి. అతడి ఫిట్‌నెస్‌ను చూస్తే వయసు సమస్యే కాదు. నేను చెప్పే మాటలు వివాదానికి దారితీసినా ఫర్వాలేదు. ఎలాగైనా సరే విరాట్‌ను ఒప్పించాలి. ఒలింపిక్స్‌లో ఆడేలా చూడాలి'' అని శ్రీశాంత్ తెలిపాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే టీమ్‌ఇండియాకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీ.. తుది జట్టులో ఆడితే మాత్రం చరిత్ర సృష్టించినవాడవుతాడు.


## కౌంటీ క్రికెట్‌లోకి మానవ్ సుతార్

అడుగుపెట్టిన తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టే ప్రదర్శన ఇచ్చాడు యువ స్పిన్నర్ మానవ్ సుతార్. అఫ్గాన్‌పై ఒకే ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. బ్యాటింగ్‌లోనూ మెరుగైన ఆటతీరే ప్రదర్శించాడు. సీనియర్ రవీంద్ర జడేజాను గుర్తు చేశాడంటూ అభిమానులు సంతోషపడ్డారు. ఈ క్రమంలో మానవ్ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. ఎర్రబంతి క్రికెట్‌లో మెరుగైన ఆటతీరు కోసం కౌంటీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో తర్వాత రెండు రౌండ్లలో ఆడతాడని వార్విక్‌షైర్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. ''ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచేందుకు ప్రయత్నిస్తాం. అతడితో మేం



ఒప్పందం చేసుకోవడం సంతోషంగా ఉంది'' అని వార్విక్‌షైర్ వెల్లడించింది. మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తానని మానవ్ సుతార్ తెలిపాడు. తొలి టెస్టు మ్యాచ్‌లోనే ఏడు వికెట్లు తీసిన మానవ్ సుతార్.. 29 ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో 129 వికెట్లు పడగొట్టాడు. అతడి బెస్ట్ బౌలింగ్ గణాంకాలు 11/62. ఇక లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చే అతడు 950కిపైగా పరుగులు చేశాడు.

## విరాట్ బాటలోనే హార్దిక్ పాండ్య!



మరో మూడు రోజుల్లో అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో భారత జట్టుకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే విరాట్ కోహ్లీ వన్డే సిరీస్‌కు దూరమైన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడి బాటలో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కూడా సిరీస్ నుంచి వైదొలిగినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అయితే, పాండ్య ఫిట్‌నెస్‌పై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సంతృప్తి వ్యక్తం చేసిన రోజు వ్యవధిలోనే ఈ నిర్ణయం రానుండటం గమనార్హం. వెన్నునొప్పితో ఐపీఎల్‌లోనూ హార్దిక్ పాండ్య కొన్ని మ్యాచులు ఆడలేదు. ఐపీఎల్ ముగిసిన తర్వాత.. రోహిత్‌తోపాటు హార్దిక్ కూడా ఫిట్‌నెస్ టెస్టు ఎదుర్కొన్నాడు. అంతా ఓకే అనుకున్నాక.. ఇప్పుడు తొడ కండరాల గాయంతో మూడు వారాలు ఆటకు దూరంగా ఉంటాడని వార్తలు వచ్చాయి. మరి అతడి స్థానంలో ఎవరిని రిప్లేస్ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. విరాట్ కోహ్లీ ప్లేస్‌లో యశస్వి జైస్వాల్‌కు బీసీసీఐ అవకాశం ఇచ్చింది. వన్డే ప్రపంచ కప్ 2027 టోర్నీ కోసం సన్నద్ధతలో భాగంగా భారత్ కేవలం తొమ్మిది మ్యాచులు మాత్రమే ఆడనుంది.

